www.jagritiweekly.com
సంపుటి : 77 సంచిక : 29 పుటలు : 52

# జాగృతి

కలి 5127-శ్రీ విశ్వావసు వైశాఖ పూర్ణిమ
12-18 మే 2025
వెల : ₹20/-



# మన తరానికి మహత్తర ఘట్టం

## కంచి పీఠానికి ఉత్తరాధికారి

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

77 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక



మంత్రదీక్ష తరువాత పీఠాధిపతుల తొలి దర్శనం

కంచి కామాక్షి ఆలయ ప్రాంగణం, పంచగంగ



# రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్





## జాగృతి పాఠకుల ఆత్మీయ సమ్మేళనం

## ఆహ్వానము

ధర్మరక్షణ కోసం ఈ మట్టి పరిమళంతో 77 ఏళ్లుగా వెలువడుతున్న ఏకైక జాతీయ తెలుగు వారపత్రిక.

- ఈ కార్యక్రమం ప్రధానంగా సంఘ శతాబ్ది సందర్భంగా సమాజంలో జాతీయ, సామాజిక విషయాలపై ఒక సక్రియమైన, సకారాత్మకమైన చర్చ జరిగేందుకు మనం ఎలా ఆలోచించాలి, ఏమి చేయాలి, ఎలా సన్నద్ధం కావాలి, ఏ విధంగా సహకరించవచ్చు అనే విషయాలపై చర్చ, మార్గదర్శనం ఉంటుంది.
- కార్యక్రమంలో తప్పక పాల్గొని జాగృతిలో వచ్చే విషయాలపై మీ అభిప్రాయాలు తెలుపగలరు.
- ఈ కార్యక్రమానికి సకుటుంబంగా రావలసిందిగా మా ఆహ్వానం.
- కార్యక్రమానికి కేవలం ప్రస్తుత పాఠకులే కాకుండా, కొత్త వారిని, మన స్నేహితులను, సహచరులను అందరిని తీసుకురాగలరు.
- సంఘ శతాబ్ది సందర్భంగా జరుగుతున్న ఈ సన్నాహక ప్రారంభ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనటానికి మీకు ప్రత్యేక ఆహ్వానం..

### సికింద్రాబాద్ విభాగ్

తేది : 11 మే 2025,

సమయం : ఉ॥ 9:30 గం॥లకు

స్థలం : సింధు భవన్, సింధుకాలనీ, సికింద్రాబాద్

వక్త : శ్రీ కాచం రమేష్ జీ, ప్రాంత కార్యవాహ

Scan for the Location

భవదీయ
భర్తెపూడి శ్రీనివాస్,
విభాగ్ కార్యవాహ

వివరాలకు : 9000002628

### భాగ్యనగర్ విభాగ్

తేది : 18 మే 2025,

సమయం : ఉ॥ 9:30 గం॥లకు

స్థలం : వీర సావర్కర్ హాల్ YMIS, కోఠి, భాగ్యనగర్.

వక్త : శ్రీ లింగం శ్రీధర్ జీ, ప్రాంత ప్రచారక్

Scan for the Location

భవదీయ
గోవర్ధనం రఘునాథ్,
విభాగ్ కార్యవాహ

వివరాలకు : 9490548204,

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

కె. దుర్గారెడ్డి : అసోసియేట్ ఎడిటర్ -
సబ్ ఎడిటర్ : - **9959991304**

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ **"To Bank / UPID"** ఆప్షన్ వాడండి.

**Link / QR Code** ద్వారా మీ చందా చెల్లించినప్పుడు **Remarks** దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

**5 సం॥ల చందా రూ.4000** **సంవత్సర చందా రూ.850**

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**

– సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

ఏప్రిల్ 22 నాటి పెహల్గావ్ నెత్తుటికాండ భారత్–పాకిస్తాన్‌ల మధ్య యుద్ధ వాతావరణాన్ని సృష్టించింది. ఈ దేశం పట్ల, దేశ భద్రత పట్ల ప్రతి పౌరునికి బాధ్యత ఉంటుందని మనసా వాచా నమ్ముతున్న భారతీయులంతా యుద్ధంతో తప్ప పాకిస్తాన్ ఇక దారికి రాదనే విశ్వసిస్తున్నారు. కేంద్రం, అందునా నరేంద్ర మోదీ వంటి ప్రధాని నాయకత్వంలోని ప్రభుత్వం ఎందుకు ఇంత జాప్యం చేస్తున్నట్టు అన్న ప్రశ్నలు కూడా వస్తున్నాయి. ఈ ఆవేశాన్నీ, ఈ ఆకాంక్షనూ అర్థం చేసుకోవలసిందే. ఏమైనా పాకిస్తాన్‌కు తిరుగులేని రీతిలో బుద్ధి చెప్పాలన్నదే ఇవాళ భారతజాతి ఉగ్ర కామన. జాతి అభిమతం మేరకే తమ ప్రభుత్వం వ్యవహరిస్తుందని మరచిపోవద్దు అని తాజాగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా ప్రకటించారు. 1971 తరువాత దేశంలో మాక్ డ్రిల్ కార్యక్రమం కూడా నిర్వహిస్తున్నారు. ఇవన్నీ యుద్ధ సన్నాహాలే.

పొరుగు దేశానికి కనువిప్పు గావించడం, కోలుకోలేని దెబ్బ కొట్టడం ఎంత అనివార్యమో, మన దేశంలో అక్రమంగా చొరబడి దశాబ్దాలుగా తిష్టవేసిన అక్రమ వలసదారులను బయటకు పంపడం కూడా అంతే అవసరం. ప్రతి రాష్ట్రంలోను అక్రమ వలసదారుల చిట్టాలు బయటపడుతున్నాయి. కలుగులలో నుంచి బయటకు వస్తున్న ఎలక పరివారం మాదిరిగానే వీళ్లు బయటపడుతున్నారు. దశాబ్దాల తరబడి తిష్ట వేసిన వాళ్లు కూడా ఇందులో ఉన్నారు. వీళ్లకి పౌరసత్వం లేదు. కానీ ఆధార్ కార్డులు ఉన్నాయి. ఓటర్ ఐడీలు ఉన్నాయి. రేషన్ కార్డులు మప్పితంగా అన్నీ అందిస్తున్నాయి. ఇదొక వర్గం. చొరబాటుదారుల విషయంలో దేశం కశ్మీర్‌ను మరిపిస్తున్నది.

మేం భారతీయులను పెళ్లి చేసుకున్నాం, వాళ్లతో ఇక్కడ పిల్లల్ని కన్నాం కాబట్టి మమ్మల్ని ఇక్కడ ఉండనివ్వాల్సిందే అంటున్నారు ఇంకొందరు. వీళ్లలో ఎవరికీ పౌరసత్వం లేదు. కానీ పిల్లల్ని కన్నారు. వాళ్లకి పెళ్లిళ్లు ఇక్కడే చేశారు. వాళ్లు కూడా పిల్లల్ని కన్నారు. ఇక్కడే ఉండిపోయారు. దేశం ధర్మసత్రం మాదిరిగా తయారయింది. ఇదేమిటి? ఏ దేశంలో అయినా ఇలా ఉంటుందా? పాకిస్తానీ అమ్మాయిలు ఇక్కడి యువకులను పెళ్లిళ్లు చేసుకుంటారు. ఇప్పుడు తమను తిరిగి వెళ్లిపొమ్మనడంలో న్యాయం ఏమిటని నేరుగా కోర్టులనే ప్రశ్నిస్తున్నారు. కోర్టులు వీరి వాదనలను వినడానికి

**శాలివాహన 1947 శ్రీ విశ్వావసు వైశాఖ పూర్ణిమ**

## లోపలి పేజీలలో...




ముఖపత్ర కథనం
**మన తరానికి మహత్తర ఘట్టం** 6లో

మాక్ డ్రిల్
**సమర సంకేతాలు** 12లో



నేపథ్యం
**విజేత త్యాగం పరాజితుడి భోగం** 26లో



# జాగృతి

## సంపాదకీయం

సిద్ధపడుతున్నాయి కూడా. బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ ఒకరు పాకిస్తాన్ వనితను పెళ్లి చేసుకుని చిరకాలంగా సంసారం చేస్తున్న వైనం బయటపడింది. ఇప్పుడు ఆమెను ఎలా పంపిస్తారని ఆయన ప్రశ్న. తమ సంతానం ఇక్కడ ఉండగా, ఈ దేశ పౌరసత్వం ఉండగా వారికి రక్తం పంచిన తమను వెళ్లమనడం ఏం సబబు అంటూ సెంటిమెంట్ చిత్రంలో వలె కన్నీరు మున్నీరు అవుతున్న వాళ్లు కూడా తక్కువేమీ కాదు. ఇలాంటి వాళ్లు తిరిగి స్వదేశం రాకుండా పాకిస్తాన్ తన సరిహద్దులు మూసేసి తన తుంటరి వైఖరిని అమానవీయ వైఖరిని మళ్లీ మళ్లీ రుజువు చేసుకుంటూనే ఉంది. ఈ పాకిస్తాన్ లేదా బాంగ్లా వాసులను

# ఈ ఏరివేత అనివార్యం

పంపడం హక్కులకు భంగం కాదా అని అని ప్రశ్నించే భారత వ్యతిరేకులకు పాక్ దుశ్చర్య ఎందుకు కనపడడం లేదు? ఇప్పుడు భారత్ నుంచి వీళ్లని తిప్పి పంపడం ఒక సవాలుగా మారిందంటే అతిశయోక్తి కాదు.

గుజరాత్‌లో 500, పశ్చిమ బెంగాల్‌లో 100, ఢిల్లీలో 47 మంది, తమిళ నాడులో ఎనిమిది మంది బాంగ్లా చొరబాటుదారులను అరెస్టు చేసినట్టు వార్తలు వస్తున్నాయి. ఉత్తరప్రదేశ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అక్కడా ఇక్కడా అనేమీ లేదు. దేశం ప్రతి మూలలోను వీళ్ల చీడ ఉంది. ఈ లెక్కలకు, దాదాపు 20 సంవత్సరాల క్రితం సాక్షాత్తు పార్లమెంటులో వెల్లడించిన లెక్కలకు హస్తి మశకాంతరం ఉంది. జూలై 14, 2004న నాటి యూపీఏ ప్రభుత్వంలో హోంశాఖ సహాయమంత్రి శ్రీప్రకాశ్ జైస్వాల్ పార్లమెంటులో చేసిన ప్రకటన ఇది. 12 మిలియన్‌ల అక్రమ బాంగ్లాదేశ్ చొరబాటుదారులు భారతదేశంలో నివాసం ఉంటున్నారు. ఇందులో ఒక్క పశ్చిమ బెంగాల్‌లోనే 5.7 మిలియన్‌లు ఉన్నారు'. 12 మిలియన్‌లు అంటే కోటీఇరవై లక్షలని మనవి. మరి, ఇలా వేయి, ఐదొందలు, వంద, పదీ, ఎనిమిదీ మంది బాంగ్లా అక్రమ వలసదారులను అరెస్టు చేస్తున్నట్టు వార్తలు రావడం ఏమిటి? ఇంతకీ పాకిస్తాన్ చొరబాటు దారులు ఎందరు? వాఘా సరిహద్దుల నుంచి ఇంతవరకు వేయిమంది పాకిస్తాన్ వెళ్లినట్టు ఒక లెక్క ఉంది. మన దేశంలో తిష్ట వేసిన పాకిస్తానీలు ఈ కొద్దిమందేనా? ఆ సంఖ్య ఇంతే అంటే నమ్మగలమా? జమ్ముకశ్మీర్ మాటేమిటి? స్థానికులే అక్కడ ఉగ్రవాదులకు ఆశ్రయం ఇస్తున్నారు. ఇంటి దొంగలు తెచ్చిన రక్తపిపాసులతో సరిహద్దు అంతా నిండిపోయింది. ఇటు పాకిస్తానీలు, అటు బాంగ్లా చొరబాటుదారులు ఈ దేశంలో ఎంతమంది పాతుకుపోయారో ఇప్పుడు కనుగొనడం నిజంగా సాధ్యమా? ఇందులో 'స్లీపర్ సెల్స్' ఎందరు? ఈ నిజాలు సగటు భారతీయుడిని దారుణంగా కలవరపరుస్తు న్నాయి. ఈ కలవరానికి ఇస్లామోఫోబియా అని ఎవరు పేరు పెట్టినా వాళ్లని క్షమించనవసరం లేదు. మొత్తంగా వీళ్లంతా శాంతంగా, కాందిశీకుల మాదిరిగా జీవించడానికి వచ్చినవారు కాదు. భారత్ మీద, హిందువుల మీద దారుణమైన కుట్రను అమలు చేయడానికే వచ్చినవారే.

అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపవలసిన తరుణమే ఇది. ఇప్పటికి గుజరాత్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ ప్రభుత్వాలు మాత్రమే కఠినంగా వ్యవహరిస్తు న్నాయి. మిగిలిన రాష్ట్రాలు కూడా అదే బాటలో ప్రయాణించడం అనివార్యం. కోర్టులు కూడా వీరి పట్ల దయచూపడం ఎంతవరకు సబబు? అన్నది ఇప్పుడు దేశంలో వినిపిస్తున్న ప్రశ్న. ఇందుకు బాధ్యత నిఘా వర్గాల మీదకు తోసేస్తే సరిపోదు. కొన్ని ప్రభుత్వాలు చొరబాట్లను ప్రోత్సహిస్తు న్నాయి. పాకి స్తాన్‌తో యుద్ధం అనివార్యంగానే కనిపిస్తున్నది. అంతకంటే ముందు దేశంలో పొంచి ఉన్న, నక్కి ఉన్న శత్రువులను ఏరివేయడం శరవేగంగా జరగవలసిందే. ★

12 మే 2025, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్



36లో

కథ

**పుత్తూరు కట్టు**

– ఆర్.సి. కృష్ణస్వామిరాజు

ధరహాసం





| | | |
|---|---|---|
| మూడేళ్లలో ఆంధ్ర మునుముందుకు (ఆంధ్రప్రదేశ్) | - | 16 |
| పుష్కరమాతా వాగ్దేవి! నమోస్తుతే (ఆధ్యాత్మికం) | - | 18 |
| మతం మారిన దళితులకు హోదా దక్కదు (చర్చ) | - | 20 |
| తెలంగాణ అభివృద్ధికి కేంద్రం రాదారి (తెలంగాణ) | - | 22 |
| అంతర్గత శత్రువులతో పారాహుషార్ (ఇంటిదొంగలు) | - | 24 |
| ధూపం (గళమెత్తిన గతం) | - | 30 |
| అక్షరాల మీద అత్తరు జల్లు (సాహిత్యం) | - | 40 |
| ఇంతింతై అంతింతైన 'ఖేలో ఇండియా' (క్రీడ) | - | 43 |
| బాలజాగృతి | - | 46 |
| అపరిమిత హింసతో 'హిట్-3' (సినిమా) | - | 50 |



శంకర భగవత్పాదులు స్థాపించిన కంచి కామకోటి పీఠం చరిత్రలో కొత్త ఆధ్యాయం ఆరంభమైంది. 2,500 సంవత్సరాలుగా భారతీయ ఆధ్యాత్మిక చింతనను, సంపదను సంరక్షిస్తున్న, అద్వైత సిద్ధాంత ఔన్నత్యాన్ని వ్యాప్తి చేస్తున్న కంచి మఠం మరొక మైలురాయిని అధిగమించింది. 'నగరేషు కాంచి' అని మహాకవి కాళిదాసు వర్ణించిన ఆ మహా పుణ్యక్షేత్రంలో, 108 దేవళాల నిలయంలో అక్షయ తృతీయ

# మన తరా

(ఏప్రిల్ 30) శుభ ముహూర్తంలో ఉత్తరాధికారికి బాధ్యతలు అప్పగించారు. కామాక్షి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని పంచగంగ (కోనేరు) తీర్థంలో స్నానమాచరించి, రుగ్వేద పండితుడు దుడ్డు సత్య వేంకట సూర్య సుబ్రహ్మణ్య గణేశ శర్మ సన్యాస దీక్ష స్వీకరించారు. ఎంతో సంప్రదాయబద్ధంగా, మహా వైభవోపేతంగా జరిగిన ఈ ఉత్సవంలో 70వ పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు ఉత్తరాధికారిగా శ్రీ శంకర సత్య చంద్రశేఖరేంద్రస్వామి వారి పేరు ప్రకటించారు. ఇది ఆ మహోన్నత పీఠం చరిత్రలోనే కాకుండా, భారతీయ ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సామాజిక ప్రస్థానంలో మహిమాన్విత క్షణం. మహత్తరమైన రోజు. ఈ చారిత్రక ఘట్టం కామాక్షి అమ్మవారి ఆలయంలోనే జరిగింది.

2,534వ శంకర జయంతి పర్వదినాన కంచి పీఠం ఉత్తరాధికారి ప్రకటన జరగడం నిజంగా విశేషం.

ఉత్తరాధికారి బాధ్యత స్వీకరించే ఆ దృశ్యాన్నీ, అప్పగించే ఆ వేడుకనూ వీక్షించడానికి రెండు రోజుల ముందు నుంచే వేలాదిగా భక్తులు కంచికి చేరుకోవడం మొదలయింది. ముహూర్తం వేళకు కామాక్షి కోవెల కిక్కిరిసిపోయింది. ఉత్తరాధికారి బాధ్యతకు ఎంపికై, అప్పటికే మాధ్యమాల ద్వారా హిందూ సమాజానికి పరిచయమైన ఆ యువకుడి ప్రసన్నవదనం, ఆ ముఖంలోని దివ్యత్వం అందరినీ తన్మయులను చేశాయి. పంచగంగలో స్నానం చేసి వచ్చి, అన్నీ త్యజించి సన్యాసి అయ్యారు ఉత్తరాధికారి. సన్యాస దీక్ష తరువాత 'హర హర శంకర జయ జయ శంకర' నినాదాలు మిన్నంటుతుండగా పరివ్రాజకునికి అత్యంత ముఖ్యమైన దండాన్ని అప్పగించే కార్యక్రమం నిర్వహించారు విజయేంద్ర సరస్వతి స్వామివారు. ఉత్తరాధికారి ప్రకటన లేదా శిష్యునిగా స్వీకరణ కార్యక్రమం ఏప్రిల్ 22న ప్రారంభమైంది. అక్షయ తృతీయ వరకు ఆ 'పూర్వాంగ క్రియలు' నిర్వహించారు. అందులో భాగంగానే కామాక్షి అమ్మవారికీ, శంకర భగవత్పాదుల సన్నిధిలోనూ ప్రత్యేక పూజలు చేశారు. శ్రీసత్యచంద్రశేఖరేంద్ర సరస్వతి అంటూ గురుపరంపరలో కొత్త స్వామిని భాగస్థుని చేశారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన సాధుసంతులు, పండితులు, ప్రముఖుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది.

'ఎవరికి ధనం అవసరమవుతుందో వారికి అక్షయ తృతీయ పుణ్యకాలంలో ప్రజలు దానం చేస్తూ ఉంటారు. కానీ ఈ రోజు ఆ తల్లిదండ్రులు వారి కుమారుడిని పీఠానికి అర్పించారు. అలా సనాతన ధర్మసేవకు, వేదమాత సేవకు, దేశసేవకు వెల కట్టలేని ఈ దానం చేశారు' అని విజయేంద్ర సరస్వతి స్వామి వ్యాఖ్యానించారు. ఇక నుంచి తమ గురువుల (విజయేంద్ర సరస్వతి స్వామి)తో కలసి సత్యచంద్ర శేఖరేంద్రస్వామి ముముక్షువులకు మార్గదర్శనం చేస్తారని, అద్వైత వేదాంతాన్ని రక్షించడంతో పాటు, ఆ మహోన్నత తత్త్వాన్ని బోధించడంతో పాటు చిరకాలం నుంచి పీఠం ఆచరిస్తున్న సంప్రదాయాలను రక్షించడంలోనూ తనదైన పాత్ర నిర్వహిస్తారని కూడా విజయేంద్ర సరస్వతి స్వామి ప్రకటించారు.

# ...నికి మహత్తర ఘట్టం





**ఓం సువః సన్యస్తం మయ..**
**ఓం భూర్భువుస్సువః సన్యస్తం మయ**
ఉత్తరాధికారి బాధ్యతకు ముందు
సన్యాసాశ్రమ స్వీకారం

**ఉత్తరాధికారి ఎంపిక విధానం**

మానవ జీవితంలో సన్యాస దీక్ష అత్యంత ప్రముఖమైనది. ఇది పరమ పవిత్ర కార్యం. అలాగే కొందరికి మాత్రమే దక్కే అవకాశం. దీనిని చతుర్థాశ్రమం అంటారు. మరొక్కటి కూడా చెప్పుకోవాలి. సన్యసించడం వేరు...ప్రతిష్ఠాత్మక పీఠానికి అధిపతి కావడం వేరు. కంచి కామకోటి పీఠానికి అధిపతి కావడం అంటే ఏమిటి? ఊహించడం కూడా సాధ్యం కాదు. అందుకు ఎంతో త్యాగనిరతి, విద్వత్తు, దీక్ష, పట్టుదల, అంకితభావం అన్నిటికి మించి మాతాపితరుల అనుమతి అత్యంత అవసరం. జీవితాన్ని ధర్మం కోసం అర్పించడమే అందులో ఉంటుంది. తన కుమారుడు కాబోయే జగద్గురువు అనే భావన ముందు, భవబంధాలు స్వల్పం. ఎంతో పుణ్యం చేసుకుంటే తప్ప దక్కని ఈ భాగ్యం సాక్షాత్తు భగవత్ ప్రసాదం అన్న భావనే ఉత్తరాధికారి కన్నతల్లి ముఖంలో కనిపించింది. భారతీయ సన్యాసాశ్రమంలో మరొక విశిష్టత ఉంది. ఉత్తరాధికారి అయినా, తరువాత పీఠాధిపతి అయినా, లోకం మొత్తం ఆయన పాదాల చెంత మోకరిల్లుతుంది. కానీ మాతృమూర్తిని ఆ సంప్రదాయం నుంచి మినహాయించారు. ఇదీ, తల్లికి భారతీయత ఇచ్చిన సమున్నత స్థానం.

సమాజాన్ని సంపూర్ణ జ్ఞానమార్గంలో నడిపించడం ద్వారా సనాతన ధర్మ పరిరక్షణ కోసం వర్తమాన పీఠాధిపతి ఉత్తరాధికారిని/వారసుడిని ఎంపిక చేస్తారు. పరివ్రాజకత్వం అంటే కఠిన నియమాల మధ్య జీవనం. అనేక నిబంధనలు ఉంటాయి. ఎన్నో జాగ్రత్తలు పాటించవలసి ఉంటుంది. పీఠం ఉత్తరాధికారిగా ఎంపికయ్యే వారి కుటుంబం నేపథ్యాన్ని సునిశితంగా పరిశీలించి, పరిగణనలోకి తీసుకుంటారు. వారిది వేదాధ్యయన వంశం/కుటుంబమా? వైదిక సంప్రదాయం కలిగిన వారేనా? ఎంపికకు ఉద్దేశించిన వ్యక్తిలో సత్వగుణ పాళ్లు ఎన్ని? జాతకపరంగా కేతువు సన్యాసి భావాలను ఎంతవరకు కలిగిస్తాడు? వంటివాటితో పాటు ప్రస్తుత పీఠాధిపతికి వారసుడి సమర్థతపై కలిగే అభిప్రాయం, ఆయనలోని దైవిక స్వభావంపై అంచనాలు ఎంపికకు దోహదం చేస్తాయి. ఆ ప్రకారమే శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామి తమ ఉత్తరాధికారిని నిర్ణయించారని చెబుతారు.

**సన్యాస దీక్ష**

సశాస్త్రీయంగా ఉత్తరాధికారి నియమాక ప్రక్రియ వారం రోజుల ముందే ప్రారంభం కాగా, ప్రధాన ఘట్టాన్ని శ్రీ విశ్వావసు వత్సర అక్షయ తృతీయ నాడు ఘనంగా నిర్వహించారు. మంగళ వినాయక సన్నిధి సమీపం(కామాక్షి ఆలయం) లోని పంచగంగ పుష్కరిణి వద్ద వేకువ జామున సుమారు ఐదు గంటల సమయంలో సన్యాసదీక్ష స్వీకరణ ప్రక్రియ మొదలైంది. పూర్వాశ్రమంలో శ్రీ గణేశ్‌ద్రావిడ్ తల్లిదండ్రులతో సిద్ధంగా ఉండగా, విజయేంద్ర సరస్వతి మంగళ వాద్యాలు, మంత్రోచ్చరణల మధ్య దీక్షాస్థలికి చేరుకున్నారు. పండితులు విఘ్నేశ్వరపూజ, ఉదకశాంతి, పుణ్యాహవాచనం నిర్వహించిన తరువాత కాబోయే ఉత్తరాధికారి 'తృష్ణీ' స్నానం ఆచరించారు.

పంచగంగలో ఉత్తర దిశగా నిలిచి, యజ్ఞోపవీతం సహా శరీరం మీద ఉన్న అన్నింటిని త్యజించిన తరువాత విజయేంద్ర సరస్వతి స్వామి స్వయంగా సన్యాస దీక్షకు అవసరమైన వస్త్రాలను ఉత్తరాధికారికి అందించారు. అవి చంద్రమౌళీశ్వర స్వామి పాదాల చెంత ఉంచి పూజించి తెచ్చినవి. ఉత్తరాధికారి వాటిని సవినయంగా స్వీకరించి, కళ్లకు అద్దుకున్నారు. ఉత్తర దిశగానే హిమాలయాలు ఉన్నాయి. గంగ ఉన్నది. వాటితో ఆది శంకరులకు అవినాభావ సంబంధం ఉంది. అందుకే ఉత్తరదిశగా (పంచ పదంగత్వ) అడుగులు వేశారు. రెండు చేతులు పైకెత్తి.. పంచభూతాల సాక్షిగా, కామాక్షి అమ్మవారి సాక్షిగా తాను సన్యాస దీక్షను స్వీకరిస్తున్నట్టు ప్రమాణం చేశారు. 'ఓం భూః సన్యస్తం మయ.. ఓం భువః సన్యస్తం మయ.. ఓం సువః సన్యస్తం మయ.. ఓం భూర్భువుస్సువః సన్యస్తం మయు' అంటూ మంత్రోచ్చాటన చేశారు.ఆపై కాషాయ వస్త్రాలు ధరించి సన్యాస దీక్షలో దర్శనమిచ్చిన ఉత్తరాధికారిగా సత్య చంద్రశేఖరేంద్ర స్వామిని తొలిసారి దర్శించుకున్న భక్తజనం అక్షరాలా తన్మయులయ్యారు. ఆకాశంలో ఒక సూర్యభగవానుడు ఉండగా, జనం మధ్య మరొక సూర్యోదయం అయినట్టే ఉందని వ్యాఖ్యాత పేర్కొనడం విశేషం. తరువాత తనకు మంత్రోపదేశం చేయవలసిందని ఉత్తరాధికారి గరుడాసనంలో కూర్చుని గురుదేవులను అభ్యర్థించారు (ఆసనం విజయేంద్ర సరస్వతి స్వామి వేసి చూపించారు). ఆపై ఎర్రని వస్త్రంలో చుట్టి తెచ్చిన సాలగ్రామాన్ని ఉత్తరాధికారి శిరస్సున ఉంచి విజయేంద్ర సరస్వతి స్వామి అభిషేకించిన ఘట్టం అద్భుతం. వెనుక వేద పండితులు పురుషసూక్తం చదివారు.

**దండ ప్రదానం**

తరువాత జరిగినదే అత్యంత ముఖ్య ఘట్టం దండ ప్రదానం. పరివ్రాజకుల వామభుజం మీద ఉండే దండం మహిమాన్వితమైనది. 'లోకానుగ్రహార్థం దండాది గృహాణ' అన్నారు. అంతేకాదు, 'ఇంద్ర హస్తే యథా వజ్రం/ శూలం హస్తే హరస్య చ/ విష్ణు హస్తే యథా చక్రం/ తథా దండోభవాద్యమే' అన్న శ్లోకాన్ని అప్పుడు శిష్యుడి చేత గురువు చెప్పించారు.

అంటే ఇంద్రుడి చేతిలో వజ్రాయుధం, తినేత్రుడి చేతిలోని త్రిశూలం, విష్ణువు చేతిలోని చక్రం ఎంత శక్తిమంతమో, ఒక పరివ్రాజకుని భుజం మీద ఉండే దండం అంతే శక్తిమంతమని అర్థం. తరువాత ఆసనాన్ని అందించే కార్యక్రమం జరిగింది. గురువులు దర్భాసనానికి బదులు పీఠాన్నే విజయేంద్ర ఉత్తరాధికారికి



**... విష్ణు హస్తే యథా చక్రం**
**తథా దండోభవాద్యమే**
గురువు నుంచి దండం స్వీకరిస్తూ..

# కంచి పీఠం గురు పరంపర




1. ఆదిశంకరాచార్యులు (482 బీసీ–477బీసీ)
2. సురేశ్వరాచార్య (477 బీసీ–407 బీసీ )
3. సర్వజ్ఞాత్మనేంద్ర సరస్వతి (407 బీసీ–367 బీసీ )
4. సత్య బోధేంద్ర సరస్వతి (367 బీసీ–268 బీసీ )
5. జ్ఞానానందేంద్ర సరస్వతి (268 బీసీ–205 బీసీ)
6. శుద్ధానందేంద్ర సరస్వతి (205 బీసీ –124బీసీ )
7. ఆనంద జ్ఞానేంద్ర సరస్వతి (124బీసీ –55 బీసీ)
8. కైవల్యానంద యోగేంద్ర సరస్వతి (55 బీసీ –28 ఏడీ )
9. కృపా శంకరేంద్ర సరస్వతి (28 ఏడీ –69 ఏడీ )
10. సురేశ్వరేంద్ర సరస్వతి (69 ఏడీ –127 ఏడీ )
11. శివానంద చిద్ఘనేంద్ర సరస్వతి (127 ఏడీ –172 ఏడీ )
12. చంద్రశేఖరేంద్ర సరస్వతి (172 ఏడీ –235 ఏడీ )
13. సచ్చిదానందేంద్ర సరస్వతి (235 ఏడీ –272 ఏడీ )
14. విద్యాఘనేంద్ర సరస్వతి (272–317)
15. గంగాధరేంద్ర సరస్వతి (317–329)
16. ఉజ్జ్వల శంకరేంద్ర సరస్వతి (329–367)
17. సదాశివేంద్ర సరస్వతి (367–375)
18. యోగతిలక సురేంద్ర సరస్వతి (375–385)
19. మార్తాండ విద్యాఘనేంద్ర సరస్వతి (385–398)
20. మూక శంకరేంద్ర సరస్వతి (398–437)
21. చంద్రశేఖరేంద్ర సరస్వతి–(437–447)
22. బోధేంద్ర సరస్వతి (447–481)
23. సచ్చిత్సుఖేంద్ర సరస్వతి (481–512)
24. చిత్సుఖేంద్ర సరస్వతి (512–527)
25. సచ్చిదానంద ఘనేంద్ర సరస్వతి (527–548)
26. ప్రజ్ఞా ఘనేంద్ర సరస్వతి (548–565)
27. చిద్విలాసేంద్ర సరస్వతి (565–577)
28. మహాదేవేంద్ర సరస్వతి–(577–601)
29. పూర్ణబోధేంద్ర సరస్వతి (601–618)
30. బోధేంద్ర సరస్వతి– (618–655)
31. బ్రహ్మానంద ఘనేంద్ర సరస్వతి (655–668)
32. చిదానంద ఘనేంద్ర సరస్వతి (668–672)
33. సచ్చిదానంద సరస్వతి (672–692)
34. చంద్రశేఖరేంద్ర సరస్వతి–(692–710)
35. చిత్సుఖేంద్ర సరస్వతి–(710–737)
36. చిత్సుఖానందేంద్ర సరస్వతి (737–758)
37. విద్యా ఘనేంద్ర సరస్వతి–(758–788)
38. అభినవ శంకరేంద్ర సరస్వతి (788–840)
39. సచ్చిద్విలాసేంద్ర సరస్వతి (840–873)
40. మహాదేవేంద్ర సరస్వతి–(873–915)
41. గంగాధరేంద్ర సరస్వతి–(915–950)
42. బ్రహ్మానంద ఘనేంద్ర సరస్వతి–(950–978)
43. ఆనంద ఘనేంద్ర సరస్వతి (978–1014)
44. పూర్ణ బోధేంద్ర సరస్వతి–(1014–1040)
45. పరమశివేంద్ర సరస్వతి–(1040–1061)
46. సంద్రానంద బోధేంద్ర సరస్వతి(1061–1098)
47. చంద్రశేఖరేంద్ర సరస్వతి–(1098–1166)
48. అద్వైతానంద బోధేంద్ర సరస్వతి (1166–1200)
89. మహాదేవేంద్ర సరస్వతి–(1200–1247)
50. చంద్రచూడేంద్ర సరస్వతి–(1247–1297)
51. విద్యా తీర్థేంద్ర సరస్వతి(1297–1385)
52. శంకరానందేంద్ర సరస్వతి (1385–1417)
53. పూర్ణానంద సదాశివేంద్ర సరస్వతి(1417–1498)
54. వ్యాసాచల మహాదేవేంద్ర సరస్వతి (1498–1507)
55. చంద్రచూడేంద్ర సరస్వతి–(1507–1524)
56. సర్వజ్ఞ సదాశివ బోధేంద్ర సరస్వతి(1524–1539)
57. పరమశివేంద్ర సరస్వతి–(1539–1586)
58. ఆత్మబోధేంద్ర సరస్వతి (1586–1638)
59. భగవన్నామ బోధేంద్ర సరస్వతి (1638–1692)
60. అద్వైతాత్మ ప్రకాశేంద్ర సరస్వతి (1692–1704)
61. మహాదేవేంద్ర సరస్వతి–(1704–1746)
62. చంద్రశేఖరేంద్ర సరస్వతి–(1746–1783)
63. మహాదేవేంద్ర సరస్వతి–(1783–1813)
64. చంద్రశేఖరేంద్ర సరస్వతి–(1813–1851)
65. సుదర్శన మహాదేవేంద్ర సరస్వతి(1851–1891)
66. చంద్రశేఖరేంద్ర సరస్వతి–(1891 – 1907)
67. మహాదేవేంద్ర సరస్వతి–(1907 ఫిబ్రవరి 7 –1907 ఫిబ్రవరి 13)
68. చంద్రశేఖరేంద్ర సరస్వతి–(1907 ఫిబ్రవరి 13 – 1994 జనవరి 3)
69. జయేంద్ర సరస్వతి (1994 జనవరి 3–2018 ఫిబ్రవరి 28)
70. శంకర విజయేంద్ర సరస్వతి (2018 ఫిబ్రవరి 28 –ప్రస్తుతం)
71. సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి(2025 ఏప్రిల్ 30 నుంచి (ఉత్తరాధికారి))

## అన్నవరం నుంచి అనర్ఘరత్నం



ఈరోజు చాలా మంచిరోజు. అక్షయ తృతీయ పుణ్యకాలంలో మన కంచి కామకోటి పీఠ గురుపరంపరలో గొప్ప సుకృత, పుణ్య పరిపాక విశేషం చేత ఎందరో మహానుభావులు చేరుకున్నారు. త్యాగ ప్రతీకగా, త్యాగ శిఖరంగా, సేవా ప్రతిబింబంగా మనకు స్వామి (పూర్వాచార్యులు) వారి అనుగ్రహంతో ఈ రోజు సత్యవేంకట సూర్యసుబ్రహ్మణ్యశర్మ- సత్యచంద్రశేఖరేంద్ర సరస్వతిగా మనందరికీ ఆనందం, ఆహ్లాదం కలిగిస్తున్నారు. 'ఆంధ్రత్వమాంధ్ర భాషాచ, ప్రాభాకర పరిశ్రమ: తత్రాపి యాజుషీ శాఖానాల్పస్య తపసః ఫలమ్' అంటూ మీరందరూ కూడా ఆంధ్ర దేశభక్తులు. ఇలాంటి సత్సందర్భాన్ని సదుపయోగం చేసుకుని గురువుగారు దొరికారు కాబట్టి, దొరికిన గురువుగారికి మీరందరు కూడా మనసా వాచా కర్మణా చేయూత ఇవ్వగలిగే సేవా కార్యక్రమాన్ని తప్పనిసరి చేసి మానవ జీవితంలో చరితార్థులు కావాలి. మీ జీవితం ధన్యం కావాలి. అన్నారు విజయేంద్ర. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియచేశారని కూడా గుర్తు చేశారాయన.

అప్పగించారు. స్ఫటిక రుద్రాక్షమాలను మెడలో అలంకరించారు. 'మమ హృదయంతే దదామి' (నా హృదయాన్ని నీకు అందిస్తున్నాను) అనే మహా మంత్రోపదేశం తరువాత 'శ్రీ సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామి'అని యోగనామం నిర్దేశించి, మూడుమార్లు ప్రకటించారు. దీనితో కామాక్షి కోవెల మొత్తం హర్షధ్వానాలతో ప్రతిధ్వనించింది. పూర్వాశ్రమంలోని పేరులో ఎంతో కొంత భాగం సన్యాస దీక్ష తరువాత కూడా మిగలడం అత్యంత అరుదు. ఆది శంకరాచార్య తరువాత మళ్లీ ప్రస్తుత ఉత్తరాధికారి యోగనామంలో, పూర్వాశ్రమ నామ భాగం (సత్య) కొనసాగడం గమనార్హం. ఇదే మాటను విజయేంద్ర స్వామి కూడా ప్రస్తావించారు. అన్నవరం స్వామిలో కూడా సత్య ఉన్నది అని గుర్తు చేశారు.

అనంతరం పూర్ణకుంభ స్వాగతం, భారీ ప్రదర్శన నడుమ ఆచార్య ద్వయం కామాక్షి అమ్మవారి ఆలయానికి చేరింది. చిన్నస్వామి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి జగద్గురువు శంకర భగవత్పాదుల సన్నిధిలో పరివట్టం, ప్రసాదం అందచేశారు.

### చరిత్రాత్మక పీఠం

శ్రీ కంచి కామకోటి పీఠం లేదా కంచి మఠం సనాతన ధర్మ కేంద్రం. కంచి శక్తిపీఠం కూడా. ఇక్కడ వెలసిన కంచి కామాక్షి అమ్మవారి ఆశీస్సులతో కామకోటి పీఠం శతాబ్దాలుగా సనాతన ధర్మ రక్షణకు అంకితమైనది.

సనాతన ధర్మ రక్షణ కోసం కంచి పీఠం చేస్తున్న సేవలను ఏమని చెప్పగలం! అటు భారతీయ ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని కాపాడుతోంది. ఆపన్నులను వివిధ సామాజిక సేవలతో ఆదుకుంటున్నది. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కంచి పీఠం జాడ దర్శనమిస్తుంది. జమ్ముకశ్మీర్ రాజధాని శ్రీనగర్‌లోని ఆది శంకర ఆలయ నిర్వహణే కాదు, దేశంలో అనేక ఆలయాల బాధ్యతను కూడా స్వీకరించింది. ఈశాన్య భారతంలోని అస్సాం వరకు ఎన్నో చోట్ల వేద పాఠశాలలు నిర్వహిస్తున్నది. ఆలయాల జీర్ణోద్ధరణకు దశాబ్దాలుగా పాటు పడుతున్నది. ఆసుపత్రులు, విద్యాలయాల ద్వారా పీఠం విద్య వైద్య సేవలు అందిస్తున్నది. ఉన్నత విద్య కోసం కంచిలోనే విశ్వవిద్యాలయం నెలకొల్పింది.

భారతదేశ సమైక్యత కోసం కంచి పీఠాధిపతులు అందించిన సేవలు చిరస్మరణీయమైనవి. ఈ పీఠం



# నడిచే దేవుడు



**శం**కరభగవత్పాదులతో అనుగ్రహంతో కాంచీపురి పీఠ స్థాపన పరమాద్భుత చారిత్రక ఘట్టం కాగా, 68వ పీఠాధిపతి పరమాచార్యులు పూజ్యశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి వారితో ఉజ్జ్వలమై ఉన్నత స్థితికి చేరింది. దేశంలో మత, జ్ఞాన పరమైన అంశాలకు మార్గదర్శకత్వం అందించారు. 13వ ఏట సన్యసించి 87 వసంతాల పాటు పీఠాధిపతిగా కొనసాగి, 'నడుస్తున్న దేవుడు'గా మన్ననలు అందుకున్న మహనీయులు. అంత సుదీర్ఘకాలం పీఠాధిపత్యం వహించడం హిందూ మత చరిత్రలోనే అపురూప, అపూర్వ సంఘటన. హిందూ సమాజంలో అఖండ గౌరవం పొందిన మహనీయులు. నిరాడంబర జీవితం, మౌనం, సన్యాస ధర్మానికి చూపిన నిబద్ధత వల్ల జీవిత కాలంలోనే 'జీవన్ముక్తుడు'గా కీర్తి పొందారు. ఆయనే లేకపోతే పెరియార్ వంటి వైదిక వ్యతిరేకుల మధ్య సనాతన ధర్మం ఎలా నిలబడేదో అనిపించకమానదు.

వ్యవస్థాపకులే సాక్షాత్తు ఆది శంకరులు. ఆయన దేశమంతా కాలినడకన పర్యటించారు. నాలుగు గొప్ప మఠాలు స్థాపించారు. దైవభక్తికీ, దేశభక్తికీ నడుమ ఉన్న బంధం ఎంత పవిత్రమైనదో తెలిసినవారు కాబట్టే మళ్లీ 68, 69 పీఠాధిపతులు ఆది శంకరుల వారి మాదిరిగానే భారతయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్రల ద్వారా లక్షలాది మంది భారతీయులను చైతన్య పరిచారు. 70వ పీఠాధిపతి గ్రామీణాభివృద్ధి పట్ల విశేష శ్రద్ధాసక్తులు చూపుతూ ఉంటారు. సనాతన ధర్మం మీద, ఆచార వ్యవహారాల మీద ఆయనకు ఎంత నిష్ఠ నియమం ఉన్నాయో, గౌరవ ప్రపత్తులు ఉన్నాయో; ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, విజ్ఞానం భారతీయ సమాజానికి చేరడం గురించి కూడా అంతే ఆసక్తి ప్రదర్శిస్తారు వారు. సేద్యాన్ని వృద్ధి చేసుకోవడానికి, గోసంతతి పెంపునకు, ఇందుకు మన పురాతన భారతీయ విధానాల వినియోగం అనే మూడు కోణాలు కంచి పీఠానికి అలంకారాలుగా భాసిల్లుతున్నాయి. అందుకే ఈ మూడు కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తున్నది. 70వ పీఠాధిపతుల ఈ సేవలు వారికి ముందు మఠాధిపతి సూచించిన బాటలో సాగినవే.

అయోధ్య ఆలయ నిర్మాణానికి ఎదురైన సమస్యలను పరిష్కరించడానికి 69వ పీఠాధిపతులు విశేష చొరవ చూపిన సంగతి జాతికి తెలుసు. రామాలయం నిర్మాణం వారి స్వప్నం. కానీ 70వ పీఠాధిపతుల ఎదుట రామాలయం ఆవిష్కృతమైంది. రామచంద్ర ప్రభువును పునఃప్రతిష్ఠించుకున్నాం. కంచి పీఠానికీ, అయోధ్యకూ అవినాభావ సంబంధమే ఉంది.

మాధ్యమాల పుణ్యమా అని ఉత్తరాధికారి నియామక క్రతువును జాతీయ అంతర్జాతీయ భక్తకోటి కనులారా వీక్షించగలిగారు. ఇదొక అపూర్వ అవకాశం. బహుశా అది ఇటీవలి తరాలకి లభించిన మాట వాస్తవం. ఈ తరాలకి అరుదైన అదృష్టం. పీఠాన్ని ముగ్గురు గురువులు (చంద్రశేఖరేంద్ర సరస్వతి, జయేంద్ర సరస్వతి, విజయేంద్ర సరస్వతి) సేవించే దృశ్యాన్ని దర్శించే అవకాశం కూడా ఈ తరాలకే దక్కింది. ప్రస్తుత పరిస్థితులలో ఉత్తరాధికారి నియామకం, ఆ ప్రక్రియను దేశ ప్రజానీకం వీక్షించడం అత్యవసరమే. ఇటీవలి కాలంలో అయోధ్యలో శంకుస్థాపన, బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు హిందూ సమాజంలో ఎంత కదలిక తెచ్చాయో, కంచి ఉత్తరాధికారి నియామకం కూడా అంతే చైతన్యవంతం చేసిందన్నది నిర్వివాదాంశం.

హరహర శంకర..జయజయ శంకర...



**డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి**
**సీనియర్ జర్నలిస్ట్**



# ఉత్తరాధికారి పూర్వాశ్రమం

**ఆం**ధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పిఠాపురానికి చెందిన దుడ్డు సత్యవేంకట సూర్య సుబ్రహ్మణ్యం గణేశ్ ద్రావిడ్ (24) తండ్రి ధన్వంతరి శర్మ అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి ఆలయ వ్రత పురోహితులు. తల్లి అలమేల్మంగ గృహిణి. సోదరి చదువుతున్నారు. వారి పూర్వీకులూ వేద పండితులే. 2006లో వేదాధ్యయనం ప్రారంభించిన ద్రావిడ్ రుగ్వేద యజుర్వేద సామవేదాలతో పాటు షడంగాలు, దసోపనిషత్తులపై లోతైన అధ్యయనం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్వర్యంలోని వేద పాఠశాల, ద్వారకా తిరుమల, కంచి పీఠంలో వేదాధ్యానం చేశారు. బాసర జ్ఞాన సరస్వతి ఆలయంలో రుగ్వేద పండితునిగా సేవలు అందించారు. వేదాధ్యయన సమయంలో రుగ్వేదంలో 'సలక్షణ ఘనాపాఠి' బిరుదు పొందారు. రుగ్వేద ఘన మంత్రాలను జపించవలసిందిగా యువ వేద విద్యార్థులను ప్రోత్సహించేవారు. ఘనాపాఠి అంటే వేద జపంలో నిష్ణాతులు కాగా, 'సలక్షణ ఘనాపాఠి' అంటే వేద సంప్రదాయంలో గొప్ప పండితుడు. వారు 'వర్ణక్రమం', ఉచ్చారణ, వేదవ్యాకరణంలో ప్రవీణులు. ★

"మీరు కోరుకున్నది జరిగి తీరుతుంది "అంటూ మే 4వ తేదీ ఆదివారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్న మాట యావత్ భారతావనికి పెహల్గావ్ ఉగ్రదాడికి పాల్పడి 26 మంది ప్రాణాలను బలిగొన్న మతోన్మాద పాకిస్తాన్‌పై సమరానికి భవిష్యవాణిగా వినిపించింది. మంత్రి మాట ఇచ్చి 24 గంటలు గడవకముందే అంటే మే 5వ తేదీ సోమవారం రాత్రి వేళ ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం ఐదు అంశాలతో కూడిన సమర సంకేతాలను దేశ ప్రజలకు ఇచ్చింది. వాటి సారం పెహల్గావ్ ఉగ్రదాడి జరిగిన రెండు వారాల్లోనే యావత్ భారతీయులను యుద్ధానికి, యుద్ధ వాతావరణానికి సన్నద్ధం చేయడం. కేంద్ర హోమ్ మంత్రిత్వశాఖ ఆసేతు హిమాచలపర్యంతం ప్రజలందరితో మే 7 బుధవారం నుంచి మూడు రోజుల పాటు భద్రత, రక్షణకు సంబంధించిన మాక్ డ్రిల్ చేయించాలని రాష్ట్రాలను ఆదేశించింది. ముఖ్యంగా యుద్ధం వచ్చినప్పుడు భారతీయులకు స్వీయ రక్షణ పాఠాలు నేర్పించడం ఈ మాక్ డ్రిల్ ముఖ్యోద్దేశం. 1971లో ఇదే పాకిస్తాన్‌తో మన దేశం యుద్ధానికి దిగినప్పుడు మాక్ డ్రిల్ జరిగింది. అప్పట్లో ఈ నిర్ణయం తీసుకోవడానికి ఎనిమిది నెలలు పడితే.. ఇప్పుడు నిర్ణయం తీసుకోవడమనేది పక్షం రోజుల్లోనే జరిగిపోయింది. అంటే దాదాపు 54 సంవత్సరాల తర్వాత ఈ కథనం రాస్తున్న సమయానికి భారతదేశం మాక్ డ్రిల్‌కు సిద్ధమవుతోంది. 1970 తర్వాత పుట్టినవారికి ఇది అనుభవానికి అందని విషయం. నిర్ణయం తీసుకోవడానికి పట్టిన ఈ కాలంలో భారత ప్రభుత్వంపై ఏమిటింకా ఆలస్యం అంటూ వ్యంగ్యంగా మాటలు పారేసుకున్నవారి నోళ్లు ఈ దెబ్బతో మూతపడ్డాయి. వికార చేష్టలు నిలిచిపోయాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన అజయ్ రాయ్ అనే మందమతి రాఫెల్ యుద్ధ విమానపు ఆటబొమ్మకు పచ్చిమిరపకాయలు, నిమ్మకాయను కట్టి తన వికృత మనస్తత్వాన్ని ప్రపంచానికి చాటుకున్నాడు. నవ్వులపాలయ్యాడు. కానీ దాడి జరిగినప్పటి నుంచి మాక్ డ్రిల్‌కు ఆదేశాలు ఇచ్చేంతవరకూ కూడా ప్రధాని నరేంద్ర మోదీ త్రివిధ దళాధిపతులతో, మంత్రివర్గ సహచరులతో, సంబంధిత శాఖల కార్యదర్శులతో జరిపిన సమావేశాలకు లెక్కే లేదు. ఈ కొద్దిరోజులూ యావత్ భారత సర్కారు మునివేళ్లపై నిలబడింది అంటే ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. ఎందుకంటే దశాబ్దాలుగా దేశానికి పట్టుకున్న పీడను వదిలించుకోవడానికి ఇదే సరైన సమయం కాబట్టి. మాక్ డ్రిల్‌కు చెందిన ఐదు అంశాల విషయానికి వస్తే ఈ మూడు రోజులు వైమానిక దాడి జరగడానికి ముందు వినిపించే సైరన్‌ను సంబంధిత అధికారులు మోగిస్తారు. అలాంటి పరిస్థితుల్లో స్వీయరక్షణకు ఏం చేయాలో ప్రజలకు వివరిస్తారు. గగనతలం నుంచి దాడి చేసే శత్రువుకు మనం ఉంటున్న జనావాసాలు తెలియకుండా ఉండటానికి రాత్రి పూట లైట్లు ఆర్పివేయడాన్ని అలవాటు చేస్తారు. మన దేశానికి చెందిన కీలకమైన శాఖల భవనాలు, ప్లాంట్లు, స్థావరాలు శత్రువుల కంటపడకుండా వాటికి ఆకుపచ్చ రంగు వేయడం లేదా పచ్చని ఆకుల కొమ్మలతో కప్పివేయడం లాంటివి సంబంధిత అధికారులు చేస్తారు. అలా చేయడం వల్ల ఆ భవనాలు చుట్టుపక్కల ఉన్న చెట్లలో కలిసిపోయి కనిపించకుండా ఉంటాయి. అలాగే యుద్ధ కాలంలో ఏదైనా విపత్తు సంభవించినప్పుడు బాధిత ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రక్రియ కూడా మాక్ డ్రిల్‌లో భాగంగా ఉంటుంది. ఇంతటి కీలకమైన మాక్ డ్రిల్‌లో పాల్గొనడం మన అందరి బాధ్యత. యుద్ధమంటూ వస్తే భరతమాతకు విజయాన్ని తెచ్చిపెట్టడం భారతీయులందరి కర్తవ్యం. ఇక్కడితో మతోన్మాదం మంటగలిసిపోవాలి. ఉగ్రవాదం ఊపిరి ఆగిపోవాలని ఆశిద్దాం.



జమ్మూకశ్మీర్ సరిహద్దులోని గ్రామీణ పాఠశాలలో మాక్ డ్రిల్

# సమర సం

ఏప్రిల్ 28, సోమవారం:

**ప్రధాని మోదీతో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ భేటీ**

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రధాని నరేంద్ర మోదీతో సోమవారం న్యూఢిల్లీలోని 7, కళ్యాణ్ మార్గ్ ప్రధాని అధికారిక నివాసంలో భేటీ అయ్యారు. 40 నిమిషాలపాటు సాగిన సమావేశంలో పాకిస్తాన్‌పై ప్రతీకారానికి చేస్తున్న సన్నాహాలను మోదీకి సింగ్ వివరించినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. రాజ్‌నాథ్ సింగ్ అంతకుముందు నార్త్ బ్లాక్‌కు వెళ్లి ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీతో సమావేశమయ్యారు. కశ్మీర్‌లో ప్రత్యేకించి పెహల్గావ్‌లో పరిస్థితి గురించి రక్షణ మంత్రికి ఆర్మీ చీఫ్ వివరించారు. ఉగ్రదాడి తదనంతర పరిణామాలపై పార్లమెంట్ ప్రాంగణంలో రక్షణపై జరిగిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశానికి ఎంపీలు రాహుల్ గాంధీ, రాధామోహన్ సింగ్, విష్ణుపాల్ రే, జగన్నాథ్ సర్కార్, శక్తి సింగ్ గోహిల్, సంజయ్ సింగ్ హాజరయ్యారు.

**సరైన పరిష్కారానికి అమెరికా విజ్ఞప్తి**

పెహల్‌గావ్ ఉగ్రదాడితో భారత్, పాకిస్తాన్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఒక బాధ్యతాయుతమైన పరిష్కారాన్ని కనుక్కోవాలని ఇరుదేశాలకు అమెరికా విజ్ఞప్తి చేసింది. ఆ దిశగా తాము ఉభయులను ప్రోత్సహిస్తామని, అదే సమయంలో భారత్‌కు అండగా ఉంటామని తెలిపింది.

**భారత్‌తో గొడవలొద్దు**

ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్త వాతావరణంలో భారత్‌తో గొడవలు పెట్టుకోవద్దని పాకిస్తాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ తన సోదరుడు, ప్రస్తుత పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు హితవు చెప్పారు. సోదరులిద్దరూ జతి ఉమ్రాహ్‌లోని తమ కుటుంబ నివాసంలో భేటీ అయ్యారు. భారత్ సింధూ జలాల ఒప్పందం రద్దు చేయడంతో జాతీయ భద్రతా కమిటీ తీసుకున్న నిర్ణయాలను నవాజ్‌కు షెహబాజ్ వివరించారు. అవసరమైతే స్పందించడానికి సైన్యం సన్నాహాలను, ప్రభుత్వ సంసిద్ధతను కూడా వివరించారు. అంతా సావధానంగా విన్న నవాజ్ భారత్‌తో దూకుడుగా కాకుండా దౌత్య మార్గాల ద్వారా పరిస్థితిని చక్కదిద్దుకోవాలని పాక్ ప్రధానికి సూచించారు.

## కేతాలు

### నరహంతకుల దగ్గర చైనా శాటిలైట్ ఫోను, యూఎస్ తుపాకులు

పెహల్గావ్‌లో దాడికి పాల్పడిన నలుగురు నరహంతకుల కోసం భద్రతా దళాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. ఆ నలుగురి లొకేషన్లను నాలుగు సార్లు ట్రాక్ చేసినప్పటికీ వారు తృటిలో తప్పించుకున్నట్టు సమాచారం. ఇరు వర్గాల మధ్య ఒకానొక సందర్భంలో పరస్పరం కాల్పులు జరిగాయని తెలిసింది. ఉగ్రవాదుల ఆచూకీని మొదటగా పెహల్గావ్ తెహస్లీ వద్ద, రెండవసారి కుల్గావ్ అడవుల్లో, మూడవసారి త్రాల్ కొండల్లో, కొకెర్నాగ్‌లో కనిపెట్టినప్పటికీ ముష్కరులు భద్రతా బలగాలపై కాల్పులు జరుపుతూ దట్టమైన అడవుల్లోకి పారిపోయారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. తాజాగా ఆదివారం రాత్రి ఒక గ్రామంలోని ఓ ఇంట్లో భోజనానికని ముష్కరులు వెళ్లారు. సరిగ్గా అప్పుడే అక్కడికి భద్రతా దళాలు రావడాన్ని గమనించి నరహంతకులు పారిపోయారు. దుండగుల కోసమని సైన్యం, సీఆర్పీఎఫ్, జమ్ముకశ్మీర్ పోలీసులు పెహల్గావ్ దగ్గర్లోని అడవులను జల్లెడ పడుతున్నారు. ఉగ్రవాదుల దగ్గర చైనా యాప్స్, అమెరికా తుపాకులు, సీక్రెట్ ఎన్‌క్రిప్టెడ్ సాధనాలు ఉన్నట్టు జాతీయ దర్యాప్తు ఏజెన్సీ–ఎన్ఐఏ గుర్తించింది. హిందువులపై దాడి చేస్తున్న సమయంలో ఉగ్రవాదులు చైనాలో తయారైన శాటిలైట్ ఫోన్‌ను వినియోగించినట్టు నిఘా వర్గాలు వెల్లడించాయి.


త్రివిధ దళాధిపతులతో ప్రధాని మోదీ భేటీ

### ఎల్వోసీ వద్ద పాక్ కవ్వింపు చర్యలు

జమ్ముకశ్మీర్‌లో నియంత్రణ రేఖ(ఎల్వోసీ) వెంబడి పాకిస్తాన్ సైన్యం వరుసగా నాలుగో రోజు కూడా కాల్పులకు దిగింది. భారత సైన్యం అంతే దీటుగా శత్రువుకు బదులిచ్చింది. "ఎల్వోసీ వద్ద పాక్ వరుసగా నాలుగు రోజులుగా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి కాల్పులు జరుపుతున్నది. ఈ నెల 27, 28 తేదీల్లో కుప్వారా, పూంచ్ ప్రాంతాల్లో ఎల్వోసీ వద్ద పాక్ సైన్యం భారత సైన్యంపై కాల్పులకు తెగబడింది. భారత సైన్యం అదే రీతిలో వేగంగా బదులిచ్చింది" భారత సైన్యం ప్రకటించింది.

### బీబీసీ తీరుపై భారత్ అభ్యంతరం

పెహల్గావ్ ఉగ్రదాడిని వార్తలుగా అందించడంలో బ్రిటీష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్– బీబీసీ వ్యవహరించిన తీరు పట్ల భారత్ తీవ్రమైన అభ్యంతరం వ్యక్తం చేసింది. బీబీసీ దాడి చేసిన ఉగ్రవాదులను గన్‌మెన్లు అని పేర్కొనడాన్ని తప్పుపడుతూ కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ బీబీసీ భారత్ విభాగానికి అధిపతి జాకీ మార్టిన్‌కు ఒక లేఖ రాసింది.

### గాయని దేశద్రోహం

పెహల్గావ్ ఉగ్రదాడిపై సోషల్ మీడియాలో రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టిన లక్నోకు చెందిన జానపద గాయని నేహా సింగ్‌పై పోలీసులు దేశద్రోహం కింద కేసు నమోదు చేశారు. అభయ్ ప్రతాప్ సింగ్ అనే వ్యక్తి లక్నోలో హజ్రత్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు ప్రాతిపదికగా భారతీయ న్యాయసంహిత– బీఎన్ఎస్‌లో పలు సెక్షన్ల కింద నేహా సింగ్‌పై కేసు పెట్టినట్టు పోలీసులు తెలిపారు.

### పాకిస్తాన్ యూట్యూబ్ చానెళ్లపై భారత్ నిషేధం

భారత్ 16 పాకిస్తాన్ యూట్యూబ్ చానెళ్లను నిషేధించింది. ఈ చానెళ్లన్నీ కూడా భారత్ భద్రతా ఏజెన్సీలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, మతానికి సంబంధించిన విషయాలను, ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలపై ప్రపంచాన్ని తప్పుదారి పట్టించేలా సమాచారాన్ని అప్‌లోడ్ చేస్తున్నట్టు కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ గుర్తించింది. దీనిపై ప్రభుత్వానికి సిఫార్సు చేయడంతో చానెళ్లపై నిషేధం వేటు పడింది. నిషేధానికి గురైనవాటిలో పాక్ మాజీ క్రికెటర్ షోయబ్ అక్తర్‌కు చెందిన చానెల్‌తో పాటుగా డాన్ న్యూస్, సమా టీవీ, ఏఆర్ వై న్యూస్, ఇర్షాద్ భట్టి, బోల్ న్యూస్, రఫ్తార్, ది పాకిస్తాన్ రిఫరెన్స్, జియో న్యూస్, సమా స్పోర్ట్స్, జీఎన్ఎన్, ఉజైర్ క్రికెట్, ఉమర్ చీమా ఎక్స్‌క్లూజివ్, ఆస్మా షిరాజీ, మునీబ్ ఫరూఖ్, సునో న్యూస్ హెచ్‌డీ, రాజీనామా చానెళ్లు ఉన్నాయి.

### దాడికి ముందు రోజు ఉగ్రవాదితో బాంగ్లా నేత భేటీ

పెహల్గావ్‌లో ఉగ్రదాడి జరగడానికి ఒక రోజు ముందు అంటే ఏప్రిల్ 21వ తేదీన ఉగ్రమూక లష్కరే తోయిబా నేత ఇజార్‌తో బాంగ్లాదేశ్ ప్రభుత్వ న్యాయ సలహాదారు అసిఫ్ నజ్రుల్ ఆ దేశ రాజధాని ఢాకాలో భేటీ అయ్యాడు. ఈ భేటీ విషయాన్ని అక్కడి ప్రభుత్వం స్వయంగా అంగీకరించింది. అయితే ఇస్లామిస్టులపై వేధింపు కేసుల ఉపసంహరణ అంశంపైనే భేటీ జరిగిందని బుకాయించింది. ఇజార్‌కు ఉగ్రదాడులకు పాల్పడిన చరిత్ర ఉంది.

**ఏప్రిల్ 29, మంగళవారం:**

### జమ్ముకశ్మీర్ అప్రమత్తం

కశ్మీర్‌లో ఉగ్రవాదుల ఇళ్ల ధ్వంసానికి ప్రతీకారంగా మరిన్ని దాడులు చేయడానికి ఉగ్రమూకలు సన్నాహాలు చేసుకుంటున్నవైనాన్ని నిఘా వర్గాలు గుర్తించాయి. ఆ దిశగా కశ్మీర్ లోయలో స్లీపర్ సెల్స్ చురుకైన పాత్ర పోషించడానికి సిద్ధమవుతున్నట్టు కనిపెట్టాయి. ఈ నేపథ్యంలో యాంటీ ఫిదాయీన్ స్క్వాడ్లు, జమ్ముకశ్మీర్ పోలీసు శాఖకు చెందిన ప్రత్యేక కార్యకలాపాల బృందం రంగంలోకి దిగాయి. అదే సమయంలో గుల్‌మార్గ్, సోనామార్గ్, దాల్ సరస్సు తదితర పర్యాటక ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు.

### సైన్యం కదలికలపై ఐఎస్ఐ కూపీ

ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న తరుణంలో భారత్ సైన్యం కదలికలు తెలుసుకోవడానికి పాకిస్తాన్‌కు చెందిన ఐఎస్ఐ మోసపూరితమైన ఎత్తుగడకు పాల్పడుతున్నది. సరిహద్దులోని సైనిక సిబ్బంది, పౌరులకు సైనిక్ స్కూల్ ఉద్యోగులమంటూ ఫోన్లు చేసి సమాచారాన్ని రాబట్టడానికి ప్రయత్నిస్తోంది. అయితే తెలియని నంబర్ల నుంచి ఫోన్లు చేసేవారితోటి, ఆగంతకుల తోటి ఎలాంటి సమాచారాన్ని పంచుకోవద్దని పేర్కొంటూ సరిహద్దుల్లో ఉంటున్న ప్రజలను, సైనిక సిబ్బందిని భారత ప్రభుత్వం అప్రమత్తం చేసింది.

### సైన్యానికి పూర్తి స్వేచ్ఛ

పెహల్గావ్ ఉగ్రదాడిపై తగు రీతిన స్పందించ




డానికి సైన్యానికి పూర్తి స్వేచ్ఛను ఇచ్చామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. న్యూఢిల్లీలో ప్రధాని అధికారిక నివాసంలో మోదీ అధ్యక్షతన జరిగిన కీలకమైన సమావేశానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, డిఫెన్స్ స్టాఫ్ చీఫ్– సీడీఎస్ అనిల్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్, ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేదీ, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కుమార్ త్రిపాఠీ, ఎయిర్ చీఫ్ ఎస్పీ ధర్‌కర్ హాజరయ్యారు. సమావేశాన్ని ఉద్దేశించి ప్రధాని మాట్లాడుతూ ఉగ్రదాడి తదనంతర పరిణామాల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై సైన్యానికి పూర్తి స్వేచ్ఛను ఇచ్చినట్టు తెలిపారు. సమయం ఎప్పుడనేది సైన్యమే నిర్ణయిస్తుందని, సైన్యంపై తమకు పూర్తి నమ్మకం ఉందని అన్నారు. ఇదే సందర్భంగా సాయుధ దళాల సామర్థ్యాన్ని మోదీ ప్రశంసించారు.

**దాడి సూత్రధారికి పాక్ సైన్యం శిక్షణ**

పెహల్గావ్ ఉగ్రదాడి వెనుక ముఖ్య సూత్రధారిగా పాకిస్తాన్ జాతీయుడు హాషీమ్ ముసాను నిఘా ఏజెన్సీలు గుర్తించాయి. ఇతడికి పాక్ సైన్యం పారా కమాండో శిక్షణను ఇచ్చింది. ఇందులో భాగంగా అసాధారణ యుద్ధరీతులు, మనుగడ వ్యూహాలు, పర్వతాలు, అటవీ ప్రాంతాల్లో పోరాటంపై ముసా మంచి పట్టు సాధించాడు. అతడు పాకిస్తాన్ నుంచి భారత్‌కు కథువా–సాంబా సెక్టార్ల గుండా అక్రమంగా వచ్చినట్టు నిఘా ఏజెన్సీలు అనుమానిస్తున్నాయి. అలా వచ్చిన ముసా రాజౌరి–పూంచ్‌లోని దేరాకిగలి ప్రాంతంలో ఉగ్రవాద కార్యకలాపాల్లో చురుగ్గా పాలుపంచుకుంటున్నాడు. స్థానిక పోలీసులతో పాటుగా భద్రతా బలగాలకు దొరక్కుండా తప్పించుకొని తిరుగుతున్నాడు.

**పాకిస్తాన్‌కు భారత్ గగనతలం మూసివేత**

ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు నానాటికీ పెరిగిపోతున్న తరుణంలో ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్తాన్ విమానాలను భారత్ గగనతలంలోకి అనుమతించరాదని ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. పాక్ విమానయాన సంస్థలకు చెందిన విమానాలు సర్వసాధారణంగా కౌలాలంపూర్‌తో పాటుగా మలేసియాలోని ఇతర నగరాలు, సింగపూర్, థాయ్‌లాండ్ లాంటి చోట్లకు వెళ్లాలంటే భారత్ గగనతలం గుండా వెళ్తుంటాయి. భారత్ తీసుకున్న నిర్ణయంతో పాక్ విమానాలు దక్షిణాసియా ప్రాంతాలకు చేరడానికి చైనా, శ్రీలంక గుండా వెళ్లాల్సి ఉంటుంది. దీంతో ఇప్పటికే తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న పాక్ పౌర విమానయాన సంస్థలు మరింత నష్టాల్లోకి కూరుకుపోయే అవకాశం ఉంది.

**బాధిత కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగం**

పెహల్గావ్ ఉగ్రదాడిలో మహారాష్ట్రకు చెందిన ఆరుగురు అమరులయ్యారు. మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున ఆర్థిక సాయం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ప్రకటించారు. ఈమేరకు రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఒక నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.

**భారత్ అంటే పాకిస్తాన్ బెంబేలు**

పెహల్గావ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఏ క్షణమైనా తమపై విరుచుకుపడే అవకాశం ఉందనే భయంతో పాకిస్తాన్ భీతిల్లుతోంది. త్రివిధ దళాధిపతులతో మోదీ సర్కారు వరుస భేటీలు, సాయుధ దళాల సమర సన్నాహాలు, నావికాదళం క్షిపణి పరీక్షలతో పాకిస్తాన్ అప్రమత్తమవుతోంది. దీనికి నిదర్శనం అన్నట్టుగా నియంత్రణ రేఖ–ఎల్‌వోసీ వెంబడి ఉగ్రవాదుల స్థావరాలను, లాంచ్ ప్యాడ్‌లను ఖాళీ చేయించింది. టెర్రరిస్టులను సైనిక స్థావరాలు, బంకర్లకు తరలిస్తోంది. అంతర్జాతీయ సరిహద్దుకు దాదాపు 60 కి.మీ.ల దూరంలోని ఖోర్ కంటోన్మెంట్ వద్ద ఏర్పాటు చేసిన టీపీఎస్–77 రాడార్ సైట్‌ను మరోచోటికి తరలిస్తోంది. ఇది బహుముఖ రాడార్ వ్యవస్థ. విమానాల రాకపోకల పర్యవేక్షణకు దీనిని వినియోగిస్తుంటారు.

**సగానికి పైగా పర్యాటక ప్రాంతాలు మూసివేత**

ఉగ్రదాడితో జమ్ముకశ్మీర్‌లో 87 పర్యాటక ప్రాంతాలకుగాను 48 ప్రాంతాలను ప్రభుత్వం మూసివేసింది. మరిన్ని ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలు చేసిన హెచ్చరికతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కశ్మీర్ లోయలో ఉగ్రమూకలకు చెందిన నిద్రాణంగా ఉన్న స్లీపర్ సెల్స్ రంగంలోకి దిగాయి. అవి ఉత్తర, మధ్య, దక్షిణ కశ్మీర్ ప్రాంతాల్లో భారీ దాడులకు పాల్పడే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించిన నేపథ్యంలో గుల్‌మార్గ్, సోన్ మార్గ్, దాల్ సరస్సు లాంటి పర్యాటక ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు.

**మే 1, గురువారం:**

**ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకలిస్తాం**

26 మంది అమాయకులను బలిగొన్న పెహల్గావ్ ఉగ్రదాడికి పాల్పడిన వారిని, పథకరచన చేసిన వారిని పక్కాగా కనిపెట్టి మరీ మట్టుపెడతామని కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా ఢిల్లీలో అన్నారు. దాడికి బాధ్యులైనవారు తామేదో విజయం సాధించామని అనుకుంటే పొరపాటని, వారు అందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని మంత్రి హెచ్చరించారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశంలో ఉగ్రవాదులు ఏ ప్రాంతంలో ఉన్నప్పటికీ వారికి గట్టిగా బదులిస్తుందని అన్నారు. ప్రభుత్వ సంకల్పం దేశంలో ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో సహా పెకలించివేయడమేనని తెలిపారు. ఆ సంకల్పాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సాధిస్తామని అమిత్ షా చెప్పారు. యావత్ ప్రపంచం ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు అండగా నిలుస్తోందని తెలిపారు.

**భారత్‌తో యుద్ధమా.. వద్దు బాబోయ్..!**

పాకిస్తాన్‌కు భారత్ అంటే ఇప్పుడే కాదు మూడు దశాబ్దాల క్రితం కూడా భయమే. ఇదెవరో దారినపోయే దానయ్య చెప్పిన మాట కాదు. సాక్షాత్తూ అమెరికా నిఘా ఏజెన్సీ–సీఐఏ స్పష్టం చేసింది. దీనికి సంబంధించి 1993లో సీఐఏ బహిర్గతం చేసిన నేషనల్ ఇంటెలిజెన్స్ ఎస్టిమేట్ (ఎన్ఐఈ) పత్రం ఇందుకు నిదర్శనంగా నిలిచింది. సీఐఏ అధికారి బ్రూస్ రెయిడెల్ 1992లో బాబ్రీ మసీదు ఘటన జరిగిన కొద్ది కాలానికి భారత్, పాకిస్తాన్‌ల మధ్య ఉద్రిక్తతలు ప్రధానంగా ఈ పత్రాన్ని తీసుకొచ్చారు. ఆ పత్రం ప్రకారం అప్పట్లో పాక్ అస్థిరత్వంలో కొట్టుమిట్టాడుతోంది. ఇరు దేశాల దగ్గర అణ్వాయుధాలు ఉన్నాయన్న మాటేగాని వాటిని ప్రయోగించేంత పరిస్థితి అయితే రాలేదు. అయితే ఉభయుల మధ్య యుద్ధం రావడానికి అవకాశం 20 శాతమే ఉంది. రెండు దేశాలూ సమరాన్ని కోరుకోవడంలేదు. అయితే ఆర్థికంగా, సైనిక పాటవం పరంగా, దౌత్యపరంగా అందనంత ఎత్తుకు ఎదిగిపోతున్న భారత్‌ను చూసి పాకిస్తాన్ ఓర్వలేకపోయింది. అప్పుడే ఆ దేశం సైనిక

పాలన, రాజకీయ సంక్షోభాలు, ఆర్థిక ఇబ్బందు లతో ఇక్కట్ల పాలవుతోంది. పాకిస్తాన్ భారత్ అంటే అమితమైన భయంతో కశ్మీర్ అంశాన్ని తెరమీదకు తీసుకొనివచ్చి మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తోంది. పాకిస్తాన్ ఎంతగా కశ్మీర్ అంశాన్ని ప్రపంచానికి భూతద్దంలో పెట్టి చూపించినప్పటికీ భారత్‌తో యుద్ధమంటూ వచ్చిన పక్షంలో నాలుగు అడుగులు వెనక్కి వేస్తుందే తప్ప ఒక్క ముందడుగు కూడా వెయ్యదని సీఐఏ పత్రం తేల్చి చెప్పింది.

**మే 2, శుక్రవారం:**

**యూపీలో ఎక్స్‌ప్రెస్ హైవేపై జెట్ విమానాల విన్యాసాలు**

పాకిస్తాన్‌తో యుద్ధం అనివార్యమైన పక్షంలో భారత వాయుసేనకు చెందిన యుద్ధ విమానాల టేకాఫ్, ల్యాండింగ్‌కు అనుకూలంగా ఉండేలా ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్‌లో గంగా ఎక్స్‌ప్రెస్ హైవేను తీర్చిదిద్దారు. ఈ హైవే పాకిస్తాన్‌కు 1,000 కి.మీ.ల దూరంలో ఉండటం గమనార్హం. ఇదే హైవేపై విమానాల రాకపోకల కోసమని 3.5 కి.మీ.ల మేర ఎయిర్ స్ట్రిప్‌ను నిర్మించారు. దీనిపై ఫైటర్ జెట్ విమానాలు శుక్రవారం నుంచి విన్యాసాలు చేయసాగాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన ఎయిర్ స్ట్రిప్‌పైన జెట్ విమానాలు పగటిపూట మాత్రమే కాకుండా సాయంత్రం 7 నుంచి రాత్రి 10 గంటల వరకు విన్యాసాలు చేస్తున్నాయి. తద్వారా ఎయిర్ స్ట్రిప్ సామర్థ్యాన్ని పరీక్షిస్తున్నట్టు సంబంధిత అధికారులు తెలిపారు. అదే సమయంలో భద్రతా చర్యల్లో భాగంగా హైవేపై నిర్మించిన ఎయిర్ స్ట్రిప్‌కు ఇరువైపులా 250 సీసీటీవీ కెమెరాలను నెలకొల్పినట్టు చెప్పారు.

**అరేబియా సముద్రంలో భారత నావికాదళం మోహరింపు**

భారత నావికా దళం అరేబియా సముద్రంలో యుద్ధనౌకలను మోహరించింది. యుద్ధ నౌక ఐఎన్ఎస్ సూరత్ నుంచి చాలా దూరంలో ఉన్న శత్రువుల నౌకలను పనిపట్టే క్షిపణులను విజయవంతంగా పరీక్షించింది. అలాగే అత్యాధునిక రాడార్ ఊతంగా గగనతలంలో 70 కి.మీ.ల దూరంలో ఉన్న శత్రువుల విమానాలను సునాయాసంగా కూల్చివేసే భూమి ఉపరితలం నుంచి గగనానికి క్షిపణి వ్యవస్థను కూడా విజయవంతంగా ప్రయోగించింది. అదే సమయంలో భారత్ తీర ప్రాంత గస్తీ దళం గుజరాత్‌ను ఆనుకొని ఉన్న సముద్రంలో నౌకలను మోహరించినట్టు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

**మే 3, శనివారం:**

**పెహల్గావ్ ఉగ్రదాడి వెనుక పాకిస్తాన్**

మానవాళికి ప్రాణాంతకమైన ముప్పుగా ఉగ్రవాదం పెచ్చరిల్లిపోతోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పెహల్గావ్ ఉగ్రదాడి వెనుక పాకిస్తాన్ ప్రమేయం ఉన్నట్టు తేటతెల్లమైందని తెలిపారు. దాడికి పాల్పడింది పాకిస్తానీయులేనని చెప్పారు. వాళ్లలో ఒకడు పాక్ సైన్యంలో పారా కమాండోగా పనిచేశాడు. అమాయక పర్యాటకులను బలిగొన్న ఏ ఒక్క ఉగ్రవాదినీ, వాళ్ల మద్దతుదారులను విడిచిపెట్టేది లేదని ప్రధాని అన్నారు.

**పాకిస్తాన్‌ను వెలి వేసిన భారత్**

పెహల్గావ్ ఉగ్రదాడికి ప్రతిగా తీసుకున్న మూడు చర్యలతో భారత్ పాకిస్తాన్‌ను దాదాపు వెలి వేసినంత పని చేసింది. చర్యల్లో మొదటిదిగా పాకిస్తాన్ నుంచి నేరుగా కానీ, పాకిస్తాన్ పేరిట ఇతర దేశాల నుంచి కానీ అన్ని రకాల సరుకుల దిగుమతిపై పూర్తిగా నిషేధం విధించింది. ఇరు దేశాల మధ్య ఎగుమతులు, దిగుమతుల విషయానికి వస్తే.. భారత్ పాకిస్తాన్‌కు 2021-22 ఆర్థిక సంవత్సరానికి 513.82 మిలియన్ డాలర్ల విలువైన సరుకులను, 2022-23లో 627.1 మిలియన్ డాలర్ల విలువైన సరుకులను ఎగుమతి చేసింది. భారత్ అదే ఆర్థిక సంవత్సరాల్లో పాకిస్తాన్ నుంచి వరుసగా 2.54 మిలియన్ డాలర్లు, 20.11 మిలియన్ డాలర్ల విలువైన సరుకులను దిగుమతి చేసుకుంది. ఇది మొత్తం వాణిజ్యంలో చాలా స్వల్పం. అయితే గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జనవరి దాకా భారత్ ఎగుమతుల విలువ 447.65 మిలియన్ డాలర్లు కాగా దిగుమతుల విలువ 0.42 మిలియన్ డాలర్లుగా మాత్రమే ఉంది. భారత్ పాక్ దిగుమతులపై నిషేధం విధించిన కొద్ది గంటల్లోనే రెండవ చర్యగా దేశంలోని అన్ని ఓడ రేవుల్లోనూ పాక్ పతాకం ఉన్న నౌకల ప్రవేశాన్ని నిషేధించింది. ఇక శనివారంనాటి చివరిదైన మూడవ చర్యగా పాక్ నుంచి భారత్‌కు అన్ని మార్గాల్లో అన్ని కేటగిరిల్లో మెయిల్స్, పార్శిళ్ల బట్వాడాను నిలిపివేయాలని ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

**మే 4, ఆదివారం:**

**మీరు(భారతీయులు) కోరుకున్నట్టుగా జరుగుతుంది**

పెహల్గావ్ ఉగ్రదాడిపై యావత్ భారతీయులు ఆగ్రహంతో రగిలిపోతున్న వేళ ప్రభుత్వం దేశ ప్రజల ఆకాంక్షలకు తగ్గట్టుగానే చర్యలు తీసుకుంటుందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. దేశరాజధానిలో జరిగిన సంస్కృతి జాగరణ్ మహోత్సవ్‌ను ఉద్దేశించి ప్రసంగిస్తూ భారత్‌పై దాడులకు పాల్పడేవారికి తప్పకుండా గుణపాఠం చెప్పితీరుతామని హెచ్చరించారు. రక్షణ మంత్రిగా దేశ సరిహద్దులతో పాటు సైనికులను కాపాడుకోవడం తన బాధ్యత అని ఆయన అన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో దేశ ప్రజలు కోరుకున్నది (పెహల్గావ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా) తప్పకుండా జరిగి తీరుతుందని తెలిపారు.

**భారత్ చేతికి రష్యా క్షిపణులు**

పెహల్గావ్ ఉగ్రదాడితో పాక్‌తో సరిహద్దుల వద్ద ఉద్రిక్తతలు నెలకొన్న తరుణంలో రూ.250 కోట్లకుపైగా విలువైన రష్యాకు చెందిన ఇగ్లా-ఎస్ క్షిపణులు భారత్ అమ్ములపొదిలోకి చేరాయి. శత్రు విమానాలు, డ్రోన్లు, హెలికాప్టర్లపై దాడి చేయడానికి ఉద్దేశించిన ఈ క్షిపణులను భారత సైన్యం పాకిస్తాన్‌కు పశ్చిమంగా మోహరిస్తుంది.



అరేబియా సముద్రంలో భారత నావికాదళ విన్యాసం

**పాకిస్తాన్‌కు ఆయుధాలు నిండుకున్నాయి**

భారత్‌ను అది చేస్తాం ఇది చేస్తాం అంటూ గొప్పలకు పోయే పాకిస్తాన్ దగ్గర ఆయుధాలు నిండుకున్నాయి. పెహల్గావ్ ఉగ్రదాడి అనంతరం భారత్‌తో పంచుకునే సరిహద్దుల వద్ద యుద్ధ సామాగ్రి డిపోలను కట్టుకున్న దాయాది దేశానికి యుద్ధమంటూ ముంచుకొస్తే దాని చేతిలో ఉన్న యుద్ధ సామాగ్రి ముఖ్యంగా మందుగుండు సామాగ్రి నాలుగు రోజులకే ఖాళీ అయిపోతుంది. అదెలా జరిగిందంటే.. ఇటీవల ఉక్రెయిన్‌తో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా పాకిస్తాన్ తన దగ్గరున్న 155ఎంఎం శతఘ్ని గుండ్లను ఆ దేశానికి ఇచ్చేసింది. దీంతో భారత్ సైనిక చర్యను ధీటుగా ఎదుర్కోవడానికి ప్రయోగించే ఎం109 హోవిట్జర్లకు లేదా 122 ఎంఎం రాకెట్లకు గుండ్లు లేకుండా పోయాయి. గతంలో ఇదే విషయమై పాకిస్తాన్ మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఖమర్ జావెద్ బజ్వా మాట్లాడుతూ భారత్‌తో ఏదైనా ఘర్షణ చోటుచేసుకున్న పక్షంలో దాన్ని ఎదుర్కోవడానికి సరిపడినంత యుద్ధ సామాగ్రి, ఆర్థిక స్తోమత తమ దేశానికి లేదని అన్నారు.

– జాగృతి డెస్క్

రాష్ట్ర రాజధాని అమరావతిలో రూ. 58 వేల కోట్ల విలువైన 92 ప్రాజెక్టులకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఈ నెల 2న శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రోడ్లు, రైల్వేలు, రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి.. రూ.54,028 కోట్లతో 83 ప్రాజెక్టులపనులకు శంకుస్థాపన చేయడంతో పాటు రూ.4,050 కోట్లతో చేపట్టిన 9 ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. శాసనసభ, హైకోర్టు, సచివాలయం-హెచ్‌వోడీ భవనాల నిర్మాణం, అమరావతి మౌలిక సదుపాయాలు, అమరావతి వరద నివారణ పనులు, అమరావతి భూసమీకరణ- మౌలిక సదుపాయాల కల్పన, గృహ సముదాయాల నిర్మాణం వంటి పనులను ప్రధాని ప్రారంభించారు. రాష్ట్రంలో పలు జాతీయ రహదారుల నిర్మాణం, నాగాయలంకలో మిస్సైల్ పరీక్షా కేంద్రం, రైల్వే ప్రాజెక్టుల పనులకు వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు చేశారు. వీటిలో కేవలం రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించే రూ.49 వేల కోట్ల విలువగల 74 ప్రాజెక్టులు ఉన్నాయి.



# మూడేళ్లలో

రాష్ట్ర రాజధాని అమరావతి,పోలవరం ప్రాజెక్టుల పూర్తికి సంపూర్ణ సహకారం అందిస్తామని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ హామీ ఇచ్చారు. అమరావతిని ఒక 'శక్తి'గా అభివర్ణించారు. 'అమరావతి... స్వర్ణాంధ్ర విజన్‌కు శక్తినిస్తుంది. స్వర్ణాంధ్ర.. వికసిత్ భారత్ లక్ష్యాన్ని బలపరుస్తుంది. అమరావతి కేవలం ఒక నగరం కాదు...ఒక శక్తి. ఆంధ్రప్రదేశ్‌ను ఆధునిక ప్రదేశ్‌గా, అధునాతన ప్రదేశ్‌గా మార్చే శక్తి' అని ఉద్ఘాటించారు. అమరావతిని మూడేళ్లలో నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యంగా పెట్టుకున్నారని, ఆ తర్వాత రాష్ట్ర జీడీపీని అమరావతి నగరం ఎక్కడికి తీసుకెళుతుందో తాను ఊహించగలనని ప్రధాని అన్నారు. వెలగపూడి సచివాలయ సమీపంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రధాని ప్రసంగిస్తూ, ఏపీ అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

**నవదుర్గా మిస్సైల్ టెస్టింగ్ రేంజ్**

గుల్లలమోదలో డీఆర్డీవో రూ.1,500 కోట్ల అంచనాలతో నిర్మించే క్షిపణి పరీక్ష రేంజ్ పనులను ప్రధాని మోదీ అమరావతి నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కేంద్రానికి నాగాయలంక నవదుర్గా మిస్సైల్ టెస్టింగ్ రేంజ్‌గా నామకరణం చేస్తూ ఇది రక్షణ రంగానికి నవశక్తినిచ్చే కేంద్రంగా అభివర్ణించారు. ఈ కేంద్రం అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మితమవుతుంది. అయిదు కిలో మీటర్లకు పైబడిన లక్ష్యాలను ఛేదించే మిస్సైల్‌ను ప్రయోగించేందుకు ఈ కేంద్రాన్ని వేదికగా చేసుకోవచ్చుని డీఆర్డీవో భావిస్తోంది. దీని కోసం అత్యాధునిక ఈవో(ఎలక్ట్రో ఆప్టికల్ సిస్టమ్) వినియోగించనుంది. ఇక్కడ అత్యాధునిక ఇండిజెనాస్ రాడార్ సిస్టమ్‌కూడా ప్రవేశపెట్టనుంది. ఇప్పటికే భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ భాగస్వామ్యంతో డీఆర్డీవో ఇండిజెనాస్ రాడార్ సిస్టమ్‌ను వినియోగంలోకి తెచ్చిన ఇంద్ర, అశ్విని, స్వాతి, షోర్డ్‌షిఫ్ వంటి ఆధునిక రాడర్లను నాగాయలంకలోని మిస్సైల్ టెస్టింగ్ రేంజ్‌లో పూర్తిస్థాయిలో ఉపయోగించనున్నారు. వీటి ద్వారా భూమికి సమీపం నుండి వెళ్లే మిస్సైల్‌లు, హెలికాప్టర్లను గుర్తించే వెసులుబాటు ఉంటుంది. నవదుర్గా మిస్సైల్ టెస్టింగ్ రేంజ్ ద్వారా దీర్ఘశ్రేణి క్షిపణులను సయితం పరీక్షించే వెసులుబాటు ఉంటుంది. ఇంతకాలం హైదరాబాద్‌లోని డీఆర్డీవో తయారు చేసే క్షిపణులను ఒడిశాలోని బాలసోర్ నుంచి పరీక్షిస్తుండగా, హైదరాబాద్ నుంచి విజయవాడకు, విజయవాడ నుంచి బాలసోర్‌కు చేరుకునేందుకు ఎక్కువ సమయం పడుతుండటం, పరీక్ష చేయాల్సిన క్షిపణుల రక్షణకు కూడా ప్రమాదం పొంచి ఉండటంతో దీర్ఘశ్రేణి క్షిపణులను తరలించేందుకు డీఆర్డీవో ఇబ్బందులు పడుతూ వచ్చింది. ప్రతిపాదిత పరీక్ష/ప్రయోగ కేంద్రంతో బాలసోర్‌కు వెళ్లే దూరం సగానికి సగం కంటే తక్కువగా ఉండటం, ఇక్కడకు దీర్ఘ శ్రేణి క్షిపణులను తరలించేందుకు మౌలిక వసతులు ఇప్పటికే దాదాపుగా కలిగి ఉండటంతో కలసి వచ్చే అవకాశం. ఈ కేంద్రం నుంచి 5 వేల కిలోమీటర్లు, అంతకు మించి వెళ్లే క్షిపణులను పరీక్షించే అవకాశం ఉంది.

కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు రాజధాని అమరావతిలో వివిధ భవనాలు, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి ప్రధాని శంకుస్థాపన చేసిన కీలక నిర్మాణాలు....

- 11.22 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో రాష్ట్ర శాసనసభ నిర్మాణం.
- 20.32 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో హైకోర్టు భవనం. 50 అంతస్తుల సచివాలయం, 42 అంతస్తులతో నాలుగు హెచ్‌డీ టవర్లు.
- 37 ట్రంక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులు,సైకిల్ ట్రాక్‌లు 320 కి. మీ. మేర ప్రపంచ స్థాయి రహదారులు.
- అమరావతి వరద నివారణ పనులతోపాటు నగర అవసరాలకు 0.53 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో మూడు జలాశయాలు.
- ల్యాండ్ పూలింగ్ స్కీమ్ మౌలిక సదుపాయాల్లో భాగంగా 1,281 కి.మీ. రహదారులు, 13 జోన్లలో సమగ్ర పౌర సౌకర్యాల కల్పన.
- న్యాయమూర్తులు, మంత్రులు, ప్రభుత్వ ఉద్యోగులకు గృహ, భవన నిర్మాణాలు ఉద్దేశించిన 10 ప్రాజెక్టులు.

**ఎన్‌హెచ్‌లు, రైల్వే ప్రాజెక్టులు :**

- హిందూపురం-గోరంట్ల మధ్య 34 కి.మీ. మేర జాతీయ రహదారిని రూ.809 కోట్లతో నాలుగు వరుసలుగా విస్తరణకు శంకుస్థాపన.
- ముద్దనూరు-బి. కొత్తపల్లి మధ్య 57 కి.మీ. జాతీయ రహదారి రూ.1,020 కోట్లతో నాలుగు వరుసలుగా విస్తరణ.
- నంద్యాల నుంచి కర్నూలు, కడప సరిహద్దు వరకు 62 కి.మీ. మేర జాతీయ రహదారి రూ.692 కోట్లతో రెండు వరుసలుగా, ముదిరెడ్డిపల్లె నుంచి కడప, నెల్లూరు సరిహద్దు వరకు 36 కి.మీ. జాతీయ రహదారిని రూ.279 కోట్లతో విస్తరణ.
- శ్రీకాకుళం జిల్లా రణస్థలం పట్టణ పరిధిలో 5 కి.మీ. మేర జాతీయ రహదారి-16ని రూ.252 కోట్లతో ఆరు వరుసలుగా విస్తరణ.
- సత్యసాయి జిల్లాలోని ఎన్హెచ్-44లో ఎర్రమంచి,




# ఆంధ్ర మునుముందుకు!

గుడిపల్లి గ్రామాల వద్ద 2 కి. మీ. మేర రూ.124 కోట్లతో ఆర్వోబీ.

❊ గుంతకల్లు వెస్ట్, మల్లప్ప గేట్ స్టేషన్ల మధ్య 10 కి. మీ. మేర రూ.23 కోట్లతో రైల్ ఓవర్ రైల్ వంతెన.

❊ నాగాయలంక వద్ద రూ.1,459 కోట్లతో చేపడుతున్న క్షిపణి ప్రయోగ కేంద్రం.

❊ విశాఖపట్నం మధురవాడ వద్ద రూ.172 కోట్లతో పీఎం ఏక్తా మాల్ నిర్మాణం.

**జాతికి అంకితం చేసిన ప్రాజెక్టులు**

❊ సీఎస్ పురం–మాలకొండ వరకు 44 కి.మీ. మేర రూ.277 కోట్లతో విస్తరించిన రెండు వరుసల జాతీయ రహదారి.

❊ మాలకొండ–సింగరాయకొండ మధ్య 46 కి. మీ. మేర రూ.370 కోట్లతో రెండు వరుసలుగా విస్తరించిన జాతీయ రహదారి.

❊ సీతారామపురం– దుత్తలూరు మధ్య 36 కి. మీ. మేర రూ.364 కోట్లతో రెండు వరుసలుగా అభివృద్ధి చేసిన జాతీయ రహదారి.

❊ జమ్మలమడుగు–ప్రొద్దుటూరు మధ్య రైల్వే గేట్ వద్ద రూ. 68 కోట్లతో నాలుగు వరుసలుగా నిర్మించిన ఆర్వోబీ.

❊ పుంగనూరు పట్టణ పరిధిలో 10 కి.మీ. మేర రూ.41 కోట్లతో విస్తరించిన జాతీయ రహదారి.

❊ రేణిగుంట –నాయుడుపేట మధ్య రూ.2,510 కోట్లతో ఆరు వరుసలుగా విస్తరించిన 57 కి. మీ. జాతీయ రహదారి.

❊ పోర్టు అనుసంధానంలో భాగంగా విశాఖ పట్నంలో ఈస్ట్ బ్రేక్ వాటర్స్ నుంచి కాన్వెంట్ జంక్షన్ వరకు రూ.50 కోట్లతో నాలుగు వరుసలుగా విస్తరించిన నాలుగు కి.మీ.జాతీయ రహదారి.

❊ విజయవాడ రైల్వే స్టేషన్‌కు, న్యూవెస్ట్ బ్లాక్ హాట్ క్యాబిన్‌కు మధ్య 5 కి. మీ. మేర రూ.70 కోట్లతో నిర్మించిన మూడో లైన్ అనుసంధానం.

❊ గుంటూరు–గుంతకల్లు డబ్లింగ్ పనుల్లో భాగంగా బుగ్గనపల్లె సిమెంట్ నగరం – పాణ్యం స్టేషన్ల మధ్య రూ.184 కోట్లతో 19 కి. మీ. మేర పూర్తయిన డబ్లింగ్ పనులను ప్రధాని జాతికి అంకితం చేశారు.

**ఆకట్టుకున్న ‘ప్రజారాజధాని’ వీడియో ప్రదర్శన**

అమరావతి ప్రజారాజధాని (పీపుల్స్ క్యాపిటల్) పేరిట ప్రదర్శించిన వీడియో ఆకట్టుకుంది. అమరావతి చరిత్ర, నేపథ్యం, రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రుల ఆకాంక్ష మేరకు ప్రజా రాజధానిగా అవతరించడాన్ని చక్కగా ఆవిష్కరించారు. రైతులు ముందుకొచ్చి రాజధాని కోసం 34 వేల ఎకరాలు ఇవ్వడం, 2014–19 మధ్య జరిగిన నిర్మాణాలు, అభివృద్ధి, అందుబాటులోకి వచ్చిన విద్యాసంస్థలు.. తర్వాత అయిదేళ్ల పాటు వైసీపీ ప్రభుత్వం సాగించిన విధ్వంసంతో అమరావతి మసకబారడం, దీనిపై అన్నివర్గాల ప్రజలు చేసిన ఉద్యమాలు, 2024లో కూటమి అధికారంలోకి రావడంతో అమరావతికి పునరుజ్జీవం రావడం.. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మాణానికి సిద్ధమైన తీరుపై వీడియో ప్రదర్శించారు.

**తరలివచ్చిన అశేష ప్రజానీకం**

నవ్యాంధ్ర రాజధాని అమరావతి పనులు పునఃప్రారంభోత్సవ సభకు ప్రజలు భారీగా తరలిరావడంతో సభా ప్రాంగణం,షెడ్లు జనాలతో నిండిపోయాయి. వివిధ జిల్లాల నుంచి వారు మండుటెండనూ లెక్క చేయకుండా ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రధాన వేదిక ఎదుట వేసిన 3 షెడ్లు మధ్యాహ్నానికే నిండిపోవడంతో సభకు ఎదురుగా షెడ్లు వేసి భారీ ఎల్ ఈడీ తెరలు ఏర్పాటు చేశారు. చివరికి పార్కింగ్ ప్రాంతంలో వేసిన షెడ్ల కింద ప్రజలు సేదతీరారు. ప్రధాని మోదీ వచ్చే సమయానికి వాతావరణం చల్లబడడంతో చాలామంది సభ పరిసరాల్లో రోడ్లపై నిలబడి తెరలపై కార్యక్రమాలు తిలకించారు. గ్యాలరీలు నిండాక పోలీసులు జనాన్ని నియంత్రిస్తూ, ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకున్నారు. సాయంత్రం 4. గంటల సమయంలోనూ దూరప్రాంతాల నుంచి జనం రావడం కనిపించింది. సభ ముగిసి నేతలు వెళ్లాక.. ప్రజలను ప్రధాన వేదిక, పైలాన్ వద్దకు అనుమతించారు. దీంతో వేదికపై, అమరావతి పైలాన్ వద్ద ఫొటోలు దిగేందుకు పోటీపడ్డారు.

**అమరావతిలో ప్రధానికి జేజేలు:**

ప్రధాని మధ్యాహ్నం 3.30 గంటలకు హెలికాప్టర్లో వెలగపూడిలో దిగారు. అక్కడి నుంచి నేరుగా 1.2 కి. మీ. దూరంలోని సభా ప్రాంగణానికి కారులో వెళ్లారు. ప్రజలు దారికిరువైపులా నిలబడి జాతీయ పతాకాలు చేతబూని ‘ ప్రధాని వాహనశ్రేణి వెళ్తుండగా చేతులు ఊపుతూ ఘనస్వాగతం పలికారు. ‘మోదీ.... మోదీ.’, ‘జై అమరావతి.. జైజై అమరావతి’ అనే నినాదాలు చేశారు. వారి అభిమానానికి ముగ్ధులైన ప్రధాని మోదీ.. వాహన శ్రేణి నుంచే వారికి అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు. అందరూ ‘అమరావతి పునఃప్రారంభం’ లోగో ఉన్న తెల్లని టోపీలు ధరించారు. రోడ్ షో రద్దు కావడంతో ప్రజల నుంచి జేజేలు స్వీకరించేందుకు ప్రధాని మోదీ కాన్వాయ్ నెమ్మదిగా సాగింది. మోదీ జయజయధ్వానాలతో అమరావతి మార్మోగింది.



**తురగా నాగభూషణం**
సీనియర్ జర్నలిస్ట్



దేశంలోని ప్రతి నదికి ఒక ప్రత్యేకత. ఆయా ప్రాంతాల ప్రజలు స్థానిక/ సమీపంలోని నదులనే కాదు...ఆసేతుశీతాచల పర్యంతం గల నదులన్నిటిని దేవత(లు)గా పరిగణించి కొలుస్తారు. ఆయా నదులకు వచ్చే పుష్కరాలు జాతీయ పండుగలాంటివే. ఈ విషయంలో నదుల ప్రమాణంలో పెద్ద, చిన్న వ్యత్యాసం కనబడదు. గోదావరి, ప్రాణహిత, సరస్వతి, వరద, వైన్యా నదుల సంగమ స్థలిని పంచగంగా వ్యవహరిస్తారు. అలాంటి పవిత్ర నదుల్లో ఒకటైన సరస్వతికి ఈ నెల 15 వ తేదీ నుంచి పుష్కరాలు. ఈ పుష్కరాల వేళ 'నదులను పూజిద్దాం... పవిత్రంగా ఉంచుదాం' అని సంకల్పం చెప్పుకుందాం.

# పుష్కరమాతా వాగ్దేవీ!.. నమోస్తుతే

**'గంగేచ యమునే చైవ గోదావరీ సరస్వతీ**
**నర్మదే సింధు కావేరీ జలేస్మిన్ సన్నిధిం కురు'**... స్నానశ్లోకాన్ని బట్టి నదీ మతుల్లల విశిష్టత తెలుస్తుంది. నదేతర ప్రాంతాలు/ప్రదేశాలలో స్నానమాడుతున్నప్పుడు అక్కడి నీటిలో ఆయా నదీజలాలు ప్రవేశించాలని విన్నవించడం. అంటే 'నేను స్నానం చేసే నీటిలో ఈ నదీజలాలు ఉండుగాక' అని ఆశించడం.

పుష్కరరాజు, బృహస్పతి (గురువు) ఈ నెల (మే) 14వ తేదీ రాత్రి 10 గంటల 33 నిమిషాలకు మృగశిర నక్షత్రంలో మిథున రాశిలోకి ప్రవేశించడంతో సరస్వతి నది పుష్కరాలు ప్రారంభమవుతాయి. మరునాడు సూర్యోదయం నుంచి పుష్కర స్నానం ఆచరించవలసి ఉంటుంది. గంగా యమున సంగమం వద్ద ప్రవహించే సరస్వతి నదిని 'అంతర్వాహిని'గా పరిగణిస్తారు. రుగ్వేద, యజుర్వేదాలలో, బ్రహ్మవైవర్తన, బ్రహ్మాండ తదితర పురాణాలలో, రామాయణ, మహాభారతం, భాగవతం వంటి ఇతిహాసాలలో సరస్వతీ నది ప్రస్తావన ఉంది. విద్యలకు అధిదేవత సరస్వతి శాపవశాత్తు నదిగా మారిందని గాథలు ఉన్నాయి. బ్రహ్మాండ పురాణ గాథ ప్రకారం, మహాదేవుడి ఆద్యంతాలను కనుగొనాలన్న బ్రహ్మదేవుడి సంకల్పం ఫలించలేదు. కానీ, 'పరమేశ్వరుని తుదీమొదలు కనుగొన్నట్లు' విధాత ఆయనతోనే అసత్యమాడడంతో ఆగ్రహించిన ఆదిదేవుడు 'బ్రహ్మ వాక్కు అయిన సరస్వతి నదిగా మారిపోవాలి' అని శపించాడట.

హిమాలయాల్లో శివాలిక్ పర్వతాల్లోని సిరిమూర్ కొండల్లో పుట్టి (బ్రహ్మసరస్సు లేదా బదరికాశ్రమంలో పుట్టిందని మరో వాదన) ఒకనాడు భరతవనిలో గలగలా ప్రవహించిన సరస్వతి నది ఇప్పుడు అదృశ్య అంతర్వాహినిగా సాగుతోంది. నాడు అతి పెద్ద నదిగా విలసిల్లిన సరస్వతి భూకంపాలు, అగ్ని విస్ఫోటాలు వంటి ప్రకృతి విపత్తుల కారణంగా క్షీణించి చివరకు కనీ కనిపించని అంతర్వాహినిగా మారిందని చెబుతారు. ఈ నది అంతర్ధానం వెనుక ఎన్నో గాథలు, కారణాలు చెబుతారు.

కురుక్షేత్రం సరస్వతి నది ఒడ్డున ఉంది. అక్కడికి సమీపంలోని విశాశన అనే చోట ఈ నది అంతర్ధానమైందని కూడా చెబుతారు. ఇది బద్రీనాథ్‌కు తొమ్మిది కిలోమీటర్ల దూరంలోని మాన గ్రామం నుంచి సుమారు అయిదు కిలోమీటర్లు ప్రయాణించి అలకనంద నదిలో కలుస్తుంది. ఆ ప్రదేశం 'కేశవ ప్రయాగ'గా ప్రసిద్ధి. తరువాత అలహాబాద్ వద్ద గంగా యమునలతో (త్రివేణి సంగమం) కలుస్తూ, అక్కడ అంతర్వాహినిగా ప్రవహిస్తోంది. ఈ నదీ ప్రాంతంలోని గగ్గర్ అనే నది వర్షాకాలంలోనే ప్రవహిస్తుంది. గగ్గర్ లాంటి 32 చిన్నాచితక నదులు సరస్వతి పేరుతో వ్యవహృతమవుతూ దానిని చిరంజీవిని చేస్తున్నాయి.

ఈ నదీ స్మరణతోనే పాపాలు ప్రక్షాళనమవుతాయంటారు. ఈ నదీ స్నానంతోనే ఇంద్రుడు బ్రహ్మహత్యాపాతకం నుంచి బయటపడ్డాడని, కుబేరుడికి ధనాధిపత్యం, వరుణుడికి జలాధిపత్యం ఈ నది స్నాన ఫలితమేనని, చంద్రుడు ఇందులో పుణ్యస్నానమాచరించి రాజయక్ష్మ అనే వ్యాధి నుంచి విముక్తుడయ్యాడని గాథలు ఉన్నాయి. వ్యాసభగవానుడు ఈ నదీతీరంలోనే వేద విభజనచేసి, భాగవత రచన చేశాడని గాథ.

సరస్వతీ నది పుష్కర పుణ్యస్నానానికి రాజస్థాన్‌లోని బ్రహ్మ సరోవరం, గుజరాత్‌లోని సోమనాథ్ జ్యోతిర్లింగ ఆలయం (దేవో స్వ ర్ణ క్షేత్రం), సిద్ధాపూర్ ఆలయం, మధ్యప్రదేశ్‌లోని బేడా ఘాట్ ముఖ్యమైన ప్రదేశాలు . బేడా ఘాట్ నర్మదా, సరస్వతీ నదుల సంగమం. తెలంగాణలో గోదావరి, ప్రాణహిత సంగమ ప్రదేశం కాళేశ్వరంలో సరస్వతి అంతర్వాహినిగా కలుస్తుందని పురాణాలు చెబుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అక్కడ పుష్కర ఏర్పాట్లు చేస్తోంది. కాశీ నుంచి వచ్చే పురోహితులు ప్రత్యేక హోరతులు, హోమాలు నిర్వహిస్తారని, ఇలా చేయటం తొలిసారి అని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు.

పితృదేవతలను స్మరించుకునేందుకు పుష్కరాలు మంచి సందర్భం. ఆ సమయంలో నిర్వర్తించే శ్రాద్ధకర్మల వల్ల వారికి సద్గతులు కలుగుతాయని విశ్వాసం. పుష్కర స్నానమంటే పర్యాటకమో, విహార/వినోద యాత్రగానో కాకుండా పవిత్ర కార్యంగా భావించాలి. పుష్కర స్నానం 'దివ్య'స్నానమే తప్ప శరీర మాలిన్యాన్ని వదిలించుకొనేది కాదు.పరిశుభ్రమైన దుస్తులు ధరించి, సంకల్పం చెప్పుకొని ప్రవాహానికి ఎదురుగా, వాలుగా మూడేసి మునకలు వేయాలంటారు పెద్దలు. దంపతులు కలిసి స్నానమాడాలట. స్నానానంతరం నదీ మతల్లికి, త్రిమూర్తులకు, పితృదేవతలకు, బృహస్పతికి, పుష్కరుడికి, సప్తర్షులకు, అరుంధతికి అర్ఘ్యం సమర్పించాలి.

**'తీర్థరాజ నమస్తుభ్యం సర్వలోకైకపావన**
**త్వయిస్నానం కరోమ్యద్య భవబంధ విముక్తయే'**

– స్వామి



Dr. G. Suryanarayana Raju
M.S. Mch, FRCS, FUICC
Chief of Surgical Oncology
40+ Years of Experience



Dr. D. Raghunadharao
MD, DM, FRCP (London), FACP
Chief of Medical Oncology
40+ Years of Experience

# Asvins Specialty Hospitals

6-3-903/A&B, Raj Bhavan Road, Somajiguda, Hyderabad, Telangana 500082.

www.asvinshospitals.com Ph: +91 94404 45775

**40+ Years of Oncology Expertise**
**Over 7,00,000 Patients Treated**
**75,000 Successful Surgeries**
**99% Success Rate**

ASVINS
Specialty Hospitals
Care•Cure•Comfort



## SERVICES

| SURGICAL SPECIALTIES: | MEDICAL SPECIALTIES: |
|---|---|
| Anaesthesiology | Bone Marrow Transplant |
| Breast Surgery | Cardiology |
| Bone & Soft Tissue Tumors | Chest Medicine |
| Gynaecology & Gynaec Oncology | Endocrinology |
| Head & Neck Oncology | Gastroenterology |
| Minimal Access Surgery | Hematology & Hemato Oncology |
| Neurosurgery | Internal Medicine |
| Plastic & Reconstructive Surgery | Intensive Care |
| Surgical Oncology | Medical Genetics |
| Thoracic Oncology | Medical Oncology |
| Transplant Surgery | Nephrology & Dialysis |
| Urology, Andrology & Endo Urology | Neurology |
| Vascular Surgery | Orthopaedic & Rheumatology |

Book Your Consultation Now +91 9440445775
We do all types of Radical, Organ Sparing and Laparoscopic Surgeries

**We Expertise in Treating All Cancers** **Expert Treatment At Affordable Prices**

SCAN ME

# అశ్విన్ క్యాన్సర్ కేర్, భీమవరంలో

అశ్విన్స్
స్పెషాలిటీ హాస్పిటల్స్



ప్రముఖ సర్జికల్ ఆంకాలజిస్ట్
**డా॥ జి సూర్యనారాయణ రాజు**
M.S. MCh,FRCS,FUICC సర్జికల్ ఆంకాలజీ అధినేత
వ్యవస్థాపక డైరెక్టర్, అశ్విన్స్ స్పెషలిటీ హాస్పిటల్స్
మాజీ సభ్యుడు, MARB, NMC, న్యూఢిల్లీ
మాజీ సహచరుడు. రిసెర్చ్ & ప్రాజెక్ట్స్ డీన్, రిజిస్ట్రార్, ప్రొఫెసర్
మరియు సర్జికల్ ఆంకాలజీ వ్యవస్థాపక అధిపతి, నిమ్స్



ప్రముఖ గైనో ఆంకాలజిస్ట్
**డా॥ రమణి GSV**
MS, OBG
కన్సల్టెంట్ గైనకాలజీ, గైనక్ ఆంకాలజీ &
ప్రివెంటివ్ ఆంకాలజీ

ప్రతి
నెల మొదటి
ఆదివారం



ప్రముఖ హెమాటో ఆంకాలజిస్ట్
**డా॥ గెంటే. విక్రమ్ కుమార్**
MBBS, MD ఇమ్యునో-హెమటాలజీ మరియు రక్త మార్పిడి (JIPMER),
పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ ఇన్ క్లినికల్ హెమటాలజీ (CMC వెల్లూర్)
కన్సల్టెంట్ హెమటాలజీ మరియు
హెమటో- ఆంకాలజీ

ప్రతి
నెల రెండవ
ఆదివారం

**ఈ దిగువ లక్షణాలు కలవారు డాక్టర్ గారిని సంప్రదించగలరు.**

తెల్ల బట్ట, అధిక నెలసరి, PCOS లక్షణాలు, గర్భసంచి క్యాన్సర్, అండాశయ క్యాన్సర్, అండాశయపు గడ్డలు & నీటి గడ్డలు, గర్భ సంచి కణితులు, గర్భాశయ క్యాన్సర్ వ్యాక్సిన్ (HPV), రుతువిరతి తర్వాత సమస్యలు, దీర్ఘకాలిక దగ్గు, దగ్గేటప్పుడు రక్తం పడటం, మూత్రంలో రక్తం, ఆహారం మింగలేకపోవడం, నోటి పూతల, మెడలో గడ్డలు, రొమ్ము లో గడ్డలు, వాంతులు, రక్తపు వాంతులు, కామెర్లు, దీర్ఘకాలిక అతిసారం, మలబద్ధకం, రక్తస్రావం, తెల్లబట్ట

**అభినవ్ డయగ్నోస్టిక్స్ జెపి రోడ్,**
**ఆనంద బ్లడ్ బ్యాంకు దగ్గర, భీమవరం**
**08816 224338**

బ్లడ్ క్యాన్సర్, అధిక రక్తస్రావం (Bleeding Problem), రక్తహీనత (Anaemia), ప్లేటిలెట్స్ కణాలు తగ్గడం, రక్త కణాలు సమస్య, రక్తం అధికంగా గడ్డకట్టడం, పసరికలు (Jaundice), ప్లీహం పెద్దగా అవడం (Splenomegaly), బోన్ మ్యారో మార్పిడి

ఉదయం
గం॥ 10:30 ల
నుండి
గం॥ 2:00 ల
వరకు

**లోటస్ డయగ్నోస్టిక్స్ జెపి రోడ్,**
**ఆనంద బ్లడ్ బ్యాంకు దగ్గర, భీమవరం**
**08816 230555**

గమనిక పేషెంట్స్ తమ పాత రిపోర్టులతో సంప్రదించండి | అన్ని రకాల క్యాన్సర్ల కు చికిత్స మరియు సలహాలు ఇవ్వబడును.

అపాయింట్మెంట్ కొరకు

**94404 45775** **సీత : +91 9618161032**

**షెడ్యూల్డ్ కులాల(ఎస్‌సీ)వారు క్రైస్తవంలోకి లేదా ఇస్లాంలోకి మారితే ఎస్‌సీ హోదాను కోల్పోతారా? కోల్పోక తప్పదనే గతంలో అనేక సార్లు న్యాయ స్థానాలు ఆదేశాలు ఇచ్చాయి. సుప్రీంకోర్టు కూడా ఇలాంటి ఆదేశాలే ఇచ్చింది. ఇదే విషయాన్ని ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు తాజాగా మరోసారి తేల్చిచెప్పింది. హిందూధర్మం నుంచి క్రైస్తవం లేదా ఇస్లాం తీసుకున్న వారు రిజర్వేషన్ సౌకర్యాలు కోరలేరనే న్యాయ స్థానాలు చాలాసార్లు ఘోషించాయి. అలాగే ఎస్‌సీ, ఎస్‌టీ అట్రాసిటీ చట్టం నుంచి రక్షణ పొందలేరని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు స్పష్టం చేసింది. వీటిని ప్రభుత్వాలు కఠినంగా అమలు చేయడం లేదు. కులగణన చేయవచ్చునని కేంద్రం కూడా ఆమోద ముద్ర వేసిన నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇలాంటి తీర్పు ఇవ్వడం ముమ్మాటికీ స్వాగతించ దగినదే.**




ఇప్పుడు కులగణనలో దళిత క్రైస్తవులను, దళిత ముస్లింలను ఏ కేటగిరిలో చేరుస్తారో స్పష్టమైన విధానం అనుసరించవలసి ఉంటుంది. ఇదొక బహుముఖ సమస్య. దీనిని పరిష్కరించడంలో ఇప్పటికే తీవ్ర జాప్యం జరిగింది. ఈ అంశం మీద స్పష్టమైన కోర్టు తీర్పులు ఉన్నా హిందూ దళితులకు న్యాయం జరగడం లేదు. దీనితో సమస్యలు పెరిగిపోతున్నాయి. కొన్నిచోట్ల క్రైస్తవం వేర్పాటు వాదానికి కూడా కారణమయింది. జనాభా సమీకరణాలు మార్చింది. హిందూ దళితుల రాజకీయ, ఆర్థిక అవకాశాలను మతం మారినవారు తన్నుకు పోతున్నారు. ఈ వ్యవహారం ఎంత యాంత్రికంగా తయారయిందంటే, ఒక దళితుడు క్రైస్తవంలోకి మారినా, ఆఖరికి అమెరికా పౌరసత్వం వచ్చినా భారత్‌లో తన రిజర్వేషన్ ఢోకా లేదన్నంత నమ్మకంతో ఉన్నారని అనిపిస్తుంది. అయితే ఈ సంవత్సరాంతానికి రిజర్వేషన్ల సమస్య మీద దేశంలో ఒక సమగ్ర విధానం రూపొందే అవకాశం కనిపిస్తున్నది.

గుంటూరు జిల్లా కొత్తపాలెం వాస్తవ్యుడు చింతాడ ఆనంద్ దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. చింతా ఆనంద్ చర్చి పాస్టర్. ఆయన చందోలు పోలీసుస్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఎస్‌సీ, ఎస్‌టీ అట్రాసిటీ చట్టం కింద పలువురిపై పోలీసులు కేసు నమోదు చేయడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. చట్టాన్ని దుర్వినియోగం చేసి తప్పుడు ఫిర్యాదు ఇచ్చారని ఆక్షేపించింది. పోలీసులు ఛార్జి షీట్ వేయకుండా ఉండాల్సిందని అభిప్రాయపడింది. కేసును కొట్టేసింది. న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ ఈ మేరకు ఇటీవల తీర్పు ఇచ్చారు.

తనను కులం పేరుతో దూషించి, దాడి చేసి గాయపరిచారని ఉమ్మడి గుంటూరు జిల్లా పిట్టలవాని పాలెం మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన పాస్టర్ చింతాడ ఆనంద్ 2021లో చందోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన ఎ. రామిరెడ్డి మరో ఐదుగురిపై ఎస్‌సీ, ఎస్‌టీ చట్టంతో పాటు ఐపీసీ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ గుంటూరు ఎస్‌సీ, ఎస్‌టీ కోర్టులో పెండింగ్‌లో ఉంది. కేసును కొట్టేయాలంటూ నిందితులు 2022లో హైకోర్టులో పిటిషన్ వేశారు. తాజాగా జరిగిన విచారణలో పిటిషనర్ల తరఫు న్యాయవాది జేవీ ఫణిదత్ వాదనలు వినిపించారు. 'ఫిర్యాదుదారు పదేళ్లుగా పాస్టర్‌గా పనిచేస్తున్నారు. ఈ విషయాన్ని ఫిర్యాదులోనే పేర్కొన్నారు. క్రైస్తవంలోకి మారిన వ్యక్తికి ఎస్‌సీ, ఎస్‌టీ చట్టం వర్తించదు. రాజ్యాంగం (షెడ్యూల్డ్ కులాలు) ఆర్డర్–1950 ప్రకారం హిందూమతాన్ని కాకుండా ఇతర మతాలను స్వీకరించినవారు ఎస్‌సీ హోదాను కోల్పోతారు. కులవ్యవస్థను క్రైస్తవం గుర్తించదని, ఆ మతాన్ని స్వీకరించిన వారికి ఎస్‌సీ, ఎస్‌టీ చట్టం కింద రక్షణ ఉండదని సుప్రీంకోర్టు తీర్పులు ఇచ్చింది. వీటిని పరిగణనలోకి తీసుకుని కేసును కొట్టేయండి' అని కోరారు. పాస్టర్ ఆనంద్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఫిర్యాదుదారుడు ఎస్‌సీ అని తహసీల్దార్ ధ్రువపత్రం ఇచ్చారని గుర్తుచేశారు. ఈ సర్టిఫికెట్‌ను గుర్తించడానికి కోర్టు నిరాకరించింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలతో న్యాయమూర్తి ఏకీభవించారు. 'ఎస్‌సీ, ఎస్‌టీ చట్టం కింద ఫిర్యాదుదారుడు రక్షణ పొందలేరు. నిందితులపై ఐపీసీ కింద నమోదు చేసిన సెక్షన్లు చెల్లుబాటు కావు అని తీర్పులో పేర్కొన్నారు.

ఒక దశాబ్దం పాటు పాస్టర్‌గా ఉంటూ, ఇప్పటికీ తనకు ఎస్‌సీ హోదా ఉందని భ్రమించిన ఆనంద్‌కూ, పుదుచ్చేరికి చెందిన సెల్వరాణి కేసుకూ చాలా దగ్గర సంబంధం ఉంది. సెల్వరాణి కూడా క్రైస్తవ కుటుంబం నుంచి వచ్చారు. తన రిజర్వేషన్ సౌకర్యం కోసం తన పాత ధర్మంలోకి తిరిగి వస్తున్నట్టు పేర్కొన్నది. దీనికి స్థానిక అధికారులు అంగీకరించ లేదు. కేసు సుప్రీంకోర్టు వరకు వెళ్లి ఒక మంచి ఆదేశం వెలువడే అవకాశం ఇచ్చింది. నిజానికి హిందూధర్మం వదిలిపెట్టి ఇస్లాం లేదా క్రైస్తవం స్వీకరించిన వారికి రిజర్వేషన్‌లు అమలు చేయాలా వద్దా అనే అంశం ఇప్పటి వివాదం కాదు. చాలామంది దళితులు హిందూధర్మంలోని ఎస్‌సీ ఎస్‌టీ హోదాను అనుభవిస్తూ, ఆరాధనా విధానంలో మాత్రం క్రైస్తవాన్ని అనుసరిస్తారన్న ఆరోపణ బలంగానే ఉంది. ఇది ఎంతో వాస్తవం. ఇది రెండు విధాల వంచన. ఒకటి క్రైస్తవంలో ఉంటూ హిందూధర్మం ద్వారా వచ్చే సౌకర్యాలు పొందడం. ఇది క్రైస్తవాన్ని మోసం చేయడం. రెండు క్రైస్తవం మతాన్ని గుర్తించదు. అయినా రిజర్వేషన్ పొందడం హిందూ ధర్మంలో కొనసాగుతున్న దళితుల ఆర్థిక, సామాజిక సౌకర్యాలకు వెన్నుపోటు పొడుస్తున్నారు.

సెల్వరాణి కేసు గురించి పరిశీలించడం ఇప్పుడున్న పరిస్థితులలో చాలా అవసరం. ఒక మతం ద్వారా దఖలు పడే రిజర్వేషన్ కోసం మాత్రమే ఆ మతంలోకి మారడంపై సుప్రీం కోర్టు నవంబర్ 26,2024న కీలకమైన ఆదేశాలే ఇచ్చింది. ఎలాంటి విశ్వాసం లేకుండా రిజర్వేషన్ కోసమే ఒక మతంలో చేరాలనుకుంటే అది రాజ్యాంగ విరుద్ధమేనని భారత అత్యున్నత న్యాయస్థానం పేర్కొన్నది. ఆ కేసు పూర్వాపరాలు ఇవి. పుదుచ్చేరికి చెందిన సి. సెల్వరాణికి స్థానిక అధికారులు ఎస్‌సీ ధ్రువపత్రం ఇచ్చేందుకు నిరాకరించారు. తాను హిందువుగా మారడానికి ఎస్‌సీ సర్టిఫికెట్ కోరుతున్నానని, హిందూమతంలో చేరితే ఉద్యోగాలలో రిజర్వేషన్ లభిస్తుందని పేర్కొన్నది. సెల్వరాణి పుదుచ్చేరి



# ...న
# ...హోదా దక్కదు

ప్రభుత్వంలో అప్పర్ డివిజన్ క్లర్క్ కోసం దరఖాస్తు చేసింది. తాను వల్లువాన్ కులానికి చెందినట్లు ఆమె ప్రకటించుకున్నారు. పుదుచ్చేరి ఆదేశాలు-1964 ప్రకారం వల్లువాన్ ఎస్సీ జాబితాలో ఉంది. తాను క్రైస్తవంలోకి వెళ్లినా ఇప్పుడు హిందు ఆచారాలనే పాటిస్తున్నాను కాబట్టి ఎస్సీ హోదా ఇవ్వమని కోరింది. అంటే ఎస్సీ రిజర్వేషన్ హోదా ద్వారా లభించే సౌకర్యాలు వర్తింప చేయాలని కోరింది. దీని మీద అధికారులు దర్యాప్తు జరిపారు. ఆమెకు చిన్నతనంలోనే బాప్టిజం (క్రైస్తవంలోకి మార్చడం) ఇచ్చారు. జీవితమంతా క్రైస్తవురాలిగానే ఉంది. ఆ దర్యాప్తులో ఇంకా చాలా విషయాలు బయటపడ్డాయి. సెల్వరాణి తండ్రి ఈమె పుట్టక ముందే క్రైస్తవం స్వీకరించారు. ఇక సెల్వరాణి జన్మించిన తరువాత ఈమెకు క్రైస్తవం ఇచ్చారు. అప్పటి నుంచి ఆ మత ఉత్సవాలకు, ఇతర కార్యక్రమాలకు హాజరవుతున్నది. అలాగే, ఆమె హిందూ ధర్మంలోకి వచ్చినట్టు గాని, ఈ ధర్మంలోని ఆచార వ్యవహారా లను పాటిస్తున్నట్టు గాని ఎక్కడా ఆధారాలు దొరక లేదు. ఆఖరికి హిందూధర్మం స్వీకరించినట్టు చూపే ఏ కార్యక్రమానికి సంబంధించిన ఆధారం కూడా లేదు.

ఈ నేపథ్యంలో అత్యున్నత న్యాయస్థానం వ్యక్తం చేసిన అభిప్రాయాలు ఇలా ఉన్నాయి. ఎవరైనా ఒకసారి క్రైస్తవం వంటి ఇతర మతంలోకి మారిపోతే వారు తమ కులానికి సంబంధించిన హోదా కోల్పోతారు. మతం మార్చుకునే వారు అవతలి మతంలోని విశ్వాసాలను పరిగణనలోనికి తీసుకుని మారాలి గాని, అదిచ్చే సౌకర్యాల కోసం కాకూడదు అని కూడా సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. మత మార్పిడి కేవలం రిజర్వేషన్ సౌకర్యాలు పొందడం కోసం కాకూడదని కుండబద్దలు కొట్టినట్టు చెప్పింది. కులంద్వారా వచ్చే సౌకర్యాలు పొందడానికి నకిలీ ప్రకటనలు, పత్రాలు చేయడం రాజ్యాంగ విరుద్ధమని కోర్టు చెప్పింది. అంతేకాకుండా, రిజర్వేషన్‌లు ఏ వర్గం ప్రయోజనం కోసం ఉద్దేశించారో, ఏ వర్గం ఆర్థిక, సామాజిక ప్రయోజనాలను ఆశించి ప్రవేశ పెట్టారో అవి ఇలాంటి వ్యవహారాల వల్ల బలహీన పడతాయని కూడా స్పష్టం చేసింది.

ఈ కేసులోనే డాక్టరీన్ ఆఫ్ ఎక్లిప్స్ గురించి సుప్రీంకోర్టు తెలియచేసింది. దీని ప్రకారం ఒక వ్యక్తి హిందూధర్మం నుంచి ఇతర మతాలలోకి మారితే కులం ప్రకారం ఆ వ్యక్తికి వచ్చే హోదా తాత్కాలికంగా సస్పెండ్ అవుతుంది. మళ్లీ ఆ వ్యక్తి వెనక్కి రావడం అనేది నిజాయితీగా మాతృమతంలో ప్రవేశించి నప్పుడు, అందుకు అతడి సామాజిక వర్గం ఆమోదించి నప్పుడే సాధ్యం. అయితే, ఒకరు ఒక మతంలో తరతరాలుగా ఉండి, మళ్లీ పూర్వపు మతంలోకి వస్తామంటే దానిని పునరుద్ధరించడం దాదాపు అసాధ్యం.

సెల్వరాణి కేసు మొదట మద్రాసు హైకోర్టులో వీగిపోయింది. తరువాతనే ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు మద్రాసు హైకోర్టు తీర్పును సమర్థించింది.

దళితుల హోదా ఉన్నవారు ఇతర మతాలలోకి మారితే రిజర్వేషన్ సౌకర్యాలు కోల్పోతారని, ఆ సౌకర్యాలను వారు కోరలేరని భారత ప్రభుత్వం కూడా ఏనాడో చెప్పింది. 2022లో కేంద్ర న్యాయశాఖ మంత్రి ఇచ్చిన వివరణ ఇంకొక అడుగు ముందుకు వేసింది. దళితులుగా ఉన్నవారు క్రైస్తవం లేదా ఇస్లాం స్వీకరిస్తే అలాంటి వారు ఎస్సీ నియోజకవర్గాల నుంచి పోటీ చేయడానికి అనర్హులని ఆయన వివరణ ఇచ్చారు. నిజానికి హిందూధర్మం నుంచి ఇతర మతాలలోకి మారిన దళితుల పరిస్థితి గురించి అధ్యయనం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఒక సంఘాన్ని కూడా నియమించింది. అంటే రిజర్వేషన్ సౌకర్యాల పరంగా వీరికి ఎలాంటి విధానం అమలు చేయాలన్నదే ఆ కమిటీ బాధ్యత.

ఓటు బ్యాంక్ రాజకీయాలు రాజ్యాంగ స్ఫూర్తికీ, రాజ్యాంగ నిర్మాతల ఆశయానికీ ఏనాడో తూట్లు పొడిచారు. షెడ్యూల్డ్ కులాలకు రిజర్వేషన్‌లు ఇవ్వడానికి ప్రధాన కారణం-వారు శతాబ్దాలుగా ఎదుర్కొన్న అంటరానితనం. అంటరానితనం కారణంగా కొన్ని కింది వర్గాలు సాంఘిక, ఆర్థిక వివక్షకు బలయ్యారు. రాజ్యాంగ ఆదేశం-1950 ప్రకారం హిందూధర్మంలో, బౌద్ధం, జైనం, సిక్కు మతాలలో ఉన్నవారికే దళితు హోదా కోరే హక్కు ఉంటుంది. నిజానికి హిందూధర్మంలో ఉన్న వారికే మొదట ఎస్సీ హోదా కోరే అవకాశం ఉండేది. 1956 సిక్కులకు, 1990లో బౌద్ధులకు ఎస్సీ హోదా కోరే హక్కు ఇచ్చారు. అందుకే క్రైస్తవం లేదా ఇస్లాంలోకి వెళ్లిన వారు, అంతకు ముందు వారు దళితులే అయినా ఎస్సీ హోదా కొనసాగదు. రిజర్వేషన్‌లు వర్తించవు.

దళిత క్రైస్తవులు, దళిత ముస్లింలను ఎస్సీ హోదా పరిధిలోకి తీసుకోవాలా వద్దా అనే అంశం మీద సుప్రీంకోర్టులో అనేక పిటిషన్‌లు ఉన్నాయి. దీని మీద అభిప్రాయం తెలియచేయవలసిందిగా అత్యున్నత న్యాయస్థానం 2022 ఆగస్టులో కేంద్రాన్ని ఆదేశించింది. దీని ఫలితమే ముగ్గురు సభ్యుల కమిషన్ ఏర్పాటు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేజీ బాలకృష్ణన్ నాయకత్వంలో ఏర్పాటు చేసిన ఈ కమిషన్ ఈ సంవత్సరం అక్టోబర్‌కు తన నివేదికను సమర్పించవలసి ఉంది. అయితే 2007లో జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ ఇచ్చిన సిఫారసులు ఈ వాదనలకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. ఎస్సీ హోదాకూ, మతానికీ ముడి పెట్టరాదన్నదే జస్టిస్ మిశ్రా వాదన.

2005 నాటి సచార్ కమిషన్ నివేదిక మరొక చేదు వాస్తవం బయటపెట్టింది. దళిత ముస్లింలు, దళిత క్రైస్తవులు మతం మారినప్పటికి వివక్ష నుంచి తప్పించుకోలేకపోతున్నారని ఆ కమిటి వెల్లడించింది. అలాగే మతం మారిన దళితులు ఇప్పటికి ఆర్థిక వెనుకబాటుతనంతోనే బాధపడుతున్నా రని కూడా వెల్లడించింది. కాబట్టి మతం మారడం, మార్చడం ఎవరి మేలు కోసమో గట్టిగా ఆలోచించ వలసిన సమయం వచ్చింది. దళితులు మతం మారినా విదేశీ మతాలు వారికి పెద్ద పీట వేసి ముందు వరసలో కూర్చోబెట్టలేదు. ఇది దళితులే చాలామంది చాటి చెప్పే వాస్తవం. ఈ నేపథ్యంలో ఈ అక్టోబర్‌లో వచ్చే జస్టిస్ కేజీ బాలకృష్ణన్ ఎలాంటి సిఫారసులు చేస్తారో వేచి చూడాలి. కేంద్రం తన వైఖరిని 2022లోనే వెల్లడించిందన్నది వాస్తవం.జస్టిస్ బాలకృష్ణన్ కమిషన్ నియామకం చెల్లదంటూ తన ముందుకు వచ్చిన పిటిషన్‌ను 2023లోనే సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఇతర మతాలలోలకి వెళ్లిన దళితులకు హిందూ ధర్మంలో కొనసాగుతున్న దళితులకు దక్కినట్టు రిజర్వేషన్ సౌకర్యాలు దక్కవు. నిజానికి దక్కరాదు.

**– జాగృతి డెస్క్**

తెలంగాణలో రహదారుల విస్తరణ జోరుగా సాగుతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించి పెద్ద ఎత్తున కొత్త రహదారుల నిర్మాణంతో పాటు... ఇప్పటికే ఉన్న రహదారుల విస్తరణ పనులు విస్తృతంగా చేపడుతోంది. దీంతో, తెలంగాణ రాష్ట్రంలోని రహదారుల వ్యవస్థ మరింత ఉన్నతంగా మారబోతోంది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ సహా.. పలు జిల్లాల గుండా రహదారుల నిర్మాణం, విస్తరణ వంటి పనులు చురుగ్గా సాగుతున్నాయి. వీటికి తోడు..కొత్తగా మరికొన్ని రహదారులకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఇక, రాజధాని హైదరాబాద్ నగరంలో పలు ఫ్లైవర్లు నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. మరికొన్ని ఫ్లై ఓవర్లు నిర్మాణ దశలో ఉన్నాయి.



అంబర్‌పేట ఫ్లై ఓవర్

# తెలంగాణ అభివృద్ధి

ఈ క్రమంలోనే ఈనెల 5వ తేదీన కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలంగాణలో సుడిగాలి పర్యటన చేశారు. ఉదయం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించిన గడ్కరీ.. సాయంత్రానికి హైదరాబాద్‌లో పలు రహదారులు, ఫ్లై ఓవర్లను ప్రారంభించారు. ఒక్కరోజే మొత్తం 26 ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. వాటి విలువ సుమారు రూ.5,413కోట్లు. ఈ స్థాయిలో రహదారుల కోసమే నిధులు వెచ్చించడం.. అదీ కేంద్ర ప్రభుత్వం కేటాయించడం దాదాపు ఇదే మొదటిసారి అంటున్నారు విశ్లేషకులు. ప్రధానంగా హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టడం, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలనూ రహదారులకు అనుసంధానం చేయడమే.. ఈ పర్యటనలో చేసిన ప్రారంభోత్సవాల లక్ష్యమని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

మే 5వ తేదీ, ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పర్యటించారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్‌లో పర్యటించి.. అక్కడినుంచే.. రూ.3,900 కోట్ల విలువైన రహదారుల ప్రాజెక్టులను ప్రారంభించారు. జిల్లాలో జాతీయ రహదారి 363ని గడ్కరీ జాతికి అంకితం చేశారు. కాగజ్‌నగర్ మహారాష్ట్ర బార్డర్‌లో రూ.3,526 కోట్లతో నిర్మించిన 95 కిలోమీటర్ల మేర ఫోర్ లేన్ రోడ్డుతోపాటు ఏడు జాతీయ రహదారులను, పలు అభివృద్ధి పనులు, కొత్త వంతెనల నిర్మాణం, రహదారుల విస్తరణకు ఆయన ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు. హైదరాబాద్ నగరంలో నూతనంగా నిర్మించిన అంబర్‌పేట్ ఫ్లైఓవర్‌ను కూడా ప్రారంభించారు.

కేంద్రం తెలంగాణ-మహారాష్ట్ర మధ్య రహదారులను నిర్మిస్తోంది. ములుగు-కొత్తగూడెం మధ్య హైవే నిర్మాణం జరుగుతోంది. సూర్యాపేట నుంచి దేవరపల్లి వరకు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణం, నాగ్‌పూర్ నుంచి విజయవాడ వరకు కీలకమైన కారిడార్ పనులు త్వరలో మొదలవుతాయని సమాచారం. వీటితో పాటు భద్రాచలం, బాసర, మేడారం వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలను జాతీయ రహదారులతో అనుసంధానించనుంది. జగిత్యాల-కరీంనగర్ హైవే విస్తరణ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. ఈ ప్రాజెక్టులతో తెలంగాణ-మహారాష్ట్ర మధ్య రోడ్డు రవాణా మరింత సులభతరం కానుంది. రాష్ట్రాల మధ్య అనుసంధానాన్ని పెంచేందుకు కేంద్రం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. ఇందులో భాగంగా జోజిలా పాస్ టన్నెల్ వంటి

**'కార్టూన్ పోటీ-2025'లో ప్రోత్సాహక బహుమతి పొందినది**





క్లిష్టమైన నిర్మాణాలను కూడా చేపట్టింది.

కేంద్ర ప్రభుత్వం దేశమంతటా నీటి నిల్వలను పెంచడం కోసమని అమృత్ సరోవర్ పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ సహకారాన్ని కోరింది. అలాగే సముద్రంలో వృధాగా కలిసి నీటిని పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ద్వారా పెన్నా-కావేరి బేసిన్‌లకు తరలించేందుకు ప్రయత్నిస్తోంది. సాగునీటి ప్రాజెక్టులతో ఆంధ్రా, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సముద్రంలో వృధాగా కలిసే నీటిని మళ్లించడానికి కేంద్రం సంకల్పించింది.

కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అనుసంధనతను పెంచడాన్ని మోదీ సర్కార్ లక్ష్యంగా పెట్టుకుంది. తెలంగాణలో జాతీయ రహదారుల విస్తీర్ణం 5వేల కి.మీ దాటింది. తెలంగాణలోని 32 జిల్లాలు జాతీయ రహదారులతో అనుసంధానమయ్యాయి. కేంద్రం తెలంగాణలో రోడ్డు, రైల్వే, విమాన కనెక్టివిటీ పెంచేందుకు కృషి చేస్తోంది.

# కి కేంద్రం రాదారి

ఎక్స్‌ప్రెస్‌వేలు, అండర్‌పాస్‌ల నిర్మాణంతో రోడ్డురవాణా వ్యవస్థ సులభతరమైంది.. జాతీయ రహదారుల విస్తరణ వల్ల రోడ్డు ప్రమాదాలు, ప్రయాణ సమయం భారీగా తగ్గాయని తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

**తెలంగాణకు కేంద్రం చేసిన పనులు, ప్రణాళికలు**

కేంద్రం ఆదిలాబాద్, జహీరాబాద్‌లలో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలు ఏర్పాటు చేసింది. దేశవ్యాప్తంగా 7 టెక్స్‌టైల్ పార్కులు మంజూరు చేస్తే వాటిలో ఒకటి తెలంగాణకు దక్కింది. కాజీపేటలో రూ. 800 కోట్లతో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, రైల్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌ను మోదీ సర్కారు మంజూరు చేసింది. రామగుండంలో ఎన్టీపీసీ ఆధ్వర్యంలో రూ. 12,000 కోట్లతో 800 మెగావాట్ల పవర్ ప్రాజెక్టును జాతికి అంకితం చేసింది. రూ. 442 కోట్లతో రామగుండంలో 100 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. రూ. 6,330 కోట్లతో రామగుండంలో యూరియా ఉత్పత్తి పరిశ్రమను పునరుద్ధరించింది. నిజామాబాద్ జిల్లాకు పసుపు బోర్డు మంజూరు చేసింది. ఆదిలాబాద్‌లో డిఫెన్స్ ఎయిర్‌పోర్టు ప్రారంభించేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. ములుగు జిల్లాలో సమ్మక్క సారక్క గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేస్తోంది. రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు రావడంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రధాన పాత్ర పోషించింది. రూ. 31,220 కోట్లతో రైల్వే లైన్లు, డబ్లింగ్ ప్రాజెక్టుల పనులు కొనసాగుతున్నాయి. రూ. 1,25,000 కోట్లతో జాతీయ రహదారుల నిర్మాణం, రూ. 86,492 కోట్లతో కొత్త రైల్వే ప్రాజెక్టుల కోసమని కేంద్రం ప్రతిపాదనలు చేసింది. వరంగల్ జిల్లాలోని మామునూరు ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు అంగీకారం తెలిపింది. తెలంగాణలో హైవేల నిర్మాణ పనులకు.. రూ. 1.25 లక్షల కోట్లు కేటాయించింది.

తాజా పరిణామాలు, జరుగుతున్న అభివృద్ధి గమనిస్తే కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించిందన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పైగా ఇప్పట్లో కనుచూపు మేరలో ఎన్నికలు లేవు. అయితే, ఎన్నికల స్టంట్‌గా కాకుండా.. నిర్మాణాత్మక అభివృద్ధిపై కేంద్రం దృష్టి పెట్టినట్లు అర్థమవుతోంది. ఈ స్థాయిలో చేసిన అభివృద్ధిని అవసరాన్ని బట్టి ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, కేంద్రం పట్ల ఒక సానుకూలమైన దృక్పథాన్ని ప్రజల్లో ముఖ్యంగా ఓటర్లలో కల్పించేందుకు బీజేపీ శ్రేణులకు పార్టీ పెద్దలు దిశా నిర్దేశం చేస్తున్నారు. ఫలితంగా వచ్చే ఎన్నికలపై ఈ అభివృద్ధి కచ్చితంగా ప్రభావం చూపుతుందనే విశ్వాసాన్ని బీజేపీ దళాలు వ్యక్తం చేస్తున్నాయి.

**సుజాత గోపగోని,**
**సీనియర్ జర్నలిస్ట్, 6302164068**

### కేంద్ర మంత్రి పర్యటన సాగిందిలా..

ఉదయం కాగజ్‌నగర్‌లో భారీ ఎత్తున ప్రారంభోత్సవాలు చేసిన నితిన్ గడ్కరీ.. మధ్యాహ్నం సంగారెడ్డి జిల్లాలో పర్యటించారు. అనంతరం హైదరాబాద్ శివారులోని ఇక్రిశాట్‌కు ప్రత్యేక హెలికాప్టర్‌లో మధ్యాహ్నం చేరుకున్నారు. సాయంత్రం ప్రత్యేక వాహనంలో బీహెచ్‌ఈఎల్ చేరుకొని.. అక్కడ కొత్తగా నిర్మించిన ఫ్లై ఓవర్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత అంబర్‌పేట్ చేరుకొని అక్కడ ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవం తర్వాత.. మున్సిపల్ గ్రౌండ్‌లో జరిగిన బహిరంగసభలో నితిన్ గడ్కరీ పాల్గొన్నారు.

**నితిన్ గడ్కరీ ప్రారంభించిన కీలక ప్రాజెక్టులు**

**కాగజ్‌నగర్‌లో...**

- నిర్మల్-ఖానాపూర్ మార్గంలో 17.79 కి.మీ.ల మేర రోడ్డు వెడల్పు పనులు
- మంచిర్యాల్-రేపల్లెవాడ మధ్య 42 కి.మీ.ల మేర రూ. 2,001 కోట్లతో నాలుగు లేన్ రహదారి.
- రేపల్లె-మహారాష్ట్ర సరిహద్దు వరకు 52.6 కి.మీ.ల మేర రూ. 1,525 కోట్లతో రహదారి అభివృద్ధి.
- కద్తాల్ వద్ద రూ. 23.54 కోట్లతో 6 లేన్ అండర్‌పాస్
- నాగ్‌పూర్-హైదరాబాద్ సెక్షన్ లో సర్వీస్ రోడ్లు, జంక్షన్ల మార్పు

**హైదరాబాద్‌లో...**

- అంబర్‌పేట్ ఫ్లైఓవర్
- ఆరాంఘర్-శంషాబాద్ మధ్య 10 కి.మీ.ల మేర 6 లేన్ రహదారి నిర్మాణానికి భూమిపూజ.
- మెదక్ జిల్లా రెడ్డిపల్లి జంక్షన్, జాప్తి శివనూర్, గోల్డెన్ ధాబా వై జంక్షన్ వద్ద అండర్‌పాస్‌లు.
- కామారెడ్డి జిల్లా టెక్రియాల్, పొందుర్తి, పద్మాజివాడ జంక్షన్లలో అండర్‌పాస్‌లు, సర్వీస్ రోడ్లు.
- హైదరాబాద్-వరంగల్ రహదారిపై ఆలేరు-జీడికల్ X రోడ్స్ వద్ద 6 లేన్ అండర్‌పాస్.
- బీహెచ్‌ఈఎల్ జంక్షన్ వద్ద రూ. 172.56 కోట్లతో నిర్మించిన ఫ్లైఓవర్ ప్రారంభోత్సవం.
- వీటికి తోడు రూ. 657 కోట్ల విలువైన 21 కి.మీ.ల మేర 7 ప్రాజెక్టులకు గడ్కరీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.

# అంతర్గత శత్రు

**పెహల్గావ్ దుర్ఘటన కూడా ఈ దేశంలో సెక్యులరిస్టులను, బుజ్జగింపు రాజకీయాలను కనీసం కళ్లు తెరిపించలేకపోతున్నదా? బాధితుల మాటలను కూడా ఖాతరు చేయకుండా ఉగ్రవాదుల తరపున మాట్లాడే దౌర్భాగ్య వర్గం దేశంలో ఎందుకు కనిపిస్తున్నది? ఇందులో కాంగ్రెస్, సమాజ్‌వాదీ, కశ్మీరీ పార్టీలు, ఆఖరికి కొందరు ఆధ్యాత్మికవేత్తలు కూడా బరితెగించి మాట్లాడారు. నరేంద్ర మోదీ మీద వ్యతిరేకత వేరు. భారతదేశ సార్వభౌమాధికారం మీద జరిగిన దాడిని ఖండించడం వేరు. ఇలాంటి ఇంగిత జ్ఞానం కూడా ఈ దేశంలో లోపిస్తున్నది.**

ఆర్టికల్ 370 రద్దు, అనంతరం రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరగడంతో అక్కడ దశాబ్దాల తర్వాత సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. పర్యాటకుల సంఖ్య పెరిగింది. వారు నమ్మకంతో, ఉత్సాహంతో జమ్ము కశ్మీర్‌ను సందర్శిస్తుండడంతో స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరిగి ఉగ్రవాదానికి దూరంగా జరుగుతున్న సమయం ఇది. దీనిని విచ్ఛిన్నం చేయడానికి పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు కశ్మీర్‌లోని పెహల్గావ్‌లో తాజాగా రక్తపాతానికి ఒడిగట్టారు. పాకిస్తాన్ సైన్యం, లష్కరే తాయిబా, ఐఎస్ఐ ఈ నెత్తుటి కాండకు కారణమని జాతీయ దర్యాప్తు సంస్థ ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ప్రధానంగా హిందూ పర్యాటకులను లక్ష్యంగా చేసుకొని పాక్ ఉగ్రవాదులు కొందరు స్థానిక ఉగ్రవాదులతో కలిసి 26 మంది అమాయక పర్యాటకులను చంపారు. ఈ ఘటనని ప్రపంచవ్యాప్తంగా అందరూ ముక్త కంఠంతో ఖండిస్తుంటే దేశంలో కొందరు రాజకీయ నేతలు మాత్రం వక్రబుద్ధిని ప్రదర్శిస్తూ దిగజారుడు వ్యాఖ్యలు చేయడం క్షమార్హం కాదు. చాలా రాజకీయ పార్టీలు ఇప్పుడు కూడా బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడడం ఇంకా పెద్ద నేరం.

పర్యాటకుల పేర్లు తెలుసుకొని, వారి ఆహార్యాన్ని బట్టి వారు హిందువులుగా గుర్తించి ఉగ్రవాదులు అమానవీయంగా చంపడంతో దేశ వ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. దీంతో కొందరు నేతలు– ప్రధానంగా కాంగ్రెస్, దాని మిత్రపక్షాలలో ఆందోళన పెరిగిపోయింది. హిందువులపై దాడి, దేశ భద్రతకు భంగం ఏర్పడడం అనే నేపథ్యాలలో తాము ఏకత్రాటి మీద ఉంటామన్న సందేశం దేశంలో వెల్లువెత్తడం ఆ పార్టీలకు బాధగానే ఉంది. ఈ పరిణామాలు, దేశంలో పెల్లుబుకుతున్న పాకిస్తాన్ వ్యతిరేకత వల్ల మైనార్టీలు నొచ్చుకుంటారేమోనన్న భయం విపక్షాలలో కనిపిస్తున్నది. అంటే మృతుల పట్ల సానుభూతి లేదు.

పైకి కాంగ్రెస్ అధినేతలు పాకిస్తాన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ నిర్ణయానికి మద్దతుగా ఉంటామని మొదట డంబాలు పలికినప్పటికి, యథా ప్రకారం రెండు రోజుల తరువాత బుజ్జగింపు బురదలో మళ్లీ కూరుకుపోయాయి. ఆ పార్టీల నేతలు కొందరు చేసిన వ్యాఖ్యలతో వారి అసలు రంగు బయటపడింది. అనేక మంది కాంగ్రెస్ నేతలు, దాని మిత్రపక్షాల నేతలు కూడా ఒకరికి మించి ఒకరు పోటీపడి చేసిన వ్యాఖ్యలతో పెహల్గావ్ ఘటనలో మృతి చెందిన కుటుంబీకుల మనసులను గాయపరచమే కాకుండా, పాకిస్తాన్‌పై రగిలిపోతున్న భారతీయులనీ, భద్రతాబలగాలను కూడా అవమానించే పనికి పూనుకున్నారు.

పెహల్గావ్ ఘటనపై స్పందించాల్సిందిగా విలేకరులు కర్ణాటక కాంగ్రెస్ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కోరగా ఆయన బీజేపీపై అక్కసు వెళ్లగక్కారు. అక్కడ భద్రతా వైఫల్యంతోనే ఘటన జరిగిందని, పెద్ద ఎత్తున పర్యాటకులుండే అక్కడ భారీగా బలగాలు ఉండాల్సింది అన్నారు. అంతటితో ఆగకుండా మేము యుద్ధానికి వ్యతిరేకమన్నారు. సిద్ధరామయ్య యుద్ధానికి వ్యతిరేకమైతే వారి పార్టీ అధినేత రాహుల్ గాంధీ పాకిస్తాన్‌పై అతి త్వరలో కఠిన నిర్ణయం తీసుకోవాలని కోరడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ఆయన వ్యాఖ్యలకు పాకిస్తాన్‌లోని మీడియా ప్రాముఖ్యతనిస్తూ పాక్‌తో యుద్ధంపై భారత్‌లో ఏకాభిప్రాయం లేదంటూ వార్తలు ప్రచారం చేసింది. ఇక సిద్ధరామయ్య మంత్రివర్గం సహచరుడు బి.ఆర్. తిమ్మాపూర్ మరో అడుగు ముందుకేసి ఉగ్రవాదులు వస్తారు. కాల్చి వెళ్లిపోతారు తప్ప వివరాలు అడుగుతారా? అంత వెసులుబాటు వాళ్లకి ఉంటుందా? అన్నారు. అంటే బాధితులు, ప్రత్యక్ష సాక్షులు చెప్పినది అసత్యమా? ఈ వ్యాఖ్యలు పరిశీలిస్తే వారికి బాధితుల సాంత్వన చేకూర్చడం కంటే బుజ్జగింపు రాజకీయాలే ముఖ్యమని మరోసారి తేటతెల్లమైంది.

జమ్ము కశ్మీర్ కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీమంత్రి సఫీదుద్దీన్ సౌజ్, పాకిస్తాన్‌కు సింధూ జలాలను ఆపేయడం అన్యాయమని పొరుగు దేశం తరఫున మాట్లాడారు. అంతేనా! పెహల్గావ్ ఘటనలో పాకిస్తాన్ పాత్రే లేదని ఆ దేశానికి క్లీన్ చిట్ ఇచ్చారు. భారత్‌పై ఉగ్రవాదాన్ని ఉసిగొల్పుతున్న పాక్‌కు బుద్ధి చెప్పాలనే నరేంద్ర మోదీ సింధూ నది జలాలపై నిర్ణయం తీసుకుంటే ఈయన ఆ దేశం తరఫున వకాల్తా పుచ్చుకోవడం, ప్రపంచం అంతా ఈ ఘటనలో పాకిస్తాన్ హస్తం ఉందని కోడై కూస్తుంటే ఈయన ఆ దేశాన్ని సమర్థించడం గురించి అధిష్టానం ఏమి సమాధానం చెబుతుంది? మరో సీనియర్ నేత కేంద్ర మాజీ మంత్రి మణిశంకర్ అయ్యర్ రెండు దేశాల మధ్య విభజన అంశాలు, సమస్యల అపరిష్కృతం ఫలితమే పెహల్గావ్ ఘటన అని వ్యాఖ్యానించారు. దేశాన్ని మతపరంగా విభజించి, సుదీర్ఘంగా పాలించిన కాంగ్రెస్ పార్టీ వాటిని ఎందుకు పరిష్కరించలేదో పార్టీ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ చెప్పుంటే బాగుండేది.



రాహుల్   సిద్ధ రామయ్య   సఫీదుద్దీన్

మహారాష్ట్రకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే విజయ్ వాడెట్టివార్ ఈ ఘటనపై మాట్లాడుతూ ఉగ్రవాదులకు కాల్పులు జరిపే సమయంలో మతం గురించి అడిగే సమయం కూడా ఉంటుందా అన్నారు. గంటకుపైగా మారణాయుధాలతో అరాచకం సృష్టించిన వీరికి సమయం సరిపోదనేలా ఆయన వ్యాఖ్యానించారంటే వీరి ఆలోచనలు ఎంతకు దిగజారాయో తెలుస్తుంది. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ అల్లుడు, ప్రియాంక గాంధీ భర్త రాబర్ట్ వాద్ర మరో అడుగు ముందుకేసి దేశంలో హిందుత్వవాదం పెరిగిపోవడంతో ముస్లింలలో అభద్రతా భావం పెరిగిపోయిందని, దాని ఫలితామే పెహల్గావ్ ఘటన అని అన్నారు. హిందూదేశంలో హిందుత్వం ఉండకపోతే ఇస్లాం, క్రైస్తవం ప్రభావాలు ఉంటాయా? కాంగ్రెస్ నేతలు దేశ ప్రయోజనాలను విస్మరించి ఉగ్రవాద ఘటనపై నోటికొచ్చినట్టు మాట్లాడితే ప్రజలు ఛీదరిస్తారనే భయంతో ఆలస్యంగానైనా నష్ట నివారణ

# వులతో పారాహుషార్

చర్యలలో భాగంగా ఆ పార్టీ అధిష్ఠానం ఈ వ్యాఖ్యలపై స్పందిస్తూ అవి వారి వ్యక్తిగత అభిప్రాయాలని, వాటితో పార్టీకి ఎలాంటి సంబంధం లేదంటూ మొక్కుబడి ప్రకటనతో తప్పించుకునేందుకు ప్రయత్నించింది.

కాంగ్రెస్ మిత్ర పక్షాలు కూడా తామేమి తక్కువ కాదన్నట్టు వ్యవహరించాయి. ఉత్తరప్రదేశ్‌కు చెందిన పౌరులు ఈ ఘటనలో మృతి చెందితే మీరెందుకు పరామర్శించలేదని జర్నలిస్టులు సమాజ్‌వాదీ పార్టీ నేతలను ప్రశ్నిస్తే వారు మా పార్టీ వారు కాదని, మా బంధువులు కాదని వ్యాఖ్యానించి మృతుల కుటుంబీకులను అవమానపర్చారు. ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ మాట్లాడుతూ పాకిస్తాన్‌కు సింధు జలాలను నిలిపేయాలన్న నిర్ణయాన్ని తప్పుపట్టారు. హిందూ బాధితులను పట్టించుకోకపోయినా, ముస్లింలను బుజ్జగించడమే లక్ష్యంగా వీరి వ్యాఖ్యలు సాగాయి.

రాజకీయ పార్టీలకు తోడుగా ఒక స్వామీజీ కూడా నరేంద్ర మోదీపై అసందర్భ వ్యాఖ్యలు చేశారు. ఉత్తరాఖండ్‌కు చెందిన జ్యోతిర్ మఠం శంకరాచార్యులు స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతి మాట్లాడుతూ ఏదేని ఘటన జరిగితే దానికి చౌకీదారే (మోదీ) బాధ్యత వహించాలన్నారు. అంతేకాక ఉగ్రవాదులు పాకిస్తాన్ నుండే వచ్చారని మీకెలా తెలుసంటూ రాజకీయ నేతలను మించి మాట్లాడారు. ఆయనిలా వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం ఇది మొదటిసారి కాదు. గతంలో కూడా కాంగ్రెస్ తరఫున వకాల్తా పుచ్చుకుంటూ బీజేపీ, మోదీపై రాజకీయ విమర్శలు సందర్భాలు అనేకం.

ఉగ్రవాదానికి మతం ఉండదని నీతులు చెప్పేవారికి ఘటన తీరే సరైన సమాధానం. ఘటనా స్థలంలో హిందువులను, ముస్లింలను వేర్వేరుగా నిల్చోమని చెప్పారని బాధితులు చెప్పినా సెక్యులరిస్టులకు వినిపించలేదా? ఉగ్రవాదులు ఇస్లాం మతం నినాదాలు చేశారు. ఆ మత గ్రంథ వాక్యాలు పఠించమన్నారు. ఈ చర్యలన్నీ మతపరమైనవి కావా? ఉగ్రవాదులు ఘటనా స్థలంలోనే బాధితుల ముందు నరేంద్ర మోదీని దూషించారు. దేశ ప్రధానిని అగౌరవపరుస్తూ వారు వ్యాఖ్యానించారంటే భారతదేశాన్ని, ప్రజలను కూడా అవమానపరిచినట్టే. ఇవేమీ పట్టకుండా మన కుహనా లౌకికవాదులు బాధ్యతారాహిత్యంగా రాజకీయ కోణంలో ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారు.

ఘటన జరగ్గానే కశ్మీరీ పార్టీలు నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ మొసలికన్నీరు కార్చినా అనంతరం అసలు రూపాలను బయటపెట్టాయి. నేషనల్ కాన్ఫరెన్స్ నేతలు ఫరూక్ అబ్దుల్లా, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా కశ్మీర్ ఘటనను ఖండిస్తూ మొక్కుబడి ప్రకటనలు చేశారు. పీడీపీ నేత మాజీ సీఎం మెహబూబా ముఫ్తీ ఘటనపై ఒక కశ్మీరీగా సిగ్గుపడుతున్నాను అంటూ పెద్దపెద్ద మాటలు చెప్పారు. అయితే ఉగ్రవాదుల స్థావరాలపై, వారికి సహకరించిన వారి స్థావరాలను గుర్తించి భద్రతా బలగాలు దాడులు చేయగా అందులో భాగంగా వారి గృహాలు ధ్వంసం అయ్యాయి. దీనిపై ఈ రెండు పార్టీలు గగ్గోలు పెడుతూ మానవ హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాదులకు, వారికి సహకరించినవారికి ఎలాంటి మానవ హక్కులుంటాయో వారికే తెలియాలి.

దేశంలో దశాబ్దాలుగా తిష్ట వేసిన పాకిస్తానీల గెంటివేతను కూడా తప్పు పట్టే పౌరులు, కోర్టులు ఇక్కడ ఉన్నాయి. సింధు జలాల నిలిపివేతతో పాటు ఆ దేశ పౌరులు భారతదేశాన్ని విడిచిపెట్టాలని భారత్ ఆదేశించింది. ఈ క్రమంలో విస్తుపోయే అంశాలు వెలుగులోకి వచ్చాయి. గడువు విధించిన ఏప్రిల్ 30 వరకు దాదాపు వెయ్యి మందికి పైగా పాకిస్తాన్ పౌరులు భారత్‌ను వీడారు. ఇది సముద్రంలో నీటిబొట్టు మాత్రమే. ఇక్కడే అన్ని సౌకర్యాలు అనుభవిస్తున్న పాకిస్తానీలలో కొందరు సీప్లర్ సెల్స్.

ఉత్తర్ ప్రదేశ్, బిహార్, గుజరాత్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, తెలంగాణ రాష్ట్రాల్లో పెద్ద సంఖ్యలో పాకిస్తానీలు, బాంగ్లాదేశీయులు, రోహ్యింగాలు ఉన్నారని నిఘావర్గాలు ఏనాడో వెల్లడించాయి. అయినా వీరిని వెనక్కి పంపకుండా ఇక్కడ ఉండే అవకాశం కొనసాగుతున్నదంటే స్థానిక ప్రభుత్వాలు కఠిన నిర్ణయాలు తీసుకోవడానికి జంకడమే కారణం. కొన్ని రాష్ట్రాలు పాక్ పౌరులను గుర్తించడంలో కఠినంగా ఉన్నాయి. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో వెయ్యిమందికిపైగా బాంగ్లాదేశీయులు అక్రమంగా నివసిస్తున్నట్టు బయటపడింది. ఈ వలసదారుల్లో కొందరు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్టు గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొందరు భారతదేశ ఆధార్, పాన్, ఓటర్ కార్డు కలిగి ఉండడం దేశ భద్రతకు పొంచి ఉన్న సవాలును గుర్తు చేస్తున్నాయి. దీనిపై గుజరాత్ ప్రభుత్వం వేగంగా స్పందించి వారు అక్రమంగా ఏర్పాటు చేసుకున్న నివాసాలను కూల్చివేసింది. ఈ కూల్చివేత ఘటనలపై కూడా మన సెక్యులరిస్టులు దేశ భద్రత కంటే మత కోణానికే ప్రాధాన్యతిస్తూ వ్యాఖ్యలు చేశారు.

దేశం మొత్తం ఒకేతాటిపై ఉండాల్సిన ఈ తరుణంలో స్వార్థ రాజకీయాలతో కుహనా మేధావులు చేసే వ్యాఖ్యలు మన శత్రువర్గానికి బలం చేకూరుస్తాయి. సదరు పార్టీ అధిష్ఠానాలు, అధినేతలు చేస్తున్న ప్రకటనలకు భిన్నంగా కిందిస్థాయి నేతలు అవగాహనారాహిత్యంతో వ్యాఖ్యలు చేయడం చూస్తుంటే ఆ పార్టీలో అభిప్రాయ భేదాలున్నాయా? లేకపోతే కపటత్వంతో, ద్వంద్వవైఖరితో, ఉద్దేశపూర్వకంగానే ఒకరు అలా, మరొకరు ఇలా మాట్లాడుతున్నారా అనే సందేహాలు సామాన్య పౌరుల్లో కలుగుతున్నాయి. ఎన్ని రాజకీయాలైనా ఉండవచ్చు. అవి అంతర్గతం. అంతేకానీ దేశ సార్వభౌమత్వానికి, భద్రతకు, ప్రతిష్ఠతకు సంబంధించిన అంశాల్లో రాజకీయ ప్రయోజనాలు ఆశించడం ప్రమాదకరం. అవెలా ఉన్నా, శత్రువును ఎదుర్కోవడంతో పాటు అంతర్గత శత్రువులతో కూడా పారాహుషార్‌గా మెలుగుతూ కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిందే.

– శ్రీపాద



మణిశంకర్ | రాబర్ట్ వాద్ర | ఫరూక్ అబ్దుల్లా | ముఫ్తీ | ఒమర్ అబ్దుల్లా

**చరిత్రను గమనిస్తే యుద్ధంలో లాభాలు విజేతకు దక్కితే నష్టాలు పరాజితులకు మిగులుతాయి. యుద్ధంలో గెలిచిన వారిదే పైచేయి అవుతుంది. కానీ విచిత్రంగా ఇక్కడ ఓడిపోయిన శత్రువే ప్రయోజనం పొందాడు. భారత్‌-పాకిస్తాన్‌ల మధ్య జరిగిన నాలుగు యుద్ధాల్లో మొదటి మూడింట జరిగింది ఇదే. మన వీర సైనికుల త్యాగాలను కాంగ్రెస్‌ పాలకులు వృథా చేశారు. ఫలితంగా మన శత్రు దేశంతో సమస్యలు అలాగే ఉండిపోగా, పదే పదే దాడులకు సాహసిస్తోంది. 1948, 1965, 1971 యుద్ధకాలాల్లో అసలేం జరిగింది? మన దేశం ఎలా నష్టపోయింది?**



# పాకిస్తాన్‌తో యు
# విజేత త్యాగ

పెహల్గావ్‌లో జరిగిన పెను విషాద ఘటన తర్వాత భారతీయుల రక్తం మరిగిపోతోంది. మన జాతి ఆత్మ మీద జరిగిన దాడికి ప్రతీకారం కోసం ఎదురు చూస్తోంది. మన ప్రభుత్వం ఇప్పటికే దౌత్యపరమైన ఆంక్షలతో ఉన్మాద దేశాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. అయితే ఇంతకన్నా గట్టిగా బుద్ధి చెప్పాలని, మనదేశంపై శత్రువు మళ్లీ కన్నెత్తి చూసే సాహసం చేయకూడదని దేశ ప్రజలు కోరుకుంటున్నారు. దీంతో దేశ సరిహద్దుల్లో మరోసారి యుద్ధ వాతావరణం కనిపిస్తోంది. పాకిస్తాన్‌తో భారత్‌ ఇప్పటికి నాలుగు యుద్ధాలు చేసింది. ఇవేవీ మనం ప్రారంభించినవి కాదు. శత్రువు దాడికి దిగినప్పుడే తిప్పికొట్టినవే. ఇందులో మూడు యుద్ధాలు కశ్మీర్‌ కేంద్రంగా జరిగితే, మరో యుద్ధం బాంగ్లాదేశ్‌ ఆవిర్భావానికి దారి తీసింది. ఈ యుద్ధాల్లో విజయాల ద్వారా మన సైనికులు పైచేయి సాధించినా, వారి పోరాటాలు, త్యాగాలకు దక్కినదేమీ లేకపోగా ఇరు దేశాల మధ్య కుదిరిన ఒప్పందాలు చేదు అనుభవాన్ని మిగిల్చాయి.

**1948: ఓడిన శత్రువుకే లాభం**

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కొద్ది వారాలకే పాకిస్తాన్‌తో తొలియుద్ధం జరిగింది. జమ్ముకశ్మీర్‌ కోసం జరిగిన తొలి కదనం ఇది. దేశ విభజన తర్వాత భారత్‌లో చేరాలా? పాకిస్తాన్‌లో చేరాలా? అనే విషయంలో బ్రిటిష్‌ వారు స్వదేశీ సంస్థానాలకే నిర్ణయాధికారం ఇచ్చారు. కానీ జమ్ము కశ్మీర్‌ మహారాజా హరిసింగ్‌ ఈ విషయంలో సకాలంలో నిర్ణయం తీసుకోలేకపోయారు. సంస్థానంలో ముస్లింలు ఎక్కువగా ఉన్నందున కశ్మీర్‌ తమకే దక్కాలని పాకిస్తాన్‌ ఒత్తిడి తెచ్చింది. తన రాజ్యాన్ని అప్పనంగా ఒక మత రాజ్యం చేతిలో పెడితే హిందువులకు జరిగే నష్టంతో పాటు, భారత ప్రధాని జవాహర్‌లాల్‌ నెహ్రూ తన స్నేహితుడు షేక్‌ అబ్దుల్లాకు కశ్మీర్‌ లో అధికారం దక్కేలా చేస్తున్న కుయుక్తులు కూడా ఇందుకు కారణం.

అక్టోబర్‌ 24, 1947న శ్రీనగర్‌ రాజప్రాసాదంలో దసరా ఉత్సవాల వేళ హఠాత్తుగా లైట్లు ఆగిపోయాయి. ఎంతసేపటికీ కరెంటు రాకపోవడంతో విచారిస్తే మహురా విద్యుత్తు కేంద్రాన్ని పేల్చేశారని సమాచారం అందింది. అప్పటికే గిరిజనుల ముసుగులో పాకిస్తాన్‌ సైనిక మూకలు క్రమంగా శ్రీనగర్‌ వైపు దూసుకొస్తున్నాయని తెలిసింది. వాస్తవానికి ఈ దాడి అక్టోబర్‌ 21 నుంచే మొదలైంది. వెంటనే అప్రమత్తమైన మహారాజా హరిసింగ్‌ సైనిక సహాయం చేయాలని తన ప్రధాని మెహర్‌చంద్‌ మహాజన్‌ ద్వారా భారత ప్రభుత్వానికి వర్తమానం పంపారు. దీనితో పాటు జమ్ముకశ్మీర్‌ను భారత్‌లో విలీనానికి అంగీకార లేఖ కూడా ఉంది.

జమ్ముకశ్మీర్‌ విలీన కసరత్తు పూర్తి కాగానే భారత సైన్యం కదిలింది. అప్పటికే శ్రీనగర్‌ సహా చాలా భాగాన్ని పాకిస్తాన్‌ సైన్యం అదుపులోకి తీసుకుంది. అప్పట్లో శ్రీనగర్‌కు భారత్‌ వైపు నుంచి రోడ్డు మార్గం కూడా సరిగ్గా లేదు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అక్టోబర్‌ 27 ఉదయం భారత సైన్యంలోని సిక్కు రెజిమెంట్‌ తొలిజట్టు లెఫ్టినెంట్‌ కల్నల్‌ రంజిత్‌ రాయ్‌ నేతృత్వంలో వాయుమార్గంలో శ్రీనగర్లో దిగింది. మన సైనికులు కొదమ సింహాల్లా దూసుకుపోయారు. శత్రువులను మట్టుబెడుతూ కశ్మీర్‌ లోయను ముష్కరుల నుంచి విడిపిస్తూ ముందుకు సాగారు. కశ్మీర్‌లోని గుల్మార్గ్‌, బారాముల్లా, తన్మార్గ్‌, పూంచ్‌ కోట్లి, రాజౌరీ, యురి తదితర కీలక ప్రాంతాలు తిరిగి స్వాధీనమయ్యాయి. ఈ దురాక్రమణను భారత్‌ అంతర్జాతీయ సమాజం దృష్టికి వెళ్లడంతో పాకిస్తాన్‌ అధ్యక్షుడు జిన్నా పరిస్థితి తేలు కుట్టిన దొంగలా మారింది. ఈ వ్యవహారంతో తమకు సంబంధం లేదని, గిరిజన పోరాట యోధులు చేసిన తిరుగుబాటు అంటూ మభ్య పెట్టే ప్రయత్నం జరిగింది.



మరి కొద్ది రోజుల్లో పాకిస్తాన్‌ సైన్యం చెర నుంచి కశ్మీర్‌ పూర్తిగా విముక్తం పొందుతుంది అన్న దశలో ప్రధాని నెహ్రూ తొందరపాటుతో చారిత్రిక తప్పిదానికి పాల్పడ్డారు. కశ్మీర్‌పై పాకిస్తాన్‌ దాడికి పాల్పడిందంటూ జనవరి 1, 1948 న భారత ప్రభుత్వం ఐక్యరాజ్య సమితిలో ఫిర్యాదు చేసింది. అప్పటికి ఇంకా గిల్గిట్‌ బాల్టిస్తాన్‌, ముజఫరాబాద్‌, మీర్‌పూర్‌ విముక్తం కాలేదు. ఈ భూభాగాలు ఇంకా స్వాధీనం కాకముందే ఏదో కొంపలు మునిగినట్లు నెహ్రూ తీసుకున్న అనాలోచిత నిర్ణయం కారణంగా ఆ ప్రాంతాలు పాకిస్తాన్‌ చెరలోనే ఉండిపోయాయి. మరోవైపు భారత ప్రభుత్వం ఎవరూ అడగకముందే జనవరి 1, 1949 నుంచి కాల్పుల విరమణ ప్రకటించింది. దీంతో అప్పటి వరకూ మన జవానులు చేసిన పోరాటం వృథా



# ుద్ధాలు

# గం పరాజితుడి భోగం

అయిపోయింది. ఈ పోరాటంలో పాకిస్తాన్ ఓడిపోయి నప్పటికీ జమ్ముకశ్మీర్‌లోని మూడోవంతు భూభాగాన్ని అప్పనంగా దక్కించుకోగలిగింది. ఈ సమస్య నేటికీ రావణ కాష్టంలా రగులుతూనే ఉంది.

**1965: ఫలించని యుద్ధం**

1947లో కశ్మీర్‌ను కబళించబోయి భంగపడిన పాకిస్తాన్ 1965లో మరోసారి భారత్‌తో కయ్యానికి కాలు దువ్వింది. 1962లో చైనా దురాక్రమణ కారణంగా జరిగిన యుద్ధంలో భారత్ పరాజయాన్ని అలుసుగా తీసుకుంది పాకిస్తాన్. ఈ యుద్ధం తర్వాత చైనా–పాకిస్తాన్‌లు మిత్ర దేశాలుగా మారాయి. భారత్ ఓటమి నుంచి ఇంకా కోలుకోనందున దెబ్బ మీద దెబ్బ తీయొచ్చని పాకిస్తాన్ పాలకుడు, సైనిక నియంత జనరల్ అయూబ్‌ఖాన్ భావించారు. 1965 మార్చి మాసంలో గుజరాత్ రాష్ట్రంలోని రాణ్ ఆఫ్ కచ్ ప్రాంతంలో కవ్వింపు చర్యలు ప్రారంభమయ్యాయి.

ఆగస్టు 5, 1965న పాకిస్తాన్ దళాలు ‘ఆపరేషన్ జీబ్రాల్టర్’ పేరుతో నియంత్రణ రేఖ దాటి భారత్‌లోకి చొరబడ్డాయి. ప్రతిగా భారత సైన్యం సరిహద్దు దాటి పాకిస్తాన్ అధీనంలో ఉన్న కశ్మీర్‌లోకి చొచ్చుకు పోయింది. పాకిస్తాన్ దళాలు తిత్వాల్, యురి, పూంచ్‌లలోకి ప్రవేశించగా, మన సైన్యం పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని హాజి పిర్ పాస్ వరకు స్వాధీన పరుచుకుంది. సెప్టెంబరు 1న ఆపరేషన్ గ్రాండ్‌స్లామ్ పేరుతో పాకిస్తాన్ ప్రతిదాడి చేసింది. అఖ్నూర్ స్వాధీనానికి ప్రయత్నించగా మన వాయుసేన పాకిస్తాన్ సైన్యాన్ని చెల్లాచెదురు చేసింది. ఈ యుద్ధం కశ్మీర్ మొదలు పంజాబ్, రాజస్థాన్, గుజరాత్ సరిహద్దుల వరకూ కొనసాగింది. భారత సైన్యం సియాల్ కోట్, లాహోర్ నగరాల సమీపం వరకూ దూసుకు పోవడంతో పాకిస్తాన్‌లో ఆందోళన మొదలైంది. భారత సైన్యం, వైమానిక దళం, నౌకాదళం ముప్పేట దాడులతో భీతిల్లిపోయింది. దీంతో పాకిస్తానీ పంజాబ్‌ను కాపాడుకోవడం కోసం కశ్మీరు నుండి ఉపసంహరించుకోవలసి వచ్చింది. మొత్తానికి ఆపరేషన్ గ్రాండ్‌స్లామ్ విఫలమైంది.

బ్రిటన్ ప్రధాని హెరాల్డ్ విల్సన్ ఇరుదేశాలు యుద్ధం ఆపాల్సిందిగా ఒప్పించి వివాద పరిష్కారానికి ఒక ట్రిబ్యునల్ ఏర్పాటు చేశారు. పాకిస్తాన్‌పై భారత్ విజయం అంచుల వరకూ వెళ్లిన తర్వాత ఐక్యరాజ్య సమితి పిలుపు మేరకు కాల్పుల విరమణకు అంగీకరించాల్సి వచ్చింది. సెప్టెంబర్ 23న యుద్ధం ముగిసింది. యుద్ధంలో భారత సైనికులు 3 వేల మంది వీర మరణం పొందారు. పాకిస్తాన్ 3,800 మందిని కోల్పోయింది.

**తాష్కెంట్ ఒప్పందం - 1966**

1965 యుద్ధంలో పాకిస్తాన్ మీద భారత్ విజయం ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి దేశ ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకొని నెహ్రూకు దీటైన నాయకునిగా గుర్తింపు పొందారు. అప్పటి సోవియట్ యూనియన్ (రష్యా), అమెరికా ఇరు దేశాల సంబంధాల పునరుద్ధరణ కోసం చొరవ తీసుకున్నాయి. ఈ నేపథ్యంలో జనవరి 10, 1966న ఉజ్బెకిస్థాన్ రాజధాని తాష్కెంట్‌లో శిఖరాగ్ర సమావేశం జరిగింది. చర్చల అనంతరం ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి, పాక్ పాలకుడు అయూబ్ ఖాన్ ఒక ఒప్పందంపై సంతకాలు చేశారు. దీనికే తాష్కెంట్ డిక్లరేషన్ అని పేరు.

ఈ ఒప్పందం ప్రకారం 1965 యుద్ధంలో భారత్, పాకిస్తాన్‌లు ఒకరికొకరు స్వాధీనపరచుకున్న ప్రాంతాలను విడిచి పెట్టాలి. కశ్మీర్లో 1949 కాల్పుల విరమణ రేఖకు కట్టుబడి ఉండాలి. రెండు దేశాలు ఒకరి అంతర్గత వ్యవహారాలలో మరొకరు జోక్యం చేసుకోవద్దు. ఆర్థిక, దౌత్య సంబంధాలు పునరుద్ధరించ బడాలి, యుద్ధ ఖైదీలను విడుదల చేయాలి. ఇరు దేశాల నాయకులు ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపర్చడానికి కృషి చేయాలి. యుద్ధంలో సాధించిన విజయం తాలూకు సంతోషాన్ని అనుభవించకముందే జరిగిన ఈ ఒప్పందం భారత దేశానికి పెద్దగా ఇష్టంలేదు. అగ్ర రాజ్యాల ఒత్తిడి కారణంగా అయిష్టంగానే శాస్త్రీజీ తాష్కెంట్ ఒప్పందానికి అంగీకరించారని అంటారు.

దురదృష్టవశాత్తు తాష్కెంట్ ఒప్పందం పత్రంపై చేసిన సంతకం తడి ఆరక ముందే అదే రోజు రాత్రి లాల్‌బహదూర్ శాస్త్రి తాష్కెంట్ లోని హోటల్ గదిలోనే కన్నుమూశారు. శాస్త్రీజీ గుండెపోటుతో మరణించారని రష్యా అధికారులు చెప్పినా అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే ఈ విషయాన్ని నాటి కాంగ్రెస్ నాయకులు వివాదాస్పదం కాకుండా జాగ్రత్త పడ్డారు. ఈ మిస్టరీ మృతిపై ఏర్పాటు చేసిన విచారణ కమిటీ నివేదిక కూడా వెలుగులోకి రాలేదు.

శాస్త్రీజీ మన మధ్య లేకపోయినా తాష్కెంట్ ప్రకటనకు అనుగుణంగా ఇరుదేశాల మధ్య మంత్రివర్గ స్థాయిలో 1966 మార్చిలో చర్చలు జరిగాయి. అవి అంతగా ఫలవంతం కాలేదు. కశ్మీర్ సమస్యపై అభిప్రాయ భేదాలే ఇందుకు కారణం. మరోవైపు

## ఓడినా గెలిచినట్టు పాక్ ప్రచారం




1965 నాటి యుద్ధంలో భారత్ విజయం స్పష్టంగా కనిపిస్తుంది. అయితే యుద్ధం ఇంకా ముగియకముందే అంతర్జాతీయ సంస్థల ఒత్తిడి మేరకు సంధి కుదిరి సిమ్లా ఒప్పందం చేసుకోవాల్సి వచ్చింది. విచిత్రం ఏమిటంటే పాకిస్తాన్ ప్రజలు 1965 యుద్ధంలో తామే గెలిచామని చెప్పుకుంటారు. పాకిస్తాన్ ప్రభుత్వం స్వయంగా ఈ అబద్ధాన్ని ప్రచారం చేస్తూ విద్యార్థుల పాఠ్యాంశాల్లో కూడా చొప్పించింది. అప్పట్లో కొన్ని అంతర్జాతీయ పత్రికల్లో హడావుడిగా వచ్చిన ఫేక్ న్యూస్ ఇందుకు ఆధారమైంది.

1968లో బ్రిటన్ ప్రధాని హెరాల్డ్ జోక్యంతో ఏర్పాటైన ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం రాణ్ ఆఫ్ కచ్ ప్రాంతంలో పాకిస్తాన్‌కు 900 చ.కి.మీ.ల భూభాగం దక్కింది.

**1971: పాక్ వెన్ను విరిగి బాంగ్లాదేశ్ పుట్టింది**

మతప్రాతిపదికన ఏర్పడ్డ పాకిస్తాన్‌లో భాషాపరమైన సఖ్యత లేకుండా పోయింది. బెంగాలీ మాట్లాడే తూర్పు పాకిస్తాన్ ప్రజలు తమపై పశ్చిమ పాకిస్తాన్ ఉర్దూను రుద్దడాన్ని సహించలేకపోయారు. తూర్పు పాకిస్తాన్‌లో జనాభా ఎక్కువున్నా, రాజకీయంగా పెత్తనం అంతా పశ్చిమ పాకిస్తాన్ నాయకులదే. పాకిస్తాన్ పార్లమెంట్‌లో 313 సీట్లు ఉంటే అందులో 169 సీట్లు తూర్పు పాకిస్తాన్‌లో ఉన్నాయి. 1970లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో తూర్పు పాకిస్తాన్ లో అవామీలీగ్ 167 సీట్లు గెలుచు కుంది. పార్లమెంట్‌లో ఆధిక్యత సంపాదించినందున అవామీలీగ్ నేత షేక్ ముజీబుర్ రహమాన్ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు దేశాధ్యక్షుడు యాహ్యాఖాన్‌ను అనుమతి కోరారు. అయితే పశ్చిమ పాకిస్తాన్ నాయకులు అంగీకరించలేదు. దీంతో తూర్పు పాకిస్తాన్‌లో నిరసనలు మొదలయ్యాయి. ఈ నిరసనలు కాస్తా స్వతంత్ర బాంగ్లాదేశ్ ఉద్యమానికి దారి తీశాయి.

మార్చి 25, 1971న ఢాకాకు పశ్చిమ పాకిస్తాన్ నుంచి పెద్ద ఎత్తున వచ్చిన సైన్యం ముజబూర్ రహ్మాన్‌ను ఖైదు చేసి పట్టుకెళ్లింది. ఈ సందర్భంగా జరిగిన అంతర్యుద్ధంలో 30 వేల మంది మరణించారు. ముఖ్యంగా హిందువులను లక్ష్యంగా చేసుకొని దాడులు జరిగాయి. తూర్పు పాకిస్తాన్‌లోని సైన్యంలో చీలిక వచ్చింది. షేక్ ముజిబుర్ రహమాన్ తరపున మేజర్ జియావుర్ రహమాన్ ముక్తి బాహిని సైన్యం ఏర్పాటు చేశారు. ముక్తి బాహిని పాక్ సైన్యంలో గొరిల్లా పోరాటం ప్రారంభించింది. మార్చి 27, 1971న జియావుర్ రహ్మాన్ బాంగ్లాదేశ్‌ను స్వతంత్ర దేశంగా ప్రకటించారు. నాటి భారత ప్రధాని ఇందిరా గాంధీ బాంగ్లాదేశ్ స్వాతంత్ర్యపోరాటానికి పూర్తి మద్దతు తెలిపి బాంగ్లా శరణార్థులకు మన దేశంలో ఆశ్రయం ఇచ్చారు. అవామీలీగ్ నాయకులు భారత దేశంలోని కలకత్తాలో ఉంటూనే ఏప్రిల్ 17,1971న తూర్పు బెంగాల్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు.

డిసెంబరు 3 సాయంత్రం భారత్‌లోని 8 వైమానిక స్థావరాలపై పాకిస్తాన్ వైమానిక దళాలు బాంబు దాడులు జరిపాయి. ఇందుకు ప్రతిగా భారత సైన్యం పాకిస్తాన్ పైన దాడులు ప్రారంభించింది. ప్రధాని ఇందిరాగాంధీ జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగంలో పాకిస్తాన్ దాడులను భారత్‌పై యుద్ధ ప్రకటనగా భావిస్తున్నామన్నారు. ఈ యుద్ధంలో ధీటుగా పోరాడిన భారత సైన్యం పాకిస్తాన్‌ను చిత్తు చేసింది.

పాకిస్తాన్ కేవలం రెండు రోజుల్లో, అంటే డిసెంబరు 16 న లొంగిపోయింది. మరుసటిరోజు భారత్ కాల్పుల విరమణ ప్రకటించింది. ఢాకాలో పాకిస్తానీ బలగాలు లొంగుబాటు పత్రంపై సంతకాలు చేసాయి. భారతదేశం సుమారు 93,000 మంది పాకిస్తానీ సైనికులను యుద్ధఖైదీలుగా అదుపులోకి తీసుకుంది. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత జరిగిన అతిపెద్ద సైనిక లొంగుబాటు ఇది. ఈ యుద్ధం వల్ల బాంగ్లాదేశ్‌కు స్వాతంత్ర్యం లభించింది. ఈ యుద్ధంలో 3,843 మంది భారత సైనికులు మృతి చెందగా 9,851 మంది క్షతగాత్రులయ్యారు. పాకిస్తాన్ వైపు 9 వేల మంది సైనికులు చనిపోగా 4,350 మంది గాయపడ్డారు. పాకిస్తాన్ తన నేవీలో సగభాగం, ఎయిర్ ఫోర్స్‌లో పాతిక, దాదాపు మూడొంతుల సైన్యాన్ని నష్టపోయింది, ఈ యుద్ధంలో భారత్ 14,000 చ.కి.మీ.ల మేర పాకిస్తాన్ భూభాగాన్ని స్వాధీనం చేసుకుంది.

**1972: సిమ్లా ఒప్పందం**

1971 యుద్ధం తర్వాత భారత్, పాక్‌ల మధ్య ఘర్షణలు నివారించి సత్సంబంధాలు నెలకొల్పే లక్ష్యంతో సిమ్లా ఒప్పందం కుదిరింది. జూలై 2, 1972న హిమాచల్ ప్రదేశ్ రాజధాని సిమ్లాలో సమావేశమైన భారత ప్రధాని ఇందిరాగాంధీ, పాకిస్తాన్ అధ్యక్షుడు జుల్ఫికర్ ఆలీ భుట్టో ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు.

సిమ్లా ఒప్పందం ప్రకారం డిసెంబర్ 17, 1971నాటి కాల్పుల విరమణ రేఖను సిమ్లా ఒప్పందం నియంత్రణ రేఖ(ఎల్‌వోసీ)గా మార్చింది. భేదాభిప్రాయాలున్నా భారత్, పాక్ ఏకపక్షంగా రేఖను మార్చకూడదని ఒప్పందంలో ఉంది. కశ్మీర్ వివాదం పూర్తిగా భారత్–పాక్ మధ్య ద్వైపాక్షిక అంశమని సిమ్లా ఒప్పందంలో పేర్కొన్నారు. ఈ ఒప్పందాన్ని చూపిస్తూనే ఐక్యరాజ్య సమితి సహా మరే తృతీయ పక్షమూ కశ్మీర్ విషయంలో జోక్యం చేసుకోకుండా భారత్ పలుమార్లు అడ్డుకుంది. భారత్ స్వాధీనం



## సిమ్లా ఒప్పందం

- భారత్, పాకిస్తాన్‌ల మధ్య సంబంధాలు దెబ్బతినేందుకు కారణమైన సంఘర్షణకు తెరదించాలి.
- ఇరు దేశాలు పరస్పరం స్నేహపూర్వక, సామరస్య సంబంధాల కోసం కృషిచేయాలి.
- సరిహద్దుల్లో ఇరు దేశాల బలగాలను ఉపసంహరించుకోవాలి.
- 1971 యుద్ధ ఖైదీలను స్వదేశాలకు అప్పగించాలి.
- యుద్ధం పూర్వపు శాంతియుత పరిస్థితులను తిరిగి తీసుకురావాలి.
- ఇరు దేశాలకు సంబంధించిన అన్ని వివాదాలను నేరుగా ద్వైపాక్షిక సంప్రదింపులతో ఉమ్మడి అంగీకారం సాధించడం ద్వారా పరిష్కరించుకోవాలి.
- జాతి సమైక్యత, ప్రాదేశిక పరిపూర్ణత, రాజకీయ స్వాతంత్ర్యం, సార్వభౌమ సమానత్వాన్ని ఇరుదేశాలు పరస్పరం గౌరవించుకోవాలి.

## లాహోర్ ప్రకటన

- ❊ అణ్వాయుధాలను ఎవరూ ఇష్టారాజ్యంగా వినియోగించకూడదు.
- ❊ ఇరుదేశాల మధ్య సంఘర్షణ తలెత్తకుండా జాగ్రత్త వహించాలి.
- ❊ శాంతియుతంగా కొనసాగేందుకుగాను ఐరాస ప్రణాళిక, విశ్వవ్యాప్తంగా ఆమోదం పొందిన ఇతర నియమాలకు కట్టుబడి ఉండాలి.
- ❊ సిమ్లా ఒప్పందాన్ని కాగితాలకే పరిమితం చేయకుండా సంపూర్ణంగా అమలు చేయాలి.
- ❊ అణు నిరాయుధీకరణకు సంబంధించి అంతర్జాతీయ ఒప్పందానికి ఇరుదేశాలు కట్టుబడి ఉండాలి.
- ❊ ఉగ్రవాదంపై పోరాడాలి.
- ❊ ఒకరి అంతర్గత వ్యవహారాల్లో మరొకరు జోక్యం చేసుకోరాదు.
- ❊ కశ్మీర్ సమస్య సహా ద్వైపాక్షిక అజెండాలోని అన్ని వివాదాలు త్వరగా, శాంతియుతంగా పరిష్కారమయ్యేలా చర్చల ప్రక్రియను ముమ్మరం చేయాలి.



చేసుకున్న పాకిస్తాన్ భూభాగాలను సిమ్లా ఒప్పందం కారణంగా తిరిగి ఇచ్చేయాల్సి వచ్చింది.

**1999: లాహోర్ ప్రకటన**

ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి 1998 మేలో పోఖ్రాన్‌లో అణుపరీక్ష నిర్వహించి ప్రపంచానికి భారత్ సత్తాను చాటారు. దీంతో పాకిస్తాన్ కూడా అరువు తెచ్చుకున్న పరిజ్ఞానంతో పోటీ పరీక్ష నిర్వహించింది. ఈ నేపథ్యంలో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలను నివారించే నిమిత్తం ప్రధాని వాజ్‌పేయి 1999 ఫిబ్రవరిలో లాహోర్‌కు బస్సు యాత్ర జరిపారు. ఈ సందర్భంగా ఇరు దేశాల ప్రధానుల మధ్య చరిత్రాత్మక శిఖరాగ్ర సదస్సు జరిగింది. ఫిబ్రవరి 21, 1999న భారత ప్రధాని , పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్ 'లాహోర్ ప్రకటన'పై సంతకం చేశారు.

సరిగ్గా లాహోర్ ఒప్పందం కుదిరిన సమయంలోనే పాకిస్తాన్ సైనిక ప్రధానాధికారి పర్వేజ్ ముషారఫ్ కుట్రకు తెర లేపారు.

**1999: దురాక్రమణకు ధీటైన జవాబు**

లాహోర్ ఒప్పందం కుదిరిన కొద్ది వారాలకు పాకిస్తాన్ సైన్యం దానికి తూట్లు పొడిచింది. 1999 మే మాసంలో కశ్మీర్‌లోని కార్గిల్‌లోకి చొరబడింది. పాకిస్తాన్ మీద భారత్ తిరుగులేని సత్తాను చాటిన యుద్ధం ఇది. ప్రపంచంలో అణ్వాయుధాలు కలిగిన దేశాల మధ్య జరిగిన యుద్ధాలలో ఇది రెండోది. పాకిస్తాన్ ప్రధానమంత్రికే తెలియకుండా ఆ దేశ సైన్యాధికారి పర్వేజ్ ముషారఫ్ దురాక్రమణకు దిగడం మరో వింత. మంచు కొండల్లో శరీరం గడ్డకట్టుకుపోయే వాతావరణంలో దాదాపు 60 రోజుల పాటు సాగిన యుద్ధంలో ఎప్పటిలాగే భారత్‌దే పైచేయి అయింది. ఈ పోరాటంలో 527 మంది భారత జవాన్లు అమరులయ్యారు. 1363 మంది గాయపడ్డారు. పాక్ సైనికులు దాదాపు 12 వందలకు పైగా మరణించి, అంతకు మూడింతల మంది గాయపడినా, ఈ లెక్కలను పాక్ అధికారికంగా గుర్తించలేదు. వారు తమ సైనికులే కాదని బుకాయించింది. ఈ విజయాన్ని ప్రతి ఏటా జులై 26న కార్గిల్ విజయ్ దివస్‌గా జరుపుకుంటున్నాం. భారత్‌కు శాంతి మంత్రమే కాదు.. యుద్ధతంత్రం కూడా తెలుసు అని చాటి చెప్పారు నాటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి.

**గెలుపూ మనదే త్యాగమూ మనదేనా?**

పాకిస్తాన్‌తో జరిగిన నాలుగు యుద్ధాల్లో విజయం భారత్‌దే. ఈ అన్ని యుద్ధాల్లోనూ చిత్తుగా ఓడింది పాక్. అయినా కుక్కతోక వంకర అన్నట్లు పాక్ బుద్ధి మారలేదు. పైగా వెయ్యేళ్లయినా భారత్‌తో పోరాడతాం అంటూ మేకపోతు గాంభీర్య ప్రకటనలు చేస్తోంది మన శత్రుదేశం. ప్రపంచంలో జరిగిన ఏ యుద్ధంలో అయినా విజేతలు లాభపడతారు. పరాజితులు కోల్పోతారు. కానీ మొదటి మూడు యుద్ధాల్లో (1948, 1965, 1971) ఓడిపోయిన పాకిస్తాన్‌కు అనుకూలించేలా ఒప్పందాలు కుదరడాన్ని గమనించవచ్చు.

1948 యుద్ధంలో దురాక్రమణకు దిగి చిత్తయింది పాకిస్తాన్. కానీ ప్రధాని నెహ్రూ తొందరపాటు నిర్ణయం కారణంగా యుద్ధంలో గెలిచినప్పటికీ సగం కశ్మీరాన్ని వదులుకోవలసి వచ్చింది. పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ భూభాగం ఉగ్రవాద తండాల తయారీ కర్మాగారంలా తయారైంది. ఈనాటికీ దీని తాలూకు దుష్ఫలితాలను అనుభవిస్తోంది భారత్.

1965 యుద్ధంలో పాకిస్తాన్ ఓడినప్పటికీ తాష్కెంట్ ఒప్పందం కారణంగా యుద్ధ ఖైదీలుగా పట్టుబడిన ఆ దేశ ఖైదీలకు ఎలాంటి శిక్షలూ విధించలేపోయాం. పైగా రాణ్ ఆఫ్ కచ్‌లో కొంత భూభాగాన్ని పాక్ దక్కించుకుంది. భారత సైన్యం లాహోర్, సియాల్‌కోట్‌లను దక్కించుకున్నా తిరిగి వదిలేయాల్సి వచ్చింది. కశ్మీర్లో 1949 కాల్పుల విరమణ రేఖకు కట్టుబడి ఉండాలని ఒప్పందం చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. మరో విషాదం ఏమిటంటే ఒప్పందంపై సంతకం చేసిన ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి అనుమానాస్పద పరిస్థితుల్లో తాష్కెంట్‌లోనే చనిపోయారు.

1971లో బంగ్లాదేశ్ ఏర్పాటుకు దారి తీసిన యుద్ధంలో భారత సైన్యం పాకిస్తాన్‌ను అన్ని విధాలా దెబ్బతీయగలిగింది. కానీ సిమ్లా ఒప్పందంలో మన దేశానికి దక్కిన ప్రయోజనాలేమీ లేవు. 93 వేల మంది యుద్ధ ఖైదీలను ఎలాంటి షరతులు లేకుండా వదిలేశాం. స్వాధీనం చేసుకున్న భూభాగాలనూ వదిలేశాం. ఈ యుద్ధ విజయంతో ఆక్రమిత కశ్మర్‌ను తిరిగి దక్కించుకునే అవకాశాన్ని చేజేతులారా వదులుకుంది మన ప్రభుత్వం.

ఈ మూడు యుద్ధాలు కాంగ్రెస్ పార్టీ హయాంలోనే జరిగాయి. మన సైనికులు త్యాగాలు వృథా అయ్యాయనే భావన దేశ ప్రజల్లో ఏర్పడింది.

1999లో లాహోర్ ఒప్పందాన్ని ఉల్లంఘించి కార్గిల్ దురాక్రమణకు పాల్పడ్డ పాకిస్తాన్‌కు అటల్ బిహారీ వాజ్‌పేయి సర్కారు ధీటుగా జవాబిచ్చింది. ఈ యుద్ధం తర్వాత పాకిస్తాన్‌తో ఎలాంటి ఒప్పందాలను కుదుర్చుకోలేదు. తాజాగా ప్రధాని మోదీ కూడా పాకిస్తాన్ విషయంలో కఠిన వైఖరిని కొనసాగిస్తున్నారు.

ఐక్యరాజ్య సమితితో పాటు అంతర్జాతీయ వేదికలపై కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించి, వివాదం చేసేందుకు పాకిస్తాన్ చేస్తున్న ప్రయత్నాలను భారత్ దౌత్య పరంగా సమర్థవంతంగా ఎదుర్కొంటోంది. గతంలో పుల్వామా ఉగ్రదాడి తర్వాత సర్జికల్ స్ట్రైక్ ద్వారా శత్రుదేశానికి బుద్ధి చెప్పారు. తాజాగా పెహల్గావ్ ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ పాకిస్తాన్‌ను అనేక నిషేధాజ్ఞలతో అష్టదిగ్బంధం చేసింది.



**క్రాంతిదేవ్ మిత్ర**
సీనియర్ జర్నలిస్ట్




'భగవంతునికీ, భక్తునికీ అనుసంధానమైనది' అన్న మాటలతో పూజగది దృశ్యంతో ఒక వ్యాపార ప్రకటన వినిపిస్తుంది. ఆ ప్రకటన ఏ వస్తువు గురించో ఇట్టే గుర్తు పడతారంతా. అదొక అగరబత్తీ వ్యాపార ప్రకటన. కొవ్వొత్తికీ, అగరబత్తీకి ఒక సామ్యం ఉంది. కొవ్వొత్తి తను కాలుతూ వెలుగునిస్తుంది. అగరబత్తీ తాను కాలిపోతూ, సువాసనలను వెదజల్లుతూ ఒక ప్రశాంత వాతావరణాన్ని సృష్టించి చివరకు బూడిదగా మిగిలిపోతుంది. దీన్ని బట్టి శారీరక అందం శాశ్వతం కాదనీ, దాన్నించి వచ్చే సువాసన అనే గుణగణాలు, విలువలు మాత్రమే శాశ్వతంగా నిలిచిపోతాయనే పరమార్థాన్ని మనకు చెప్పకనే చెబుతున్నట్లుంది. ధూపం, అగరబత్తీ పూజాద్రవ్యాలుగానే చూసిన వాటికి చాలా చక్కని ఇతర ప్రయోజనాలు కూడా ఉన్నాయి. చరిత్ర కూడా పెద్దదే.

**19**00లో మైసూరు రాజు ఈ గుబాళింపుని ఎక్కువ సమయం వచ్చేలా చేయమని తన ఆస్థానంలోని అధికారిని కోరాడు. ఆ అధికారి ఓ వెదురు పుల్లకు గంధం పేస్టును, కొన్ని నూనెలను కలిపి అగరబత్తిని తయారు చేశారు. ఆ తరువాత సుగంధాలయవారు దాన్ని అనుకరించి, నేటి అగరబత్తీకి కారణమయ్యారు. భారతదేశంలో సుమారు 5000 అగరబత్తీ కంపెనీలు నడుస్తూ కొన్ని లక్షల మందికి పని కల్పిస్తున్నాయి. తిరుపతిలో శ్రీవారికి ఉపయోగించిన నిర్మాల్యాలతో (వాడిన పువ్వులను) దేవస్థానం వారు ఏడు బ్రాండ్లు గల అగరబత్తీని తయారు చేస్తున్నారు. దీని నుండి భారతదేశానికి ఎక్కువ మొత్తంలో విదేశీమారక ద్రవ్యం వస్తున్నది.

నిశ్శబ్దంగా వున్న గదిలో అగరబత్తీ వెలిగించాక వచ్చే ఆ సువాసన మనసుకు హాయినిస్తుంది. ఆ పొగ గాల్లో రింగులు తిరుగుతూ నృత్యం చేస్తున్నట్లు అనిపిస్తుంది. ఎర్రగా వెలిగే దాని అంచు నక్షత్రాన్ని తలపిస్తుంది. అగరబత్తీని చూస్తూ దాని వాసన పీలుస్తుంటే మనసులో అనవసరపు ఆలోచనలు దూరమవ్వడంతో పాటు జ్ఞాపకాలను పోగేస్తుంది.

అగరబత్తీలను వాడేసిన పూలు, కొబ్బరికాయలు, ఆవు పేడతో వీటిని తయారు చేసుకోవచ్చును. అగరబత్తీని తెలుగులో అగరువత్తి, సాంబ్రాణి వత్తి అని అంటారు. ఇంట్లో, గుడిలో భగవంతుడికి పూజ చేసేటప్పుడు అగరబత్తీని వెలిగిస్తారు.

**దశాంగం గుగ్గులోపేతం సుగంధం చసుమనోహరం**

**ధూపం దాస్యామి దేవేశి వరలక్ష్మి గృహాణితం**

ధూపం సమర్పయామి అని అమ్మవారి పూజలో చెబుతారు.

ప్రకృతి మనకు చాలానే ఇచ్చింది. దాన్నుంచి మనం మన ఆహారాన్ని, ఆనందాన్నీ వెదుక్కుంటాం. మనసుకు ఆహ్లాదాన్ని కలిగించే సాంబ్రాణి ధూపం అలా అడవితల్లి ఒడిలోనే పుట్టిందే. ఆ వృక్ష జాతులే బోస్వెల్లియా శాక్రా (ఫ్రాంకిన్సెన్స్) కొమ్మిపోర మీరా (మిర్). ఈ చెట్లలో ఫ్రాంకిన్సెన్స్ జిగురు గట్టిగా ఉంటే, మిర్ రకం బంక గాఢమైన వాసన కలిగి ఉంటుంది. మధ్య ప్రాచ్య దేశాల్లోనూ, ఉత్తర ఆఫ్రికాలోనూ దాదాపు 5 వేల సంవత్సరాలకు పూర్వం నుంచే సాంబ్రాణి వ్యాపారం నడిచింది. ఆ కారణంగానే సుగంధమార్గం చిర్రూపం రూట్ ఏర్పడింది. స్నానం చేయించాక ఇప్పటికి పసిపిల్లలకు సాంబ్రాణి పొగవేస్తారు. దీని నుండి తీసే నూనెలను అనేక పెర్ఫ్యూమ్‌లలో వాడతారు.

సాంబ్రాణిని ఆయుర్వేద ఔషధాలలో వాడతారు. తెల్లవారు జామున గుళ్లోకి వెళ్లగానే గుప్పున ముక్కు పుటాలను తాకే సుగంధ పరిమళం, స్నానం చేయించిన పసిబిడ్డలకు ఎత్తుకోగానే హాయిన గొలిపేలా వచ్చే కమ్మటి సువాసన, పండగలప్పుడు ఇంటిని చుట్టేసే గుబాళింపుల ధూపం సాంబ్రాణి.

గాలిలోని బాక్టీరియా స్థాయిని అగరబత్తీ బాగా తగ్గిస్తుందని 2010లో జవాహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీలో పరిశోధనలో మైక్రోబయాలజీ ప్రొఫెసర్ డా॥ విజయకుమార్ తెలియజేశారు.

నిద్రలేమితో బాధపడే వారికి రెండు అగరబత్తీలు వెలిగించి ఉంచితే ప్రశాంతమైన, మెరుగైన తీరులో నిద్రపోతారని 2016లో జపాన్‌లోని క్యోటో విశ్వవిద్యాలయం పరిశోధకులు తెలియజేస్తున్నారు. ఒత్తిడితో బాధ పడేవారికి అగరబత్తీలు వెలిగించడం వలన మనసుకు ప్రశాంతం కలుగుతుందని చాలామంది శాస్త్రవేత్తలు చెపుతున్నారు. ఇంట్లో ప్రతికూల శక్తులను తరిమేందుకు అగరబత్తీలను వెలిగిస్తారని హిందూ శాస్త్రాలు చెపుతున్నాయి.

అగరబత్తీల కారణంగా శరీరంలో రోగ నిరోధకశక్తి పెరుగుతుంది. ముఖ్యంగా లావెండర్, పుదీనా, యూకలిప్టస్ ఫ్లేవర్లు గల అగరబత్తీలు వీటికి ఉపకరిస్తాయని చెపుతున్నారు. మానసిక ఆరోగ్యం




చేకూరుతుంది. సృజనాత్మకమైన పనులకు అగరబత్తీల వాసన అవసరం.

పురాణాల ప్రకారం దేవుళ్లు ధూపాన్ని ఇష్టపడతారు. దేవతారాధన సమయంలో ధూపం వేయడం వలన వారు సంతోషిస్తారని పండితులు అభిప్రాయపడుతున్నారు. ఆర్గానిక్ అగరబత్తీలను ఎక్కువగా ప్రోత్సహించాలన్న సంగతి ఎవరూ విస్మరించరాదు.

బృహత్ సంహితలోని ఒక అధ్యాయం "గంధయుక్తి" (పరిమళాల మిశ్రమం) కి అంకితం చేశారు. వరహా మిహిర అనేక సుగంధ సూత్రాలను అందించాడు. దానిలో గంధార్ణవ (పరిమళాల మహాసముద్రం)లో 16 పదార్థాలను వివిధ మోతాదుల్లో మిశ్రమాలుగా కలపడం ద్వారా

43,680 రకాల పరిమళ ద్రవ్యాలను తయారు చేయవచ్చుని చెప్పాడు. పద్మశ్రీ రచించిన "నాగర సర్వస్వ" పరిమళం గురించి ఓ అధ్యాయం రాశాడు.

ధూపం కర్రలు (అగరబత్తీ) తయారీకి కావలసినవి వెదురు కర్రలు, రంపపు పొడి, జిగురు, (చెట్ల బెరడు నుండి తీసిన పదార్థం) పెర్‌ఫ్యూమ్ పదార్థాలు (పేస్ట్), నూనెల ద్రావకం, బేస్‌పేస్ట్‌ను వెదురు కర్రకు పూసిన తర్వాత, అది తేమగా ఉన్నప్పుడే చక్కటి చెక్క పొడితో చుడతారు. కొద్ది రోజులు ఆరబెట్టిన తరువాత సువాసన కలిగిన ద్రావకంలో ముంచుతారు.

భారతదేశంలో కర్ణాటకను అగరబత్తీ రాజధానిగా గౌరవిస్తారు. మైసూరు, బెంగళూరు సువాసన గల అగరబత్తీ కేంద్రాలుగా రూపుదిద్దుకున్నాయి. అయినా నేడు చాలా రాష్ట్రాలు అగరబత్తీ తయారీకి పూనుకొని లాభాలు గడిస్తున్నాయి.

వేదాలలో ప్రత్యేకించి అధర్వ, రుగ్వేదాలలో ధూపం తయారుచేసే ఏకరూప పద్ధతిని ప్రోత్సహించాయి. ధూపం తయారీ అనేది ఆయుర్వేద వైద్య విధానంతో అంతర్గతంగా ముడిపడి ఉంది. మహా భారతం కూడా ధూపాన్ని గురించి వివరించింది. కౌటిల్యుడు తన అర్థశాస్త్రంలో సుగంధద్రవ్యాల అమ్మకంపై 10వ వంతును పన్నుగా వసూలు చేసినట్లు చెప్పారు.

ధర్మశాస్త్రం, పురాణాలు ధూపానికి చెందిన పదార్థాలను గురించి పరిచయం చేస్తూ గంధం, కలబంద, కర్పూరం, కస్తూరి, కుంకుమ పువ్వు మొదలైన వస్తువులను గురించి వివరించాయి. బౌద్ధులకు ధూపం మతాచారమయింది. బౌద్ధ సన్యాసులు చైనాకు ధూపం కర్రల తయారీని నేర్పించారు.

భారతదేశం ప్రపంచంలో ధూపాలను ఉత్పత్తి చేసే ముఖ్యమైన దేశం. ఎగుమతిదారు కూడా. ఆ తరువాత చైనా, వియత్నాం వస్తాయి. భారత్ నుండి 87,401 (షిప్‌మెంట్స్) ఎగుమతి కాగా 22,095 షిప్‌మెంట్స్‌తో చైనా ద్వితీయస్థానంలో ఉండగా 13,181 షిప్‌మెంట్స్‌తో వియత్నాం తృతీయ స్థానంలో ఉంది.

చదువు ప్రారంభంలో సుగంధభరితమైన అగరబత్తీ ఒకటి వెలిగించి పెట్టండి. మంచివాసన వస్తుంటే గ్రహణశక్తి బాగుంటుంది. ముక్కు కన్నం రాక్టెక్స్ వరకు వెళుతుంది. కార్టెక్స్ బాగుంటే చదువు బాగా వస్తుంది. జవ్వాదిని గెడ్డం క్రింద రాసుకుంటే స్మెల్ సర్కిల్ ఏర్పడుతుంది. తద్వారా చదువు బాగా వస్తుంది అని ఓ రచయిత అభిప్రాయపడ్డారు.

శ్రీఖండం ఘనసారాఢ్యం గుగ్గుల్వగరు సంయుతమ్ ధూపం దాస్యే యచ్చ యుష్మద్రూపం సాధుపమంగురో శ్రీ నిఖిలేశ్వరానంద స్వరూప నారాయణ దత్తశ్రీమాలీ గురుభ్యోనమః ధూపమాఘ్రా పయామి.



**డా. కాశింశెట్టి సత్యనారాయణ**
విశ్రాంత ఆచార్యుడు

**జోక్**

# ఆనాటి తప్పులకు కూడా నేనే బాధ్యత వహిస్తా!

అమెరికా వెళితే చాలు రాహుల్ గాంధీ మేధస్సు వేయి ఓల్టుల బల్బులా వెలుగుతుంది. బీజేపీ మీద, భారత సార్వభౌమత్వం మీద, భారతదేశంలో మైనారిటీల దుస్థితి మీద ఆయన నోటి నుంచి పుంఖానుపుంఖాలుగా వ్యాఖ్యలు విమర్శలు జాలువారతాయి. ఏప్రిల్ మూడో వారంలో ఆయన అక్కడి బ్రౌన్ విశ్వవిద్యాలయంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. తరువాత ప్రశ్నోత్తరాల కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీనితో రాహుల్‌కు పచ్చి వెలక్కాయ గొంతులో పడినంత పనయింది. ఏప్రిల్ 21న బ్రౌన్ విశ్వవిద్యాలయంలోని వాట్సన్ ఇనిస్టిట్యూట్‌లో ఈ కార్యక్రమం జరిగింది.

1984 నాటి సిక్కుల మీద దాడికి మీ పార్టీ కారణం, ఆ హత్యాకాండలో పాలు పంచుకున్న సజ్జన్‌కుమార్‌లు, టైట్లర్‌లు ఇంకా పార్టీలో హాయిగా ఉన్నారు, ఇదెలా అని ఒక సిక్కు విద్యార్థి నిలదీశారు. అంటే ఆనాటి హంతకులను ఇప్పటికీ పార్టీలోనే కొనసాగిస్తున్న రాహుల్ మైనారిటీలుగా సిక్కులకు నమ్మకం కలిగించారని ఎలా అనుకోవాలన్నదే ఆ సిక్కు విద్యార్థి ప్రశ్న. మీ పార్టీ గతంలో చాలా తప్పులు చేసింది. వాటిని గుర్తించి పశ్చాత్తాప పడే లక్షణమే కనిపించడం లేదని కూడా విద్యార్థి విమర్శించారు. నేడు బీజేపీ హయాంలో




మైనారిటీలు ఎలా ఉన్నారో మాకు చెప్పడానికి మాత్రమే మీరు ప్రయత్నిస్తున్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ హయాంలో సిక్కుల మీద జరిగిన హత్యాకాండ సంగతి గురించి ఏమంటారు? అని నేరుగానే ఆ విద్యార్థి ప్రశ్నించాడు. ఇప్పటికీ మీ పార్టీ సిక్కులకు ధైర్యం చెప్పే పనికి పూనుకోలేదని ఆ విద్యార్థి అన్నాడు. ఇందుకు రాహుల్ విచిత్రమైన తీరులో స్పందించారు. కానీ ఈ విద్యార్థికి తెలుసో లేదో మరి! సిక్కుల ఊచకోత సమయంలోనే రాజీవ్ గాంధీ ఒక మాట అన్నారు. ఒక మహావృక్షం కూలితే అక్కడ భూమి కంపిస్తుంది, ఇది సహజం అని సెలవిచ్చారు.

ఏడు మాసాల క్రితమే అమెరికాలో పర్యటించిన రాహుల్ గాంధీ భారత్‌లో మైనారిటీలు భయాందోళనలతో బతుకుతున్నారని ఆరోపించి, బీజేపీని ఇరకాటంలో పెట్టానని అనుకున్నారు. కానీ సిక్కులలో కాంగ్రెస్ పార్టీ సృష్టించిన భయాందోళనల సంగతి ఏమిటి అంటూ ఇప్పుడు ఆయనకే ప్రశ్న ఎదురైంది. భారత్‌లో సిక్కులు భయాందోళనలకు గురి అవుతున్నారని నేను అనుకోవడం లేదని రాహుల్ చెప్పారు. తన వ్యాఖ్య, భారత్‌లో మైనారిటీలు భయంతో బతుకుతున్నారు అన్నదానిని సరిగా అర్థం చేసుకోలేదని, మైనారిటీలకు భయం లేని భారత్‌ను కోరుకుంటున్నానని మాత్రమే దాని అర్థమని భాష్యం చెప్పారాయన. కాంగ్రెస్‌లో తప్పిదాలు జరిగినప్పుడు తాను నాయకత్వ స్థానంలో లేనని అయినా ఆ తప్పులకు తాను బాధ్యత వహిస్తానని రాహుల్ వెల్లడించారు. 1980 దశకంలో జరిగింది ఘోర తప్పిదమేనని తాను గతంలోనే చెప్పానని కూడా రాహుల్ గుర్తు చేశారు. సైనిక చర్య జరిగినప్పటికీ తాను పలుసార్లు అమృత్‌సర్‌లోని స్వర్ణదేవాలయాన్ని సందర్శించానని, సిక్కులతో సత్సంబంధాలనే కలిగి ఉన్నానని రాహుల్ తెలియచేశారు. మరి అత్యవసర పరిస్థితి గురించి రాహుల్ చెబితే బాగుండును. ★





# రామమందిరంలో హనుమాన్ ఘుడి ప్రధాన పూజారి

అయోధ్యలోని ప్రఖ్యాత హనుమాన్ ఘుడి ప్రధాన పూజారి ప్రేమ్‌దాస్ అక్షయ తృతీయ రోజన రామాలయానికి వెళ్లి కొత్తగా ప్రతిష్ఠించిన రాములవారి దర్శనం చేసుకున్నారు. ఇందులో వింతేముందంటారా? ఉన్నది. దాదాపు 300 ఏళ్ల నుంచి అమలులో ఉన్న ఒక సంప్రదాయాన్ని ఆయన పక్కన పెట్టి రాముడిని దర్శించుకున్నారు మరి! అలా రాములవారిని దర్శించుకున్న హనుమాన్ ఘుడి తొలి అర్చకుడిగా చరిత్రలోకి ఎక్కారు. హనుమాన్ ఘుడి ప్రధాని పూజారిగా నియమితులైన వారు ఎవరైనా ఆ నియామకం తరువాత 52 బిఘాలలో ఉండే ఆ ఆలయం ప్రాంగణం నుంచి బయటకు రాకూడదు. ఇది ఆయన జీవితమంతా పాటించాలి. 18వ శతాబ్దంలో ప్రవేశపెట్టిన ఈ కఠిన ఆంక్ష కారణంగా, ఆయన కోర్టుకు రావడానికి కూడా మినహాయింపు ఉంది. హనుమాన్ ఘుడి ఆలయ ప్రధాన అర్చకులు ఏమయ్యారు అని కోర్టు ప్రశ్నించినప్పుడు ఈ సంప్రదాయం గురించి బయటపడింది. తాను జీవితంలో రామాలయాన్ని దర్శించాలని కోరుకున్నారు ప్రేమ్‌దాస్. దీనితో హనుమాన్ ఘుడీ ధర్మకర్తల మండలి ఏకగ్రీవంగా ఆమోదముద్ర వేసింది. ప్రేమ్‌దాస్ రాముల వారిని దర్శించుకోవడం సాధారణంగా ఉండదు. అదొక ఊరేగింపు. షాహీ జులుస్ అంటారు. అందులో ఏనుగులు, ఒంటెలు, గుర్రాలు కూడా ఉంటాయి. నాగసాధువులు, భక్తులు పాల్గొనే ఈ ఊరేగింపును సరయూ దాకా నిర్వహించిన తరువాత రాముల వారిని దర్శించుకున్నారు. ఘుడీ పూజారి ఆ ప్రదేశం వీడి రాకుండా ఉండే ఆచారం 1737లో ప్రవేశించిందని మరొక అర్చకుడు మహంత సంజయ్ దాస్ వెల్లడించారు.




వక్ఫ్ ఆస్తులు పాపం కంటే అన్యాయంగా ఎలా పెరిగి పోయాయో ఈ మధ్య కేంద్రం సుప్రీం కోర్టు ముందు ఉంచింది. ఏప్రిల్ 28న దాఖలు చేసిన ఈ నివేదిక చూస్తే నరాలు కట్ అవుతాయి. వక్ఫ్ సవరణ చట్టం అక్రమం, అన్యాయం, చట్టవిరుద్ధం, మైనారిటీలపై వివక్ష అంటూ ఎన్ని పదాలు దొరికితే అన్ని పదాలతో కేంద్రం మీద విమర్శలు గుప్పిస్తున్న వారు ఈ నివేదికతో కళ్లు తెరిస్తే మంచిది. కేంద్ర నిర్ణయాన్ని సవాలు చేస్తూ 120 పిటిషన్‌లు దాఖలయ్యాయి. దీనికి సమాధానంగా కేంద్రం ఇచ్చినదే ఈ నివేదిక.

2013 నుంచి కనుక పరిశీలిస్తే వక్ఫ్ ఆస్తులు దేశంలో 116 శాతం బలిశాయి. అన్నట్టు మొగలుల కాలంలో కూడా వక్ఫ్ ఆస్తులకు ఇంత వైభవం లేదు. అంటే కాంగ్రెస్, ఇతర సెక్యులర్ పార్టీలు వక్ఫ్ బోర్డుకు ఇంతటి వైభవాన్ని వందమైళ్ల వేగంతో కల్పించాయి. మొగల్ కాలంలోనే కాదు, స్వతంత్రం వచ్చిన వచ్చిన చాలా కాలం వరకు కూడా ఇన్ని ఆస్తులు వక్ఫ్ బోర్డులకు లేవు. ఆ తరువాత మాత్రం వక్ఫ్ అధీనంలోకి 18,29,163,896 ఎకరాలు చేరాయి. 2013 తరువాత యూపీఏ ప్రభుత్వం సవరణ చేసిన తరువాత అవి కాస్తా 20,92,072,536 ఎకరాలయి కూర్చున్నాయి. 2013లో వక్ఫ్ చట్టానికి యూపీఏ నాయకత్వంలోని ప్రభుత్వం సవరణ చేసిన తరువాత ఆ బోర్డు ఆస్తులు 116 శాతానికి చేరిపోవడం సుప్రీంకోర్టును కూడా ఆశ్చర్యపరిచి ఉండాలి.

2013లో ఢిల్లీ వక్ఫ్‌బోర్డుకు 9 ఆస్తులు ఉన్నాయి. అంతా కలిపి 0.03 ఎకరాలు. 2025 నాటికి ఆస్తులు 1,047కు పెరిగాయి. 28 ఎకరాల భూమి కూడా వచ్చింది.

జమ్ముకశ్మీర్‌లో 2013లో ఒక్కటంటే ఒక్కటే



మంత్రి



డ్రైవర్

# బస్ ఆపేసి నమాజ్ చేశాడు

ఏప్రిల్ 29న కర్ణాటక రోడ్ ట్రాన్స్‌పోర్ట్ ఉద్యోగి ఒక ఘనకార్యం చేశాడు. అసెంబ్లీ ప్రాంగణంలోనే జై పాకిస్తాన్ అని నినాదాలు చేసినా పట్టించుకోని ప్రభుత్వం తాను నమాజ్ చేస్తే ఏం చేస్తుందిలేనన్న ధీమా కాబోలు. హుబ్బళి నుంచి హావేరి వెళుతున్న బస్సులో డ్రైవర్–కండెక్టర్ వాహనాన్ని ఆపేసి నమాజ్ చేశాడు. దీనితో ఇతడిని ప్రభుత్వం సస్పెండ్ చేయవలసి వచ్చింది. ఇతడి నమాజ్ వల్ల బస్సు ఆలస్యంగా ప్రయాణించింది. ఇతడు బస్సు ఆపేసి, లోపలే ఒకచోట కూర్చుని నమాజ్ మొదలుపెట్టాడు. దీనితో ప్రయాణికులు తీవ్ర అసహనానికి గురి అయ్యారు. దీనితో అధికారులు ఈ విషయాన్ని వెంటనే రాష్ట్ర రవాణ శాఖ మంత్రి రామలింగారెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన వెంటనే దర్యాప్తు చేయించి కండెక్టర్–డ్రైవర్ సస్పెన్షన్‌కు ఆదేశాలు ఇచ్చారు.

# యూనస్ నోబెల్ వెనక్కి తీసుకోండి

బాంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ అధినేత మహమ్మద్ యూనస్ నోబెల్ బహుమతి గ్రహీత అని తెలిసిందే. బాంగ్లాదేశ్‌లో చిన్న మొత్తాలతో ఆర్థిక వ్యవస్థనే మార్చేశాడని ఆనాడు ఈయనకి నోబెల్ కమిటీ ఈ పురస్కారం ఇచ్చింది. ఇప్పుడు ఆయన చేస్తున్న నిర్వాకాలు నోబెల్ గ్రహీత స్థాయికి తగ్గట్టు లేవు కాబట్టి ఆ పురస్కారం వెనక్కి తీసుకోవాలని ప్రఖ్యాత బాంగ్లాదేశ్





రచయిత్రి, ప్రవాసంలోనే గడుపుతున్న తస్లీమా నస్రీన్ మే 1వ తేదీన నోబెల్ కమిటీకి ఒక లేఖ రాశారు. అసలు ఆయన గత కొన్నేళ్లుగా పన్నులే ఎగ్గొడుతున్నాడనీ, శాంతిని భగ్నం చేసి దేశ ఆర్థిక వ్యవస్థను కుంటుపరిచారని తస్లీమా ఆరోపించారు. బాంగ్లా విమోచన యోధుల కుటుంబాలకు కోటా అన్న అంశం మీద వివాదం చెలరేగి నిరుడు పెద్ద ఎత్తున అల్లర్లు రేగడం, దానితో షేక్ హసీనా భారతదేశానికి రావడం తెలిసిందే. తరువాత యూనస్ బాంగ్లాదేశ్‌ను తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టి వేశారని, రాజకీయ, ఆర్థిక, సామాజిక అలజడులతో అతలాకుతలం అవుతున్నదని తస్లీమా నోబెల్ కమిటీకి తెలియచేశారు. ఆయన గుండె నిండా పగ ప్రతీకారాలేనని అన్నారు. ఆయన వ్యవహార సరళి ఆటవికమని, అనాగరికమని ధ్వజమెత్తారు. విపక్షాలకు చెందిన వారిని ఆయన హత్య చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. శాంతిని నెలకొల్పాలన్న యోచన ఆయనకు ఏమాత్రం లేదని కూడా తస్లీమా తేల్చి చెప్పారు. ఈ తొమ్మిది మాసాలలో బాంగ్లాదేశ్ ఒక్కరోజు కూడా ప్రశాంతంగా లేదని ఆమె కమిటీకి తెలియచేశారు. అలాంటి వ్యక్తికి మీరు నోబెల్ వంటి పెద్ద పురస్కారం ఇచ్చారు కాబట్టి, ఇకనైనా దానిని వెనక్కి తీసుకుని, దాని పవిత్రతను కాపాడాలని తస్లీమా విజ్ఞప్తి చేశారు.

# వక్ఫ్ ఆస్తులు బలిసే క్రమం ఇది!

ఆస్తి. భూమి 0.42 ఎకరాలు. 2025 నాటికి అదేం మర్మం జరిగిపోయిందో మరి! ఆస్తులు 1 నుంచి 32,533కు చేరిపోయాయి. 31.4 ఎకరాల భూమి కూడా దఖలు పడింది.

పశ్చిమ బెంగాల్‌లో ముందు నుంచి వక్ఫ్ ఆస్తులు ఎక్కువగానే కనిపిస్తున్నాయి. అవి ఇంకా ఇంకా పెరిగిపోయాయి. 2013లో 17,946 ఉన్న ఆస్తులు 2025 నాటికి 80,808కి ఎగబాకాయి.

అండమాన్ నికోబార్ దీవులలోను వక్ఫ్ ఆస్తులు ఎగసి పడ్డాయి. 2013లో 35 మాత్రమే ఉన్న వక్ఫ్ బోర్డు ఆస్తులు 2025కి 151కి చేరుకున్నాయి.

మిగిలిన అన్ని చోట్లా సరే, మేఘాలయలో కూడా వక్ఫ్ బోర్డు అంతో ఇంతో ఆస్తులు పెంచుకుంది. ఇది కొంచెం ఆశ్చర్యమే. ఎందుకంటే అక్కడ క్రైస్తవులు 75 శాతం. హిందువులు 11 శాతం. స్థానిక వర్గాలు 9 శాతం. అక్కడ 2013లో 51గా ఉన్న వక్ఫ్ ఆస్తులు 58కి చేరుకున్నాయి.

రాజస్తాన్‌లో 12 ఏళ్లలో 7,769 అదనంగా ఆస్తులు జమకూడాయి. 2013 నాటికి వక్ఫ్ బోర్డు ఆస్తులు 23,126కు ఇవి అదనం. తమిళనాడులో 2013లో 43,623 ఆస్తులు ఉండేవి. వాటికి ఈ పన్నెండు సంవత్సరాలలో మరొక 22,469 కలిశాయి.

ఉత్తరప్రదేశ్‌లో వక్ఫ్ బోర్డులు బలిసిన తీరు మరీ విస్తుగొలుపుతోంది. 2013లో కేవలం 12,914 ఆస్తులు మాత్రమే ఆ రాష్ట్రంలో వక్ఫ్‌బోర్డులకు ఉన్నాయి. మరి 2025 నాటికి ఎన్ని? 2,17,161 ఆస్తులు. గుజరాత్‌లో ఇంత వేగంగా పుంజుకోలేదు పాపం. 2013లో 3,074 ఆస్తులు ఉండగా, 2025లో 39,940కి చేరాయి.

ఆంధ్రప్రదేశ్‌లో 2013 నాటికి వక్ఫ్ ఆస్తుల సంఖ్య 390. 2025 నాటికి అవి 14,685కి ఎగబాకాయి.

తెలంగాణలో 2013 నాటికి వక్ఫ్ ఆస్తులు సున్న. మరి ఇప్పుడో! ఆ ఆస్తులు 45,682.



# ఆక్రమిత కశ్మీర్‌లో మదర్సాలకు తాళాలు

పెహల్గావ్ దాడి తరువాత పాకిస్తాన్ వెన్నులో వణుకు సుస్పష్టం. అందులో భాగమే, ఆక్రమిత కశ్మీర్‌లో ఉన్న మదర్సాలకు పదిరోజులు సెలవు ప్రకటించింది. మదర్సాలకు సెలవులు ఇచ్చినట్టు మే 1న అధికారులు వెల్లడించారు. ఏ క్షణంలో అయినా భారత్ సైనికులు ఆక్రమిత కశ్మీర్‌పై దాడికి దిగవచ్చునన్న భయమే ఇందుకు కారణం. భారత్ త్వరలోనే సైనిక చర్యకు ఉపక్రమించవచ్చునన్న విశ్వసనీయ సమాచారం పాకిస్తాన్‌కు అందినట్టు కూడా అధికారులు చెబుతున్నారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ మత వ్యవహారాల మంత్రి హఫీజ్‌నాజిర్ కూడా ఇదే విషయం చెప్పారు. ముందస్తు జాగ్రత్తగానే మదర్సాలు మూసివేసినట్టు ఆక్రమిత కశ్మీర్ అధ్యక్ష భవనం కూడా ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇంతకీ పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో మదర్సాలు ఎన్ని ఉన్నట్టు? 445 రిజిస్టర్డ్ మదర్సాలు అక్కడ ఉన్నాయట. వీటిలో 26,000 మంది చదువుతున్నారట. కానీ అనధికారికి లెక్కల ప్రకారం ఆక్రమిత కశ్మీర్‌లో దాదాపు వేయి మదర్సాల మూతపడ్డాయి. పాకిస్తాన్‌లో నడిచే మత సంస్థలే ఈ మదర్సాలను నడుపుతున్నాయి. ఈ విషయాలన్నీ రాయిటర్స్ వార్త సంస్థ వెల్లడించింది.

# చిన్మయి కృష్ణదాస్‌కు బెయిల్



ఇస్కాన్ మాజీ గురువు చిన్మయి కృష్ణదాస్‌కు ఎట్టకేలకు బాంగ్లాదేశ్ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఆ దేశం నుంచి వెలువడే డెయిలీ స్టార్ పత్రిక ఈ విషయం ఏప్రిల్ 30న వెల్లడించింది. బాంగ్లాదేశ్‌లోని రంగపూర్‌లో కొందరు హిందువులు నిరసన ప్రదర్శన నిర్వహించినందుకు చిన్మయి కృష్ణదాస్‌ను ఆ దేశ ప్రభుత్వం అరెస్టు చేసింది. దేశంలోని మైనారిటీలకు రక్షణ కల్పించాలన్న డిమాండ్‌తోనే ఆ ప్రదర్శన జరిగింది. 2024 నవంబర్‌లో అప్పుడే కృష్ణదాస్‌ను అరెస్టు చేశారు.

# పెహల్గావ్ ఘటన మీద దర్యాప్తా?



జాతీయభావాలను అవమానించడం, భద్రతా దళాలను కించపరచడం దేశంలో రోజు రోజుకూ పెరుగుతున్నది. పెహల్గావ్‌లో ఏప్రిల్ 22న జరిగిన దుర్ఘటన మీద జుడిషియల్ దర్యాప్తు జరిపించాలంటూ సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలు కావడం ఇందుకు నిదర్శనం. అయితే ఈ పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం విచారణకు తిరస్కరించింది. ఇలాంటి పిటిషన్‌ల వల్ల ఉగ్రవాద శక్తులతో పోరాడుతున్న భద్రతాదళాల ఆత్మస్థయిర్యం దెబ్బతింటుందని కూడా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్ కోటేశ్వరసింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను తిరస్కరించింది. పదవీ విరమణ చేసిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి నాయకత్వంలో విచారణ సంఘాన్ని నియమించాలన్న పిటిషనర్ల వాదనను న్యాయమూర్తులు తప్పు పట్టారు. న్యాయమూర్తులంటే దర్యాప్తులో నిపుణులు కారని వారు వ్యాఖ్యానించారు. ఇంతకీ ఈ పిటిషన్‌ను కశ్మీర్‌కు చెందిన మహమ్మద్ జునైద్, ఫాతేశ్‌కుమార్ సాహు, వికీకుమార్ దాఖలు చేశారు. ఇలాంటి దౌర్భాగ్యులు దేశంలో చాలామందే ఉన్నారు. ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకునే ఒక వ్యాజ్యం దాఖలు చేసే ముందు బాగా ఆలోచించుకోవాలి అని న్యాయమూర్తులు చీవాట్లు పెట్టారు. మీకు దేశం పట్ల కొంత బాధ్యత ఉందన్న సంగతి విస్మరించవద్దని కూడా గడ్డి పెట్టారు. దేశం సంక్షోభంలో ఉన్నప్పుడు మీరు భద్రతాదళాల ఆత్మ స్థయిర్యాన్ని దిగజార్చడానికి ప్రయత్నిస్తున్న సంగతి గుర్తెరగవలసినదని కాస్త గట్టిగానే తలంటింది. ఇంతకీ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టుల న్యాయమూర్తులు దర్యాప్తు అధికారులుగా ఎప్పుడు మారారో చెబుతారా అంటూ పిటిషన్ వేసిన వ్యక్తులను అత్యున్నత న్యాయస్థానం నిలదీసింది. మేం వచ్చిన వివాదాల మీద తుది నిర్ణయం మాత్రమే చేస్తాం, దర్యాప్తు చేయమంటూ సుప్రీంకోర్టు న్యాయమూర్తులను ఆదేశించకండి అని కూడా హెచ్చరించింది. ఉగ్రవాదంతో పోరుకు భారత్ చేయూతనిస్తున్న సమయమిది అన్న ఇంగిత జ్ఞానం ఉండాలని కూడా వ్యాఖ్యానించింది. ఆఖరికి ఈ పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి మాత్రం కోర్టు అంగీకరించింది.

# 22 మంది వచ్చారు, 95 మంది అయ్యారు




కలుగులో ఎలకల్లా భారత్‌లో దశాబ్దాలుగా తిష్ట వేసిన పాకిస్తానీల నిర్వాకాలు వెల్లడవుతున్నాయి. అవి విభ్రాంతి గొలిపేవిగా కూడా ఉన్నాయి. మొరాదాబాద్ (యూపీ)లో బయటపడిన వీళ్ల సంగతే చూడండి. 22 మంది మహిళలు ఇక్కడి వాళ్లని పెళ్లి చేసుకుని పాకిస్తాన్ నుంచి దఫదఫాలుగా వచ్చారు. ఇక్కడ పిల్లల్ని కన్నారు. ఆ పిల్లలు కూడా పిల్లల్ని కన్నారు. ఇప్పుడు అంతా కలిపి 95 మంది. వీళ్లందరికి పాకిస్తాన్‌లో బంధుగణం ఉంది. వీళ్లకి ఆధార్ కార్డులు వచ్చాయి. ఓటర్లయ్యారు. అయినా వాళ్లవి తాత్కాలిక వీసాలే కావడం గమనార్హం. ఆ 22 మందిలో ఇద్దరు నాలుగేళ్ల క్రితమే వచ్చారు. ఇలా వీళ్ల పరివారం ప్రస్తుతం 500 వరకు చేరింది. జాగరణ్ కామ్ ఈ విషయాలు వెల్లడించింది. ఇద్దరు పురుషులు, 22 మంది మహిళల నేపథ్యం పెహల్గావ్ దాడి నేపథ్యంలో అధికారులు కూపీ లాగారు.మహిళలకి భారత పౌరసత్వం మాత్రం లేదు. పిల్లలకి మాత్రం భారత పౌరసత్వం వచ్చింది. యోగి వంటి ముఖ్యమంత్రి పాలిస్తున్న ఉత్తరప్రదేశ్‌లోనే ఇలాంటివి జరిగిపోతే, ఇక మిగిలిన రాష్ట్రాల సంగతి ఏమిటి? ఆ వాస్తవాలు వింటే గుండె పగిలిపోతుందేమో!

# పాక్‌కు కాంగ్రెస్ ఎంపీ రహస్య యాత్ర



అస్సాంకు చెందిన లోక్‌సభ సభ్యుడు గౌరవ్ గొగొయ్ భారత ప్రభుత్వానికి తెలియకుండా 15 రోజులు పాకిస్తాన్‌లో ఉండి వచ్చాడని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ ఆరోపించారు. ఈ ఆరోపణలకు తాను బాధ్యత వహిస్తానని కూడా ఆయన చెప్పారు. అసలు గొగొయ్ సంతానం విదేశీయులని కూడా శర్మ ఆరోపించారు. అక్కడ వారికి పౌరసత్వం కూడా లభించిందని చెప్పారాయన. ఇవి మచ్చుకు చెబుతున్న మాటలని, మరిన్ని రహస్యాలు ఉన్నాయని కూడా శర్మ వెల్లడించారు. గొగొయ్ విషయంలో ఇంతకు ముందే ప్రత్యేక దర్యాప్తు బృందం ముఖ్యమైన ఆధారం కనుగొన్నదని చెప్పారు. గొగొయ్ లోక్‌సభలో కాంగ్రెస్ సభ్యుడు. అలాగే మాజీ ముఖ్యమంత్రి కొడుకు. అలాంటి వ్యక్తి అటారీ సరిహద్దుల గుండా పాకిస్తాన్ వెళ్లి 15 రోజులు ఉండి వచ్చారని శర్మ వెల్లడించారు. గౌరవ్ గొగొయ్ కొడుకు, కూతురు కూడా భారత పౌరులు కారని తాను కచ్చితంగా చెప్పగలనని ముఖ్యమంత్రి చెప్పారు. గొగొయ్ 15 రోజులు ఆ దేశంలో ఏం చేశారు? అదేమీ విహార యాత్రా స్థలం కూడా కాదు. అదొక ఉగ్రవాద అడ్డా మాత్రమే. అలాంటి చోటికి గొగొయ్ వెళ్లివచ్చారు. అన్ని రోజులు అక్కడ ఏం చేశారు? గొగొయ్, వాద్రాలు భారత్ గురించి కంటే పాకిస్తాన్ గురించి ఎక్కువ బాధ పడుతున్నారని హిమంత విమర్శించారు. గొగొయ్‌కి ఒక ప్రశ్న కూడా శర్మ సంధించారు. గొగొయ్ భార్య భారతదేశంలో ఉద్యోగం చేస్తున్నప్పటికీ, పాకిస్తాన్ ఎన్‌జీవో నుంచి ఎందుకు వేతనం తీసుకుంటున్నదని ఆయన ప్రశ్నించారు. అలాగే గొగొయ్ భార్య భారత పౌరసత్వం కోసం దరఖాస్తు కూడా చేయలేదని చెప్పారు. ఆమెకు పాకిస్తాన్ సంస్థ ఎందుకు వేతనం చెల్లిస్తున్నదో చెప్పాలని నిలదీశారు.

# పాక్ భక్తులు ఎందరో!



భారతదేశంలో, అందునా ఉత్తరప్రదేశ్‌లో ఇంతటి పాకిస్తాన్ భక్తులు ఉన్నారా? ఉన్నారని చెప్పక తప్పడం లేదు. ఆ రాష్ట్రంలోని షహరన్ పూర్‌లో ఒక హైస్కూలు బాలిక ప్రదర్శించిన చేష్ట ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. క్లాస్ 11 చదువుతున్న ఒక బాలిక స్కూటీ మీద ఇంటికి వెళుతుండగా రోడ్డు మీద పాకిస్తాన్ జెండాలు అతికించి ఉండడం గమనించింది. వెంటనే స్కూటీ ఆపి ఆ జెండాలను తొలగించే ప్రయత్నం చేసింది. పెహల్గావ్‌లో ఉగ్రవాద దాడికి నిరసనగా కొందరు పాకిస్తాన్ జెండాల నమూనాలను అలా రోడ్డు మీద అతికించారు. ఈ దృశ్యం వైరల్ కాగానే కొందరు ఆమె చదువుతున్న పాఠశాలకు వెళ్లి బహిష్కరించవలసిందిగా కోరారు. స్కూలు యాజమాన్యం వెంటనే ఆమెను బహిష్కరించింది.



# వీళ్లోరకం

పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర పరగణాల జిల్లా, అకాయ్‌పురా రైల్వే స్టేషన్ పాయఖానాలో ఇద్దరు పాకిస్తాన్ నమూనా జెండాలను అతికించారు. దీనితో ఆ ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. అందులో ఒకడిపేరు చందన్ మాలాకర్ (30), మరొకడి పేరు ప్రగ్యాజిత్ మొండల్ (45). అర్థమైంది కదా, ఈ ఇద్దరు హిందువులే అయి ఉండాలి. సనాతనీ ఏక్తా మోర్చా అనే సంస్థలో పనిచేస్తారు. ఏప్రిల్ 30న ఆ ఇద్దరు ఆ జెండాలను అతికించి పోలీసులకు దొరికారు. ఆ ప్రాంతంలో మత కల్లోలాలు రేపడానికి భారత్ ముర్దాబాద్, పాకిస్తాన్ జిందాబాద్ నినాదాలతో ఆ జెండాలు అతికించారు. ఇదీ ఓ రకం ఉగ్రవాదమే.

## కథ

“నాలుగు నాటు కోడి గుడ్లు ఉంటే ఇస్తావా నారాయణక్కా?” అని అడిగినాడు ఆదిరాజు.

“నాలుగు లేవు ఆదిరాజూ...రెండు ఉండాయి. ఇచ్చేదా!”

“మన పుత్తూరు కట్టు గట్టిగా అతుక్కోవాలంటే నాటుగుడ్లు అయితే బాగుంటుంది కదక్కా!”

“ఇప్పుడు మన ఊర్లో నాటు కోడిగుడ్లు ఎక్కడ దొరకతా ఉండాయి, అందరూ పౌల్ట్రీ ఫారం గుడ్లనే కదా వాడతా ఉండారు”.

“నిజమే అనుకో అక్కా. దొరికితే తీసుకెల్దామని.

మద్రాసు సిటీ ‘ఆవడి’లో ఒకాయనకు తొడకి కట్టు కట్టాలి. నాటు గుడ్లు దొరికితే బాగుణ్ణని అడిగినాను” అంటూ డబ్బులిచ్చి రెండు గుడ్లు తీసుకుని భద్రంగా ఇంటికి తీసుకెళ్లినాడు ఆదిరాజు.

అప్పటికే...

భార్య సంపూర్ణక్క బ్యాగు సర్దుతూ ఉంది.

పాత తెల్ల కాటన్ పంచె, దూది, సున్నం, పసుపు డబ్బాలు అందులో పెట్టి ఉంది.

కట్టు కట్టడానికి అవసరమైన వెదురు దబ్బల మూటను అటక మీది నుంచి దించినాడు.

ముందురోజే ‘మాతంగుడు’ వెదురు కొయ్యలను నిలువునా చెక్కి మూర కొలతతో దబ్బలు చెక్కి ఉన్నాడు. చూడటానికి అవి అచ్చం స్కేళ్లు మాదిరి ఉన్నాయి.

‘ఎంత నైపుణ్యం ఈ మాతంగుడికి?’ అని మెచ్చుకున్నాడు. వాటిలో కొన్ని మంచి దబ్బలను ఏరినాడు.

కట్టుకు అవసరమైన ఆకు పసరు ఉందో లేదోనని స్టీలు క్యారియర్ తెరిచి చూసినాడు. కొంచెమే కనిపించింది.

“సంపూర్ణా...ఆకు పసరు అయిపోయి ఉంది. కొంచెంసేపు ఉండు. ముగ్గురాళ్లమిట్ట కాడికి పోయి ఆకు కోసుకుని వస్తాను” అని చెప్పి సరసరా వెళ్లినాడు.

ముగ్గురాళ్లు పరిచినట్లుగా ఉన్న నేల అది. కంపచెట్లు దట్టంగా ఉన్నాయి.

కటవ పక్కన పచ్చటి ఆకు పసరు చెట్లు నవ్వుతూ పలకరించాయి.

చెయ్యి పెట్టబోయాడు.

ఏదో కదలాడిన శబ్దం. ఉలిక్కిపడినాడు. పెద్ద పసిరిక పాము.... ఆకుపచ్చ రంగులో ఉండటం వల్ల గమనించలేదు. దొరికిన కర్రతో దాన్ని తరిమినాడు. అది సరసరా ఆకులమీదనే ఎగబాకుతూ వెళ్లిపోయింది.

‘హమ్మయ్య’ అని గాలి పీల్చుకున్నాడు.

‘చిత్తూరు జిల్లా, పుత్తూరు కట్టు అంటే చాలామంది... పేలికలు చుట్టి పైసలు దండిగా సంపాదిస్తా ఉండారని అనుకుంటారు. పడిలేస్తే కదా కష్టనష్టాలు తెలిసేది!’ అనుకుంటూ కావలసినన్ని



# పుత్తూరు కట్టు

ఆర్.సి. కృష్ణస్వామిరాజు



ఆకులు కోసి సంచిలో వేసుకున్నాడు.

రెండు ఫర్లాంగుల దూరంలోని ఇంటికి మూడు నిమిషాల్లో నడిచినాడు.

భార్య చేతికి ఆకులిచ్చి సన్నికల్లు రాయి మీద బాగా నూరమని స్నానానికి వెళ్లాడు..

స్నానం చేసి గోడ గడియారం వైపు చూశాడు.

గంట పదవుతోంది.

దేవుని గదిలోకి వెళ్లి పుత్తూరు వైద్యం కనుగొన్న 'పెద్దరాజు' గారికి మనసులోనే కృతజ్ఞతలు తెలిపాడు.

పుత్తూరు గుండా మద్రాసు వెళ్లే సప్తగిరి రైలు వచ్చే టైం అయ్యిందని కావల్సినవన్నీ గబగబా సర్దుకున్నాడు.

"ఏమండీ...నాలుగు ఇడ్లీలు తినిపోరాదా!" అడిగింది సంపూర్ణక్క.

"నేనిక్కడ తింటా కూర్చుంటే రైలు నాకోసం స్టేషన్‌లోనే ఉంటుందా?" అంటూ కుడి చెప్పు, ఎడమ కాలుకి, ఎడమ చెప్పు కుడి కాలికి తగిలించుకుని అడుగులేయ బోయాడు.

"చెప్పులన్నా సరిగ్గా వేసుకోండి!" అని చెప్పే సరికి పడిపోతున్నవాడల్లా టక్కున జాగ్రత్తపడి చెప్పులు సరిగ్గా వేసుకుని పరుగులు తీసినాడు.

* * *

చల్లగా గాలి వీస్తోంది.

రైల్లో కిటికీ పక్కన కూర్చుని పచ్చటి పొలాలు చూస్తున్నాడు ఆదిరాజు.

'నన్ను పట్టించుకోలేదేమి?' అని పొట్టలోని పేగులు ప్రశ్నించాయి.

'రైల్లో దొరికే తిండి తినే మనిషి కాకపాయె...' సంచిలోని నీళ్ల సీసా తీసి గుటగుట తాగి పొట్ట పేగుల్ని శాంతింపజేసినాడు.

సీసాను సంచిలో పెడుతూ ఉంటే... కుడి చేయి మీది పెద్ద గాటు కనిపించింది.

పదేళ్ల క్రితం జరిగిన సంఘటన గుర్తుకొచ్చింది.

* * *

సాయంత్రం ఏడు గంటలయ్యింది.

హాల్ లో కూర్చుని టీవీ చూస్తున్నాడు ఆదిరాజు.

'ట్రింగ్ ట్రింగ్' మని ఫోన్ మోగింది.

లేచి ఫోన్ అందుకున్నాడు.

"సార్...సార్... మాది గాజుల మండ్యం షుగర్ ఫ్యాక్టరీ పక్కన సూరప్పకశం గ్రామం. మా అన్న పొలం కాడ జారి పడినాడు. మీరు వచ్చి కట్టుకట్టాలి సార్"

"రేపు ఉదయం వచ్చి కడుతాలే! ఇంతరాత్రిలో బస్సు పట్టుకుని ఇరవై మైళ్లు రాలేను!" అని చెప్పి ఫోన్ పెట్ట బోయాడు.

"సార్. ఈరోజైతే నేను ఊర్లో ఉంటాను. కట్టు కట్టడానికి సహాయ కారిగా ఉంటాను. రేపు అర్జెంటు పని మీద నెల్లూరు వెళ్లాల్సి ఉంది. దయచేసి రాగలరు. మీరు గాజులమండ్యంకి బస్సు ద్వారా చేరుకున్నారంటే నేను మిమ్మల్ని మోటార్ సైకిల్‌పై మా ఊరికి తీసుకుపోగలను. దయచేసి.. రానని చెప్పకండి సార్" అని ప్రాధేయపడుతున్నాడు.

పక్కనే ఉన్న భార్య సంపూర్ణక్క "వెళ్లి రండి.. పాపం...వాళ్లు ఎన్ని కష్టాల్లో ఉన్నారో!" అని చెప్పింది.

"సరే వస్తా!" అని చెప్పి బ్యాగు సర్దుకుని రోడ్డు పైకి వెళ్లి బస్సు ఎక్కాడు.

అర్ధగంటలో గాజులమండ్యం చేరిపోయాడు.

ఫోన్ చేసిన అబ్బాయి బండి పెట్టుకుని సిద్ధంగా ఉన్నాడు.

ఆ అబ్బాయి వెనుక కూర్చున్నాడు.

బండి పొలాల గట్ల మీద సర్రున పోతోంది.

అమావాస్య ముందు రోజు కాబట్టి బాగా చీకటిగా ఉంది.

ఇంతలో...గబుక్కున బండి బ్రేకులు పడ్డాయి.

"ఏమైంది బాబూ?" అని అడిగాడు.

"పంక్చర్ లాగుంది కొంచెం దిగండి!" అన్నాడు.

అతడు టైరు చెక్ చేస్తూ ఉంటే ఆదిరాజు దూరంగా ఉన్న శేషాచలం కొండల వైపు చూస్తూ ఉన్నాడు.

ఎవరో...గొంతు చుట్టూ గుడ్డతో బిగిస్తున్నట్లు అనిపిస్తే వెనక్కి తిరిగాడు.

దాడి చేస్తున్నది మోటార్ సైకిల్ కుర్రాడు.

వాడిని గట్టిగా విదిలించి కింద పడేశాడు

సరుక్కున కత్తి పైకి తీశాడు కుర్రాడు.

మెడలోని చైను, చేతి ఉంగరాలు తీసి ఇమ్మన్నాడు.

చైను సులభంగా వచ్చేసింది. అయితే వేలి ఉంగరం ఒక పట్టాన రాలేదు.

"ఎంతసేపు?" అంటూ ఆ కుర్రాడు కత్తితో చేతి మీద పొడిచాడు.

బెదిరిపోయాడు ఆదిరాజు

బలవంతంగా ఉంగరాన్ని లాగి అతడి చేతిలో పెట్టాడు.

అంతే... ఆ కుర్రాడు బండి స్టార్ట్ చేసి వేగంగా చీకటిలో కలిసిపోయాడు.

కళ్లు తిరిగి పడిపోయాడు ఆదిరాజు.

దారిలో వస్తున్న ఆటో డ్రైవర్ పోలీస్ స్టేషన్‌కి చేర్చాడు.

కేసు రాసుకుని ట్రీట్‌మెంట్ కోసం ఆదిరాజును హాస్పిటల్‌కి పంపిస్తూ ఎస్.ఐ "అలా ఎవరంటే వాళ్లు ఏ వేళంటే ఆ వేళ పిలిస్తే వెళ్లిపోవడమేనా?" అని అడిగాడు.

"మా వృత్తే అంత సార్. రోగి ఏ ఇబ్బందిలో ఉన్నాడోనని పరుగులు తీస్తాం. వైద్యం పేరు చెప్పి ఇలా దొంగతనం చేస్తారని ఊహించలేము కదా" అని సమాధానమిచ్చాడు.

'ఏండ్లు గడిచినా దొంగా దొరకలేదు, బంగారమూ దొరకలేదు. గాయం మాత్రం మిగిలింది' అని అనుకుంటూ అలాగే.. నిద్రపోయాడు.

* * *

మద్రాసు సెంట్రల్ స్టేషన్ వచ్చింది.

చిన్నగా అడ్రెస్ పట్టుకుని ఆవడి వెళ్లాడు.

ఇంటి గుమ్మం ముందర నిలుచుని ఉన్న సుగంధి నమస్కారం చెప్పి లోపలికి తీసుకెళ్లింది.

మంచంపైన పడుకుని ఉన్న పడవట్టన్ మెల్లగా లేచి కూర్చున్నాడు.

మూడు రోజులముందు పని చూసుకుని వస్తూ ఉంటే వేగంగా వచ్చిన మోటార్ సైకిల్ గుద్దుకుని కింద పడిపోయానని, దెబ్బ తగిలిందనీ చెప్పాడు.

"ఏమీ కాదు. మేము చేసేది ప్రకృతి వైద్యం. తక్కువ ఖర్చు, శ్రమలతో మీరు ఆరోగ్యవంతులవుతారు. మొత్తం మూడు కట్లు కట్టించుకోండి. కదలకుండా చూసుకోండి. అంతే..." అని ధైర్యం చెప్పాడు.

చెప్పులు తీసి పక్కన పెట్టి వైద్యానికి ఉపక్రమించాడు.

"మా ఇంట్లో చెప్పులు వేసుకోవచ్చు!" తమిళ భాషలో చెప్పింది సుగంధి.

"ఈ వృత్తి నాకు దైవం. వైద్యం చేసేటప్పుడు నేను చెప్పులు వేసుకోను!" అన్నాడు.

భార్యాభర్తలిద్దరూ ఆశ్చర్యంగా చూశారు.

బల్లని దగ్గరిగా జరిపి దానిపైన ఆకు పసరు, గుడ్డ, పాత పంచె, దూది, వెదురు దబ్బలు,చిన్న కత్తెర, పసుపు,సున్నం డబ్బాలు పెట్టాడు.

చిన్నగా అదీ ఇదీ మాట్లాడుతూ టక్కుమని తొడని చేత్తోనే సరిచేశాడు.

'అబ్బా' అని అరిచాడు పడవట్టన్.

"ట్రీట్‌మెంట్ అయిపోవచ్చింది..." అంటూ తొడ మీద ఆకు, గుడ్డు తెల్ల సొన కలిపి పూశాడు. దానిపైన దూది పరిచి సున్నం, పసుపు రాసాడు. దానిపైన వెదురు దబ్బలు పెట్టి పంచెను పేలికలుగా చించి చుట్టసాగాడు.

కన్నార్పకుండా చూస్తున్న సుగంధి "మీకు ఈ వైద్యం ఎలా అబ్బింది?" అని అడిగింది.

> మంచంపైన పడుకుని ఉన్న పడవట్టన్ మెల్లగా లేచి కూర్చున్నాడు. మూడు రోజులముందు పని చూసుకుని వస్తూ ఉంటే వేగంగా వచ్చిన మోటార్ సైకిల్ గుద్దుకుని కింద పడిపోయానని, దెబ్బ తగిలిందనీ చెప్పాడు. "ఏమీ కాదు. మేము చేసేది ప్రకృతి వైద్యం. తక్కువ ఖర్చు, శ్రమలతో మీరు ఆరోగ్యవంతులవుతారు. మొత్తం మూడు కట్లు కట్టించుకోండి. కదలకుండా చూసుకోండి. అంతే... ధైర్యం చెప్పాడు.



"ఇది మేము కనిపెట్టింది కాదు. మా పూర్వీకులు పశువులను తోలుకుని అడవికి వెళ్లేవారు. ఒకరోజు చిన్న దూడకు గాయమయ్యింది. అప్పటికప్పుడు ఏమి చేయాలో తెలియక, పక్కనున్న ఆకుల్ని కోసి ఆ దూడను దానిలో పెట్టుకుని ఇంటికి వచ్చేశారు. వైద్యం చేయించాలని రెండుమూడు రోజులు వైద్యుడి కోసం వెదికారు. సాధ్యం కాలేదు. జాగ్రత్తగా గమనించిన వారికి దూడకి గాయమైన చోట అతుక్కోవడం కనిపించింది. ఆశ్చర్యపోయారు. చిన్నగా మొదట పశువులకు, తర్వాత మనుషులకు ఈ ఆకుపసరు వైద్యం ప్రారంభించారు".

ఆసక్తిగా విన్న ఆమె వేడివేడి ఫిల్టర్ కాఫీ ఇచ్చింది.

తృప్తిగా తాగాడు.

పదిహేనవ రోజున వస్తానని చెప్పాడు.

ఆమె క్యాలెండర్ చూస్తూ "ఆరోజు భోగి పండుగ!" అని చెప్పింది.

"అయినా వస్తాను. మాకు పండుగలు, ఆదివారాలు అంటూ సెలవులు ప్రత్యేకంగా ఉండవు" అని చెప్పాడు. తీసుకోవల్సిన జాగ్రత్తలు, కాళ్లకు వాడవలసిన తైలం గురించి తెలియజేశాడు.

సుగంధి అయిదువందలు చేతిలో పెడుతూ "మీరు వైద్యం చేసే ఆకు పేరేమి సార్!" అని అడిగింది.

నవ్వుతూ "అది చిదంబర రహస్యం" అన్నాడు.

"పోనీ..ఆకు ఎలా ఉంటుంది సార్!" అని అడిగింది.

నవ్వుతూ "ఏమి చేసుకుంటావమ్మా ఆ ఆకుతో?" అంటూ ఆ ఆకు ఎలా ఉంటుందో చెప్పి బయలుదేరాడు.

రెండవ కట్టు రోజు–

చల్లటి ఏసీ గాలి మెల్లమెల్లగా వస్తోంది.

సుగంధి "సార్, మీ వైద్యాన్ని పెద్దపెద్దవాళ్లు తీసుకున్నారట కదా" అని అడిగింది.

ఆదిరాజు గర్వంగా "ఎన్టీయార్, కృష్ణంరాజు, చంద్రమోహన్, చలం, హలం, గిరిబాబు లాంటి సినీనటులు, భారత రాష్ట్రపతులు వి.వి.గిరి, నీలం సంజీవరెడ్డి లాంటి మహామహులు కూడా వైద్యం తీసుకున్నారు" అని చెప్పాడు.

"అలాగా!" అని ఆశ్చర్యపోయింది సుగంధి.

"సార్..ఏమీ అనుకోకపోతే మిమ్మల్ని వీడియో తీసుకోవచ్చా?" అని అడిగింది.

"బంగారంగా!" అన్నాడు ఆదిరాజు.

"ఒక్క నిమిషం!" అని చెప్పి పక్కనే ఉన్న దువ్వెనతో తల, మీసాలు దువ్వుకున్నాడు పడవట్టన్. తను కట్టిన తెల్లపంచె, తెల్ల జుబ్బా సర్దుకున్నాడు.

కట్టు కడుతున్నంతసేపూ వీడియో తీసింది సుగంధి.

మూడవ కట్టు కట్టే రోజు–

"ఇది చివరి కట్టు. పదిరోజుల తర్వాత కట్టు విప్పివేయవచ్చు. అన్ని పనులూ చేసుకోవచ్చు" అంటూ కొన్ని చిన్నచిన్న ఎక్సర్‌సైజ్ లు నేర్పించాడు.

భార్యాభర్తలిద్దరూ చేతులెత్తి నమస్కరించారు. కాలు బాగవుతున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ఆదిరాజుకు తిరునల్వేలి హల్వా తినిపించారు. తెల్లపంచె, తెల్ల తువ్వాలు బహుమతిగా ఇచ్చారు.

కుషీ అయినాడు ఆదిరాజు.

* * *

వారాలు గడిచాయి. నెలలు జరిగాయి. నాలుగు సంవత్సరాలు నడిచాయి.

కూతురు కస్తూరికి అన్నా యూనివర్సిటీలో

**'కార్టూన్ పోటీ-2025'లో సాధారణ ప్రచురణకు ఎంపికైనది**



ఇంజినీరింగ్ సీటు వచ్చిందని బాదుగ కారులో బయలుదేరాడు ఆదిరాజు. ముందు సీటులో తను, వెనుక సీటులో భార్య, కూతురు కూర్చున్నారు.

కారు ఆవడి గుండా వెళ్తోంది.

'పచ్చి అమ్మాన్ కోయిల్' సిగ్నల్ వద్ద ఆగింది.

"నాన్నా...మన పుత్తూరు కట్టు" అని గట్టిగా అరిచింది కూతురు కస్తూరి.

"అవునా..ఎక్కడ?

"మన ఊరి వాళ్లు ఏమైనా ఇక్కడ క్యాంపు పెట్టారేమో..." అంటూ తల తిప్పి చూశాడు.

పెద్ద బోర్డులో 'పురాతన పుత్తూరు వైద్యం ఇప్పుడు మన ఆవడిలో...' అని అరవంలో, తెలుగులో, ఇంగ్లీషులో రాసి ఉంది. దాని కింద వరుసగా.... ఎర్ర అక్షరాలతో 24X7 వైద్యసేవలు, వందకి వంద శాతం విజయవంతమైన వైద్యం... అని కూడా ఉంది.

అందులోనే కట్టు కట్టుకున్న ఒక కుర్రాడి పెద్ద ఫోటో పెట్టి దాని పక్కన 'పుత్తూరు కట్టు' అని పెద్ద అక్షరాలు ఉన్నాయి.

'ఎవరబ్బా మనకి తెలియకుండా ఇక్కడ, మన వైద్యం చేసే వాళ్లు..' అనుకుంటూ కారు పక్కకి నిలబెట్టించాడు ఆదిరాజు.

ముందు గదిలో అందమైన రిసెప్షనిస్ట్ కూర్చుని ఉంది.

ఏసీ గాలులకు చలి వేసింది ఆదిరాజుకు.

"మీకు మేము ఎలా సాయపడగలము?" చిరునవ్వులు చిందిస్తూ అడిగింది ఆమె.

హాస్పిటల్ అంతా తల తిప్పి చూస్తూ ఉన్న ఆదిరాజుతో ఆమె "ఇంటికి వచ్చి కూడా సేవలు అందించగలం. పేరు రిజిస్టర్ చేసుకోండి. రిజిస్ట్రేషన్ ఫీజు అయిదు వందలు. మిగిలిన ఫీజు కేసును బట్టి డాక్టరు చెబుతారు " అని వివరించింది.

లోపలి గదిలో ఎవరికో వైద్యం అందిస్తున్నాడు డాక్టర్.

చిన్నగా అద్దానికి అడ్డంగా ఉన్న స్క్రీన్ తొలగించి చూశాడు.

డాక్టర్ పడవట్టన్ కట్టు కడుతున్నాడు. సుగంధి పక్కనే ఉండి సహాయం చేస్తూ ఉంది.

'అంటే...మన దగ్గర వైద్యం తీసుకున్న వ్యక్తి ఇప్పుడు వైద్యుడు అయిపోయాడన్నమాట'.

తలని ఐసుగడ్డల్లో పెట్టినట్లయ్యింది.

చిన్నగా అక్కడినుంచి కదిలి కారు ఎక్కి కూర్చున్నాడు.

వెనుకనే రిసెప్షనిస్ట్ గట్టిగా అరుస్తోంది "మీరు ఇదే వైద్యానికి పుత్తూరు వెళ్లి రావాలంటే రానూపోనూ ఎంతో ఖర్చు, శ్రమ ఉంటుంది. రండి...రిజిస్ట్రేషన్ చేసుకోండి"

కారు వేగం పెరిగింది.

'సినిమాలు, వస్తువులు కాపీ కొట్టడం చూశాము. వైద్యాన్ని కూడా కాపీ కొడుతారా...?

వస్తువులన్నీ నకిలీలు వస్తున్నాయని తెలుసు. ఇప్పుడు వైద్యం కూడా నకిలీ వస్తువు అయిపోయిందా... మేము ఎన్నో ఏళ్లుగా ఆ వైద్యం పైనే కృషి చేస్తూ రేయింబవళ్లూ రోగులకు సేవలందిస్తున్నామే...ఆ వైద్యంపై పూర్తి అవగాహన లేకుండా ఎవరంటే వాళ్లు ఇలా వైద్యం ప్రారంభిస్తే...రోగుల పరిస్థితి ఏమిటి?' ఆదిరాజు మనసు బాధగా మూలిగింది.

కారు స్టీరింగ్ ముందరి లాఫింగ్ బుద్ధుడి బొమ్మ అటూఇటూ ఊగుతోంది.

వచ్చేవారం కథ..

**సంధ్యా సమయం**

– గోపరాజు వెంకట సూర్యనారాయణ













తెలుగు కథా రచయితల్లో ద్వితీయుడైనా, అద్వితీయుడైన కథా రచయిత శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి. గురజాడతో ఆరంభమైన కథానిక రచనను సుసంపన్నం చేసిన విశిష్ట రచయిత శ్రీపాద. తనదైన శైలిలో గురజాడ, గిడుగుల ప్రభావంతో వాడుక భాషలో రాసి మెప్పు పొందిన కథక చక్రవర్తి. బహుముఖ ప్రజ్ఞతో నాటకం, నాటిక, నవల, విమర్శ, స్వీయచరిత్ర వంటి ప్రక్రియలన్నింటినీ స్పృశించినా, కథారచయితగా సుప్రసిద్ధులయ్యారు.

తొలి రచనగా మంత్రిప్రెగడ భుజంగరావు 'వారకాంత' చాటు ప్రబంధాన్ని నాటకీకరించి మల్లాడి సత్తిరెడ్డి ఆర్థికసాయంతో 1909లో అచ్చు వేశారు. 'రాజరాజు', 'కలంపోటు', 'టీ పార్టీ' వంటి నాటికలు రాశారు. గ్రాంథికవాదులైన విక్రమదేవవర్మ 'రాజరాజు' నాటకాన్ని అంకితం తీసుకున్నారు. విశ్వనాథ సత్యనారాయణ 'రాజరాజు' నాటక విశిష్టతను ప్రశంసిస్తూ

# అక్షరాల మీద

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి (ఏప్రిల్ 23, 1891– ఫిబ్రవరి 25,1961) రామచంద్రాపురం తాలూకా పాలమూరు గ్రామంలో జన్మించారు. తెలుగు కవిత్వం, సాహిత్యం అంటే గిట్టని కుటుంబ వాతావరణం. శ్రౌత స్మార్తాలు, జ్యోతిష్యం వారి కుల విద్యలు. కుటుంబ వాతావరణానికి అనుకూలంగా శ్రీపాద సంస్కృత పంచకావ్యాల్లో రఘువంశం, కుమార సంభవం, మేఘసందేశం చదువుకున్నారు. తెలుగు సాహిత్యం చదువుకోవాలన్న కోరిక బలీయంగా ఉన్నా, కుల విద్యలకు ఆటంకమని తండ్రి, చిన్నన్నలు అడ్డుకున్నారు. గురువులు, పెద్దల కంట పడకుండా 'వీరేశలింగం కవుల చరిత్ర' మూడోభాగం, పోలూరి వెంకట కృష్ణయ్యగారి 'రోహిణీ సుధాకరం' నాటకం మొదట చదివారు. శ్రీపాద మొత్తం 75 చిన్న కథలు రాశారు. ఇంకా చారిత్రక, జానపద కథలు రాశారు.

శ్రీపాద 'కథానిక'ను చిన్నకథగానే భావించేవారు. వారి ఉద్దేశంలో చిన్నకథ రాయడానికి కథకుడు తన వాఙ్మయంలో ఎన్నో గ్రంథాలు చదివి గొప్ప కవుల పోకడలూ పలుకు బడులూ బాగా అవగాహన చేసుకుని ఉండాలి. చిన్నకథ చెప్పడానికెంతో వాక్శుద్ధి ఉండాలి. అది వినిపించడాని కెంతో నేర్పుండాలి. అది బోధపరచ డానికెంతో సంస్కారం ఉండాలి అని సూత్రీకరించారు. కథా రచయితకు వ్యుత్పన్నత, అభ్యాసం, నిశిత పరిశీలనా దృష్టి, సంస్కారం ఆవశ్యకాలన్న అభిప్రాయం అక్షర సత్యం. శ్రీపాద వారి కథలను స్థూలంగా 1) సంస్కరణాత్మక కథలు, 2) విషాదాంత ప్రణయ కథలు, 3) చారిత్రక కథలు, 4) జానపద కథలుగా వర్గీకరించవచ్చు.

శ్రీపాద కథల్లో ప్రబలంగా సంస్కరణ దృక్పథం ఉంటుంది. ప్రత్యేకించి మహిళాభ్యుదయ భావాలున్నాయి. ఆయన కథల్లో అప్పటి సాంఘిక విరుద్ధాలైన వితంతు, రజస్వలానంతర వివాహాలున్నాయి. పరిణీత వయోపునస్సంధానాలు, బాల వితంతువుల అణచివేతపై తిరుగుబాటు ధోరణి, స్వతంత్రించి పునర్వివాహాలు చేసుకోవడాలున్నాయి. ఆడపిల్లలు స్వయంశక్తి శౌర్యాలు పెంపొందించుకోవడం, సాము గరిడీలు నేర్చుకోవడాలున్నాయి.

పెళ్లే ప్రధానంగా భావించకుండా, చదువుకొని స్వయంఉపాధిని కల్పించుకోవడం, వరుల నిర్ణయంలో పాలుపంచుకోవడం, చొరవ చూపడం, వరకట్నాన్ని తిరస్కరించడం భార్యభర్తను ప్రశ్నించ గలగడం, తండ్రీ కూతుళ్ల పరస్పర అవగాహనతో స్నేహపూర్వకంగా మెలగడం, వేశ్యల్లో కూడా గౌరవనీయులుంటారని గుర్తించడం, కొత్తకోడళ్లను ఆరడి పెట్టే అత్తలకు, విధవాడపడుచులకు బుద్ధి చెప్పడం వంటి మహిళాభ్యుదయ ప్రగతి స్ఫోరక భావాలెన్నో ఉన్నాయి. శ్రీపాద మహిళాభ్యుదయ దృక్పథం, ముందుచూపు ఒక శతాబ్ది ముందుగా ఉందంటే అతిశయోక్తి కాదు.

**విషాదాంత ప్రణయ కథలు**

శ్రీపాద వారి తొలికథ 'ఇరువురమొక్క చోటికే పోదము' తొలికథ. 1915 మార్చిలో ఆంధ్రపత్రికలో వెలువడింది. దీనిని సరళ గ్రాంథిక భాషలో రాశారు. ఇది విషాదాంత ప్రణయ కథ. ఇందులో కథన నైపుణ్యం, శిల్పం అంతగా లేవు. తరువాత కథల్లో ఈ లోపాన్ని సరిదిద్దుకొన్నారు.

**ప్రణయ తపస్సు**

తాను ప్రేమించిన బాల వితంతువును పరిస్థితుల ప్రభావం వల్ల మేనత్త రోకటి పోటుతో చంపుతుంది. ఆమె మరణాన్ని తట్టుకోలేక తానే అంత్యక్రియలు నిర్వహించి ఆమె సమాధి దగ్గర ప్రణయ తపస్సు, తల్లి సమాధి దగ్గర మాతృజపంతో కాలం గడిపే ప్రణయ తపస్వి భావోద్వేగ విషాదాంత కథ. శ్రీపాద రొమాంటిసిమ్ ప్రభావంతో రాశారు. శ్రీపాదవారి వితంతు వివాహ కథలన్నీ సుఖాంతాలు కాగా, ఈ కథ మాత్రమే బలవన్మరణపు విషాదాంతం.

**ప్రణయ భంగం**

శ్రీపాద ఈ కథను 1925 ఫిబ్రవరి ప్రబుద్ధాంధ్రలో ప్రచురించారు. బాల వితంతువు 'నరసు' వినిపించిన విషాదాంత ప్రణయకథ. ఆమెను పునర్వివాహం చేసుకొనేందుకు ఎందరో యువకులు సిద్ధపడినా, ఆవిడ ఆస్తిలేని విధురుడైన జగ్గయ్య

భారతిలో (1925) వ్యాసం రాశారు. శ్రీపాద రాసిన 'ఆత్మబలి' మనో విశ్లేషణాత్మక నవలగా ప్రసిద్ధి పొందింది. 'నీలాసుందరి' పౌరాణిక నవల విమర్శకుల మెప్పు పొందింది. పాత్రికేయులుగా 'ప్రబుద్ధాంధ్ర'తో ప్రతిభను నిరూపించుకున్నారు. మల్లిడి సత్తిరెడ్డి 'రెడ్డిరాణి' పత్రిక సంపాదకత్వ బాధ్యతలు కొన్నాళ్లు నిర్వహించారు. పద్య రచన పట్ల మక్కువతో 'గీతామంజరి', 'మోహలేఖ' వంటి ఖండకావ్యాలు రాశారు. అవధానాలు చేశారు.

# అత్తరు జల్లు

మావను చేసుకున్నది. పట్టుదలతో తనను ఆరాధిస్తూ మంచంలో ఉన్న అతడి సేవలో సంతోషిస్తుంది. అతడు కన్నుమూసినా తన జన్మ పునీతమైందని భావిస్తుంది.

**సాంఘిక కథలు -**
**వితంతు వివాహ సంస్కరణలు**

శ్రీపాదవారి సంస్కరణ దృక్పథానికి సంకేతాలుగా వీరేశలింగం ప్రభావంతో వితంతు వివాహాలు ప్రోత్సహించారు. ఆయన కథల్లో వీరేశలింగంగారిని 'పాత్ర'గా ప్రవేశపెట్టారు. 'రామలక్ష్మి' కథలో కుహనా సంస్కర్త రంగారావు పన్నిన కుటిల వలయాన్ని వివేకంతో ఛేదించి తాను కోరుకున్న 'సూర్యారావు అనే యువకుణ్ణి వివాహం చేసుకున్న వితంతు యువతి సాహస గాథ రామలక్ష్మి కథ.

'వెలిపెడితే అల్లుడైనాడు' కథలో యువ పండితుడు విశ్వనాథశాస్త్రికి వస్తున్న పేరు ప్రఖ్యాతులు చూడలేక పద్మనాభశాస్త్రి మాల యువతిని రక్షించాడన్న నెపంతో వెలివేయించాడు. పద్మనాభశాస్త్రి వితంతు కూతురు 'నరసమ్మ' విశ్వనాథశాస్త్రిని తీసుకొని లేచిపోయి పెళ్లి చేసుకొని తండ్రికి బుద్ధి చెప్పింది. తండ్రి తనను కొట్టి చంపుతా నంటే 'నరసమ్మ' సాహసంతో అర్ధరాత్రి ఇంట్లోంచి లేచివచ్చి విశ్వనాథ శాస్త్రిని ప్రేమతో ప్రేరేపించి 'ఎక్కడికైనా పోదాం పద' అని ప్రయాణం కట్టించిన ఆమె సాహసానికి పర్యవసానమే పునర్వివాహం. శ్రీపాద కథల్లో స్త్రీ పాత్రలకుండే తెగింపు పురుష పాత్రల్లో అంతగా కనిపించదు. ఈ కథలో 'నరసమ్మ', రామలక్ష్మి కథలో రామలక్ష్మి పాత్రలే దృష్టాంతాలు.

'అరికాళ్ల క్రింద మంటలు' కథలో రుక్మిణి పదిహేడేండ్ల వితంతువు. ఇంట్లో వాళ్లంతా పనులన్నీ ఆవిడచేత చేయించేవాళ్లు. ఆవిడ చేయలేనంటే నిష్ఠురాలాడేవాళ్లు. కుటుంబసభ్యులంతా కలసి కూర్చోపెడితే బుద్ధి వస్తుందన్న నిర్ణయానికి వచ్చారు. ఆమె వాళ్ల రుక్మిణికి తల గొరిగించి ప్రయత్నాన్ని సహించలేక వితంతు వివాహాలు ప్రోత్సహిస్తున్న వీరేశలింగం గారి తోటకు జట్కావాడి సహాయంతో వెళ్లి పునర్వివాహం చేసుకుంటుంది. ఇంట్లో తల్లి కూడ 'రుక్మిణి'కి సానుభూతి చూపించక అమానుషంగా 'దొడ్లో గేదెతో సమానమై పోయాను' అన్నప్పుడు, గేదెకు నీకూ సంబంధం మేమిటని ప్రశ్నిస్తుంది. వితంతు యువతి గేదె కంటే హీనంగా ఉందని ఆమె భావన.

**అవినీతి నిరసన**

శ్రీపాద అప్పటికే సంఘంలో ఉన్న అవినీతి, ఉద్యోగాల కోసం లంచం అడిగే స్థితిని 'కలుపుమొక్కలు' కథలో చిత్రించాడు. ఒక బీద బ్రాహ్మణుడు తన కొడుక్కు ఉద్యోగం కోసం ప్రెసిడెంటుగారి గుమస్తా వద్దకు వెళతాడు. అతడు అడిగిన లంచం ఇవ్వలేనంటాడు. చిట్టచివరి అస్త్రంగా ఒక వేశ్యను ప్రెసిడెంటుగారి వద్దకు తీసుకువచ్చేట్టయితే ఉద్యోగం ఇప్పిస్తానంటాడు. చివరకు ఏం చేయాలో తోచక ఒక వేశ్యను ప్రాధేయపడతాడు. ఆమె మొదట తిరస్కరించినా, అతడి బాధను గమనించి జాలితో అంగీకరిస్తుంది. సమాజంలో పెద్ద మనుష్యులుగా కనపడుతున్న వారం స్వార్థంతో ఎంత సంకుచితంగా మారతారో, మనం చులకనగా చూసే వేశ్య ఒక మంచి పనికోసం తన ఇష్టానికి వ్యతిరేకంగా ప్రవర్తించి మహోన్నత వ్యక్తిత్వం గల స్త్రీగా మారుతుంది.

**అస్పృశ్యతా నిరసనలు**
**మత మార్పిడి ప్రోత్సాహాలు**

శ్రీపాద తన కథల్లో 'ఇలాంటి తవ్వాయి వస్తే'తో కులమత వివక్ష, అస్పృశ్యత, మత మార్పుల విషయంలో గ్రామంలో పెద్దలు – అగ్రవర్ణాల వాళ్లు ఏ విధంగా అసంబద్ధంగా, అమానుషంగా ప్రవర్తిస్తారో చూపించి, ఊరికి కొత్తగా వచ్చిన ఉపాధ్యాయుడు 'కిరస్తానీ పంతులు' ద్వారా మతం మార్పుల వల్ల 'అస్పృశ్యులకు' క్రిస్టియన్ మతం కల్పించలేని సాంఘిక గౌరవాన్ని మహమ్మదీయ మతంలోకి మారిన అస్పృశ్యుల్ని హిందువులు స్వీకరించి తమ పరిధిలోకి రానివ్వడం చిత్రించి అగ్రవర్ణాల వారికి కనువిప్పు కలిగించారు. పాఠకుల్లో ఆలోచన రేకెత్తించి చైతన్యం కలిగించారు. కులం కట్టుబాట్లకు జంకి పెళ్లి కోసం మతం మార్చుకున్న నిమ్న జాతి యువతీ యువకుల ప్రణయ వివాహ కథ 'సాగర సంగమము'. శ్రీపాద 1931 అక్టోబర్ భారతిలో ప్రచురించారు. కులాతీత మతంగా ప్రసిద్ధి చెందిన క్రైస్తవ మతంలో చేరినవారు కూడా కులభేదాలు పాటించే యథార్థస్థితిని శ్రీపాద వాస్తవిక దృష్టితో చిత్రించారు.

**నిరుద్యోగం-స్వయం ఉపాధి కథలు**

నిరుద్యోగ సమస్య అప్పటికే సంఘంలో తాండవిస్తుంది. శ్రీపాద ఇతర సాంఘిక సమస్యలతో పాటు నిరుద్యోగ సమస్యను గూర్చి 'తాపీమేస్త్రి రామదీక్షితులు బి.ఏ.', 'మార్గదర్శి', 'గుర్రప్పందాలు' వంటి కథల్లో ప్రబోధాత్మకంగా చిత్రించారు. చదువుకున్న యువకులు అగ్రకులానికి చెందిన వారైనా, ఉద్యోగాల వేటలో పడి బాధపడేకన్నా, భేషజాలేవీ లేకుండా ఏదో ఒక వృత్తిని చేపట్టాలని, ఏదో ఒక వ్యాపారాన్ని ఇష్టంగా నిర్వహించాలనీ ప్రబోధిస్తూ రాసిన కథల్లో కథాశిల్పంతో, కథన శైలిలో అగ్రశ్రేణిలో నిల్చే కథ 'మార్గదర్శి'. ఒక ఉద్యోగానికి సిఫార్సు చేయమని అడగడానికి వచ్చిన యువకుడికి శ్రీపాద, ఇతరుల అనుభవాలను చెప్పి, ఉద్యోగాల వేటమానుకొని చిన్న వ్యాపారం మొదలుపెట్టమని, అవసరమైతే కొంత డబ్బు సహాయం చేస్తానని చెప్పాడు. 'ఇంత చెప్పినా నీకింకా నౌకరీ వ్యామోహం పోదూ, పో? నా యెదుట నుంచోకు, వెళ్లిపో? అంటూ గద్దించాడు. చిన్న కథాంశాన్ని రచయిత గొప్ప కథగా మలిచాడు. ఉద్యోగాల వేట ఇతి వృత్తంతో రాసిన మరో కథ 'గుర్రప్పందాలు'. ఇంటర్వ్యూలకు వెళ్లే యువకుల్ని ఎంత అసంబద్ధమైన ప్రశ్నలు వేస్తారో, జంతువుల్ని చేసి ఎలా అవమానపరుస్తారో వ్యంగ్యస్ఫోరక సంభాషణలతో చమత్కారంగా రచయిత అధిక్షేపించాడు. 'తాపీమేస్త్రి రామదీక్షితులు బి.ఏ.' కథలో పట్టభద్రుడైన రామదీక్షితులు ఉద్యోగం రాలేదని నిస్పృహతో ఉండ కుండా తాపీమేస్త్రి పని ద్వారా డబ్బు సంపాదిస్తున్న స్థితిని యువకులు ఆదర్శంగా తీసుకోవాలని ప్రబోధించారు.

**దంపతులు అన్యోన్యత - సంఘర్షణ**

శ్రీపాద కొత్త దంపతుల అన్యోన్యతను చిత్రించే కథలతోపాటు, దంపతుల నిత్య సంఘర్షణల కీచులాటలను కూడా చిత్రించారు. 'నాటకం' కథలో దంపతుల ఆత్మీయత, అన్యోన్యతలను గొప్పగా చిత్రించారు. 'యావజ్జీవం హోష్యామి', 'షట్కర్మ యుక్తా' వంటి కథల్లో భిన్న అభిరుచులూ, భేదాభి ప్రాయాలతో అనునిత్యం సంఘర్షించుకొనే దంపతుల మనస్తత్వాన్ని చిత్రించారు. భార్యభర్తలు ఒకరిపై ఒకరు ప్రేమ, గౌరవం లేకుండా, వివాహ మంత్రాల్లో చెప్పినట్లు యావజ్జీవం ఒకరికొకరు అంటిపెట్టుకొని ఉండాలనడం ఎంత హాస్యాస్పదమో, అసహజమో శ్రీపాద ఆనాడే గుర్తించి తాను స్త్రీపక్షం వహించారు.

**పరాయి సంస్కృతీ నిరసన**

అన్య భాషా సంస్కృతుల పట్ల కొందరు తెలుగు వారికి పెరుగుతున్న వ్యామోహాన్ని 'శుభికే! శిర ఆరోహ' అనే కథలో శ్రీపాద నిరసించారు. హిందీ భాషపట్ల, ఉత్తరాది రాష్ట్రాల వారి సంస్కృతి పట్ల

ఆయనకెంతో విముఖత, బెంగాలీ ఉచ్ఛారణను, జీవనశైలినీ అనుకరిస్తూ, హిందూస్థానీ సంగీతాన్ని ప్రశంసిస్తూ, తెలుగు వారి పట్ల నిరసన వ్యక్తం చేస్తూనే, మేనరికం చేసుకోవడానికి వచ్చిన తల్లీ కొడుకులకు బుద్ధి చెప్పిన వ్యంగ్య ప్రధానమైన కథ. మన జాతి బాగు పడాలంటే కర్ణాటక సంగీతాన్ని ప్రోత్సాహించాలంటారు. ఆనాటి భావకవుల వింత ధోరణిని కూడా 'క్షీర సాగర మథనం' పెద్దకథలో అధిక్షేపించారు. జాతీయోద్యమంతో అంతర్భాగమైన ఖద్దరు ధారణనీ నిరసించారు. 'సముద్రము నందలి మంచు కొండలు' కథలో ఖద్దరులో జీవం లేదనీ, ఖద్దరు అనాగరిక చిహ్నమనీ అధిక్షేపించారు. వీరేశలింగం గారి ప్రభావంతో ఖద్దరు ధారణని నిరసించిన శ్రీపాద ఆనాడు జాతీయోద్యమ అభిమానుల నిరసనకు గురయ్యాడు. శ్రీపాదవారు కథల్లో 'రావులయ్య కథ' (1924 రెడ్డిరాణి సంచిక) ఆత్మ విశ్వాసంతో కఠోర శ్రమతో రైతు కూలీగా చేరి కౌలు రైతుగా, స్వంత రైతుగా భూస్వామిగా, పారిశ్రామిక వేత్తగా అంచెలంచెలుగా ఎదిగిన వ్యక్తి ఎందరికో ఆదర్శం. ఈ కథను మొన్న మొన్నటి వరకు విమర్శకులు తొలిరైతు కథగా పేర్కొన్నారు.

### శ్రీపాదవారి చారిత్రక కథలు

శ్రీపాద చారిత్రక కథల్లో ఒకటి రాచరికపు వెలమ స్త్రీల ఆత్మాభిమానం, శౌర్యానికి సంబంధించిన కథ 'విమానం యెక్క బోతూనూ'–బొబ్బిలి యుద్ధం చరమదశలో బొబ్బిలి ప్రభువు రంగారాయుడు ఆదేశాన్ని ధిక్కరించిన రాణి మల్లమ్మదేవి వీరగాథ ఇది. చారిత్రక కథల్లో పూర్వ సంస్థానాలకు సంబంధించిన కథల్లో 'వడ్లగింజలు', 'గులాబీ అత్తరు' ప్రసిద్ధమైన కథలు. గులాబీ అత్తరు కథ నభూతో నభవిష్యతి. వడ్లగింజలు ఎంత పెద్ద కథో గులాబీ అత్తరు అంత చిన్న కథ. శిల్పదృష్ట్యా రెండు కథల్లో మౌలికాంశం ఒక్కటే. 'గులాబీ అత్తరు' కథలో కథానాయకుడైన అత్తరు సాయిబు ఢిల్లీ నుంచి వచ్చి రాజును దర్శించుకొని తన అత్తరు గొప్పతనాన్ని చెప్పాలనుకుంటాడు. రాజును చూడడం కుదరక నిరాశా నిస్పృహలతో అపురూపమైన అత్తరు సీసాని కోటగుమ్మం దగ్గర గోడకేసి పగలగొట్టాడు. అదే సమయంలో రాజు అశ్వారూఢుడై లోపలినుంచి రావడం, అత్తరు ఘాటుకు రాజు, అశ్వం మత్తుకు లోనై అర్ధనిమీలితులు కావడం కథలో కొసమెరుపు. గులాబీ అత్తరు గుబాళింపు నేటికీ పాఠకులకు అనుభూతిని కలిగిస్తుంది. ఇతర భాషల్లోకి అనువదించదగిన గొప్ప కథగా విమర్శకుల ప్రశంస అందుకుంది.

'వడ్లగింజలు' కథా పరిమాణంలో పెద్దదైనా కథాంశం చిన్నదే. రాజుని సందర్శించడానికి వచ్చిన చదరంగం శంకరప్ప ఆటగాడు సంస్థానంలో ప్రవేశించడానికి ఎన్నో అవరోధాలు, అడ్డంకులు కలిగించారు. చివరికి సహృదయుల సహకారంతో

చారిత్రక కథల్లో పూర్వ సంస్థానాలకు సంబంధించిన కథల్లో 'వడ్లగింజలు', 'గులాబి అత్తరు' ప్రసిద్ధమైన కథలు. గులాబి అత్తరు కథ నభూతో నభవిష్యతి. వడ్లగింజలు ఎంత పెద్ద కథో గులాబి అత్తరు అంత చిన్న కథ. శిల్పదృష్ట్యా రెండు కథల్లో మౌలికాంశం ఒక్కటే. 'గులాబి అత్తరు' కథలో కథానాయకుడైన అత్తరు సాయిబు ఢిల్లీ నుంచి వచ్చి రాజును దర్శించుకొని తన అత్తరు గొప్పతనాన్ని చెప్పాలనుకుంటాడు. రాజును చూడడం కుదరక నిరాశా నిస్పృహలతో అపురూపమైన అత్తరు సీసాని కోటగుమ్మం దగ్గర గోడకేసి పగలగొట్టాడు. అదే సమయంలో రాజు అశ్వారూఢుడై లోపలి నుంచి రావడం, అత్తరు ఘాటుకు రాజు, అశ్వం మత్తుకు లోనై అర్ధనిమీలితులు కావడం కథలో కొసమెరుపు.

తెలివితో రాజుతో చదరంగం ఆడి గెలిచాడు. పారితోషికం ఏం కావాలో? కోరుకొమ్మన్నపుడు చమత్కారంగా చదరంగానికి 64 గళ్లు మొదట గడిలో ఒక వడ్ల గింజ, రెండో దానిలో దానికి రెట్టింపు చొప్పున వడ్లగింజలిస్తే చాలంటాడు. స్థూల దృష్టికి చాలా చిన్న కోరికనిపిస్తుంది. దివాన్జీతో రాజుగారు శంకరప్పగారు కోరిన వడ్లగింజలు లెక్క కట్టించాడు. దివాన్జీ కాగితంపై లెక్కించి శంకరప్ప గారి కోరిక తీర్చాలంటే పెద్దాపురం రాజ్యం చాలదు ప్రభూ! అంటాడు. ఆఖరికి సర్వలక్షణ సంపన్నమైన ఒక అగ్రహారాన్ని శంకరప్పకు సమర్పించాడు. శ్రీపాదవారు ఆసక్తికరమైన కథనంతో గొప్ప కథగా మలచి (1935 సెప్టెంబర్) ప్రబుద్ధాంధ్రలో ప్రచురించారు. ఈ కథలో శంకరప్ప చదరంగ ప్రావీణ్యం యుక్తి చాతుర్యం, రచయిత చమత్కార స్ఫూర్తికి నిదర్శనం. శ్రీపాదవారు 'రాచపీనుగ తోడు లేనిదే చావదు' అనే సామెతను నేపథ్యంగా చారిత్రక జానపద కథ రాశారు.

### శ్రీపాద భాషా శైలి

శ్రీపాద తొలికథ 'ఇరువురు మొక్క చోటికే పోదము' కథ సరళ గ్రాంథిక భాషలో రాశారు. గిడుగు గురజాడల ప్రభావంతో వ్యవహారిక భాషలో తనదైన శైలిలో గోదావరి మాండలిక మాసంలో కథలు రాశారు. శ్రీపాద వారి తెలుగు నుడికారానికి సాహితీ లోకం ఎప్పుడూ రుణపడే ఉంటుంది. శ్రీపాద నాటక ప్రియత్వం ఆయన కథాశిల్పాన్ని ప్రభావితం చేసింది. శ్రీపాద తన కథలను ఎక్కువగా నాటక రూపానికీ, ముఖ్యంగా శ్రవ్య నాటక రూపానికి సన్నిహితంగా ఉండే విధంగా రూపొందించారు. రచయిత వ్యాఖ్యానం తక్కువగా, పాత్రల సంభాషణలే ఎక్కువగా ఉన్న కథలు ఎక్కువగా రాశారు. కొన్ని కథలు పూర్తిగా సంభాషణాత్మకాలు. కథారచనలో ఇటువంటి శిల్ప ప్రయోగాలు చేసిన తొలి కథా రచయత శ్రీపాద. ఆ కథల్లో తెలుగుతనం కోస్తాంధ్ర భాషయాసలో తొణికిసలాడుతుంటుంది. ఒక్కో చోట ఆయన భాషే శిల్పమవుతుంది. ఆయన కథల్లో శిల్పం వల్ల పాఠకుల విసుగు కలగకుండా చదివించే లక్షణం ఉంది. ఆయన కథల్లో 'అపిదళతి వజ్రస్య హృదయమ్' 'యావజ్జీవం హోష్యామి', 'షట్కర్మయుక్తా' కన్యాకాలే యత్నా ద్వరితా వంటి కథలకు ఔచిత్యమైన సంస్కృత భాషా శీర్షికలు పెట్టారు. ఆయన కథాశీర్షికలన్నీ ఔచిత్యాలే 'పోలీస్', 'లీగల్ ఎడ్వైస్' రెండు కథలకు మాత్రమే ఆంగ్ల శీర్షికలు పెట్టారు. కనక్ ప్రవాసి శ్రీపాద కథాశిల్పాన్ని వివరిస్తూ 'తెలుగు కథని తెలుగు కథలా వ్రాయడం శాస్త్రి గారి కథనంలోని ప్రత్యేకత. ఎత్తుగడ, నిర్వహణ, ముగింపు అన్నిటా తెలుగుతనమే కాని అన్యవాఙ్మయ ఛాయ కనబడదు' అన్నారు.

శ్రీపాద కథలలో ప్రధానంగా కనిపించేది గ్రామీణ వాతావరణ చిత్రణ. గోదావరీ ప్రాంత బ్రాహ్మణ అగ్రహారాలను గూర్చి ఎక్కువగా ప్రస్తావించారు. తనకున్న మాండలిక జీవితానుభవాన్ని తన కథల్లో చెప్పారు. ఆయన కథల్లో సామాజిక స్పృహ స్పష్టంగా కనిపిస్తుంది.

### పాత్రలు

శ్రీపాద 'వీరేశలింగం', గిడుగు రామమూర్తి వంటి వారిని పాత్రలుగా చేశారు. పురుష పాత్రల కంటే స్త్రీ పాత్రలు చిత్రణ పట్ల శ్రద్ధ చూపారు మహిళాభ్యుదయ దృష్టితో ఆనాటి సమాజాన్ని ఎదిరించి తిరుగుబాటు చేసిన స్త్రీ పాత్రలే ఎక్కువగా ఉన్నాయి. శ్రీపాద ఆధునిక కథాసాహిత్యంలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకొన్న గొప్ప రచయిత. అభ్యుదయ కథకుడిగా, గౌతమి కథకుడిగా, మహిళాభ్యుదయ వాదిగా, శిల్పవంతమైన చమత్కారమైన కథలు రాసి పాఠకుల హృదయాల్లో నిలిచి పోయారు. ఆయన అనుభవాలూ జ్ఞాపకాలులో చెప్పినట్లు ఆయన కథలు కళ్లకు వెలుగునిస్తాయి. బుద్ధికి పదును పెడతాయి మనసుకు ఉత్సాహం కలిగిస్తాయి. 'నవీనాంధ్ర కథకుల్లో ఘనాపాఠీ'గా జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి వ్యాఖ్యానించారు.



**డా॥పి.వి.సుబ్బారావు**
9849177594,
విశ్రాంత అధ్యాపకుడు





ప్రపంచంలోనే అత్యధిక యువజన జనాభా కలిగిన భారతగడ్డపై ఖేలో ఇండియా యువజన క్రీడలు ఏటికేడాది బలోపేతమవుతున్నాయి. యువత కోసమే ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేకంగా రూపొందించిన ఖేలో ఇండియా గేమ్స్ ఏడవ ఏడాదిలోకి ప్రవేశించాయి. బిహార్ వేదికగా జరుగుతున్న 2025 ఖేలో ఇండియా గేమ్స్‌ను ప్రధాని లాంఛనంగా ప్రారంభించారు.

# ఇంతింతై అంతంతైన 'ఖేలో ఇండియా'

KHELO INDIA
YOUTH GAMES 2025
BIHAR
4th - 15th MAY 2025
KHEL KE RANG! BIHAR KE SANG!

దేశంలోని 18వ సంవత్సరాలలోపు వారికి కోసమే ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఈ 7వ ఖేలో ఇండియా గేమ్స్‌లో భాగంగా 27 రకాల క్రీడాంశాలలో 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన జట్లు తలపడబోతున్నాయి. పురుషుల, మహిళల విభాగంలో వివిధ రాష్ట్రాలకు చెందిన 6వేల మంది క్రీడాకారులు తమ సత్తాను చాటుకోడానికి సిద్ధమయ్యారు.

మొత్తం 284 స్వర్ణపతకాల కోసం వేలాదిమంది క్రీడాకారులు ఢీ అంటే ఢీ అంటున్నారు. అత్యధికంగా 38 బంగారు పతకాలను ఈత అంశాలలో ఇవ్వనున్నారు. ట్రాక్ అండ్ ఫీల్డ్ అంశాలలో 34, కుస్తీ, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్ అంశాలలో 20 చొప్పున స్వర్ణపతకాల కోసం పోటీలు నిర్వహిస్తున్నారు. ఆతిథ్య బిహార్ 450 మంది అథ్లెట్ల భారీ బృందంతో తన అదృష్టం పరీక్షించుకుంటోంది. ఇప్పటికే రెండుమార్లు ఖేలో ఇండియా గేమ్స్ ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన మహారాష్ట్ర మూడోసారి టైటిల్‌కు గురిపెట్టింది. 400 మంది అథ్లెట్ల బృందంతో ప్రత్యర్థులకు సవాలు విసురుతోంది. మధ్యప్రదేశ్ వేదికగా ముగిసిన 2023, తమిళనాడు ఆతిథ్యంలో జరిగిన 2024 గేమ్స్‌లో అత్యధిక పతకాలతో ఓవరాల్ ట్రోఫీని మహారాష్ట్ర అందుకుంది.

2024 ఖేలో గేమ్స్ పతకాల పట్టికలో 21వ స్థానంలో నిలిచిన బిహార్ ప్రస్తుత క్రీడలకు ఆతిథ్యమివ్వడం ద్వారా మొదటి మూడు స్థానాలలో నిలవాలన్న పట్టుదలతో ఉంది. గతంలో క్రీడలకు ఆతిథ్యమివ్వడం ద్వారా ఢిల్లీ, మధ్యప్రదేశ్, తమిళనాడు పతకాల పట్టిక మొదటి మూడు స్థానాలలో నిలువగలిగాయి. హరియాణ 300 మంది, కర్ణాటక 236 మంది, తమిళనాడు 307 మంది అథ్లెట్ల బృందాలతో బరిలో నిలిపాయి.

గత ఏడున్నర దశాబ్దాల కాలంలో ప్రభుత్వాలు వస్తూపోతూ ఉన్నా భారత క్రీడారంగ పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంటూ వస్తోంది. ఈ పరిస్థితిని అధిగమించడానికి గత ప్రభుత్వాల వ్యూహాలు, పథకాలను సమగ్రంగా సమీక్షించిన నరేంద్ర మోదీ... ఖేలో ఇండియా అనే వినూత్న కార్యక్రమానికి అంకురార్పణ చేశారు. గతంలోని రాజీవ్ గాంధీ ఖేల్ అభియాన్, పట్టణ ప్రాంతాలలో మౌలిక క్రీడాసదుపాయల కల్పన పథకం, క్రీడా రంగంలో జాతీయ ప్రతిభాన్వేషణ పథకాలను మిళితం చేయడం ద్వారా ఖేలో ఇండియా కార్యక్రమానికి తుదిరూపు ఇచ్చారు.

అత్యంత ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి, వారి చదువుకు ఆటంకం కలగని విధంగా ప్రపంచ ప్రమాణాలతో కూడిన క్రీడా శిక్షణ ఇవ్వటానికి దేశంలోని 20 విశ్వవిద్యాలయాలను ఎంపిక చేశారు. వాటిలోని స్పోర్టింగ్ ఎక్సలెన్స్ వేదికలుగా అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు.

**మూడంచెలుగా శిక్షణ....**

అధునాతన శిక్షణ సదుపాయాలతో పాటు... ప్రపంచ ప్రమాణాలతో తీర్చిదిద్దే శిక్షకులు ఈ కేంద్రాలలో ఉండేలా ఏర్పాట్లు చేశారు. కేంద్రపాలిత ప్రాంతాలు, రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు, వ్యవస్థలు... స్పోర్ట్స్ ఎక్సలెన్స్ కేంద్రాలతో అనుసంధానమై ఉంటాయి. అంతేకాదు... వివిధ క్రీడలకు సంబంధించిన తాజా సమాచారం తెలుసుకోడానికి వీలుగా ప్రత్యేక యాప్‌లను కేంద్ర క్రీడామంత్రిత్వశాఖ అందుబాటులోకి తెచ్చింది.

ఎంపిక చేసిన విశ్వవిద్యాలయాలలోని క్రీడా మైదానాలలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం, అత్యాధునిక శిక్షణ సౌకర్యాలు అందుబాటులో ఉంచడం, క్రీడాశిక్షకుల పరిజ్ఞానాన్ని ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా మెరుగుపరచడం... ఖేలో ఇండియాకు ఆయువు పట్టుగా ఉంటాయి. పదేళ్ల నుంచి 18 సంవత్సరాల వయసున్న ప్రతిభావంతులను గుర్తించి... ఎంపిక చేసిన క్రీడలతో క్రీడలతో పాటు చదువులోనూ రాటుదేలేలా చేయటమే ఖేలో ఇండియా ప్రధానలక్ష్యంగా నిర్ణయించారు.

**భారీగా ఉపకారవేతనాలు**

స్కూల్ గేమ్స్‌లో పాల్గొన్న వారిలో అసాధారణ ప్రతిభావంతులైన వెయ్యి మందికి... నెలకు రూ. 500 నుంచి రూ.2 వేల వరకు ఉపకారవేతనంగా అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. ప్రపంచ ప్రమాణాలతో కూడిన క్రీడాశిక్షణ, చదువు, ఆహారవసతి సదుపాయాలు కల్పించారు. చిన్నవయసులోనే ప్రతిభను గుర్తించి, అత్యున్నత శిక్షణ, నిరంతర పర్యవేక్షణతో ఒలింపిక్స్ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దటమే నరేంద్ర మోదీ మానసపుత్రిక ఖేలో ఇండియా అంతిమ లక్ష్యం.

'దేశంలో డాక్టర్లు, ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులకు ఏ మాత్రం కొదవలేదు. మన భారత దేశానికి కావాల్సింది విశ్వవిజేతలు, ఛాంపియన్ క్రీడాకారులు మాత్రమే. ఈ దేశంలోని బాలలంతా తమకు నచ్చిన ఏదో ఒక ఆట ఆడితే ఖేలో ఇండియా లక్ష్యం నెరవేరినట్లే అవుతుంది' అని ప్రధాని విశ్వాసం ప్రకటించారు. ★



**కృష్ణారావు చొప్పరపు**
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

# నేటి సైద్ధాంతిక పోరాటంలో 'జాగృతి' ఓ ఆయుధం

ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సైద్ధాంతిక పోరాటానికి జాగృతి వారపత్రికను ఒక ఆయుధంగా మలచుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలంగాణ ప్రచారప్రముఖ్ కట్టా రాజగోపాల్ అన్నారు.

జాగృతి వారపత్రికను జనసమూహానికి మరింత చేరువ చేయడంలో భాగంగా జాగృతి పాఠకుల ఆత్మీయ సమ్మేళనం హనుమకొండ(వరంగల్ )లో వివేకానంద యోగ కేంద్రంలో మే 1వ తేదీన జరిగింది. ఈ సమ్మేళనానికి జాగృతి ప్రకాశన్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చిలుకమారి సంజీవ అధ్యక్షత వహించారు.






ఇందూరు రామకృష్ణసేవాసమితి భవనంలో మే 2వ తేదీన జరిగిన ఆత్మీయ సమ్మేళనానికి మాధవ స్మారకసమితి అధ్యక్షుడు మర్రి కృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సమ్మేళనాలలో పాల్గొన్న జాగృతి పాఠకులు పత్రికలో ప్రచురిత మవుతున్న వ్యాసాలు, విశ్లేషణలు వివరంగా ఉన్నాయని అన్నారు. ముఖ్యంగా బాలజాగృతి శీర్షికలో వస్తున్న అంశాలు భావితరాలకు మన సంస్కృతీ సంప్ర దాయాలను అందిస్తున్నాయని కొనియాడారు. మహిళాశీర్షిక క్రింద వస్తున్న వ్యాసాలు మహిళలను సామాజికంగా తీర్చిదిద్దేవిగా ఉన్నాయని మాతృమూర్తులు తెలిపారు. అలాగే పెద్దకథలు సంస్కృతితోపాటు కుటుంబ విలువలను కాపాడే విధంగా జాగృతి అందిస్తున్నదని తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

హనుమకొండ, ఇందూర్‌లలో ముఖ్యవక్త రాజగోపాల్ మాట్లాడుతూ మహాభారత సంగ్రామం కురుక్షేత్రంలో జరిగిందని, 2012 తరువాత ఇలాంటి సంఘటనలని ప్రతి బస్తీలో, గ్రామంలో జరుగుతాయని ఆర్ఎస్ఎస్ ఐదవ సర్‌సంఘచాలక్ శ్రీ సుదర్శన్‌జి హెచ్చరించిన విషయాన్ని గుర్తు చేశారు. వాస్తవ విషయాలు, వార్తలు తెలుసుకోవాలంటే ప్రతి పౌరుడు జాగృతిని తప్పక చదవాలని సూచించారు. ఇంటికి జాగృతి వస్తే స్వయంసేవకులు వచ్చి మాట్లాడిన విధంగా పాఠకులు భావిస్తున్నారన్నారు. దేశంలో జరుగుతున్న విషయాల పట్ల సంపూర్ణ అవగాహన కోసం జాగృతిని చదవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.

వరంగల్‌లో విభాగ్ ప్రచార ప్రముఖ్ లక్ష్మణ సుధాకర్, మహానగర్ ప్రచారప్రముఖ్ మిట్టపల్లి వేణుగోపాల్, ఇందూరులో జాగృతి అసోసియేట్ ఎడిటర్ దుర్గారెడ్డి, విభాగ్‌ప్రచారప్రముఖ్ రాంనరేశ్, జిల్లా ప్రచారప్రముఖ్ రుద్రమధు, జిల్లా జాగృతి ప్రముఖ్ ఇప్పకాయల సుదర్శన్, నగర జాగృతి ప్రముఖ్ రాజశేఖర్‌రెడ్డి తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.





# బాలలకు ఆటవిడుపు 'బాలగోకులం'





**హనుమకొండ :** "బాలగోకులం" పేరిట 10 రోజుల ఉచిత వేసవి శిక్షణ శిబిరం హనుమకొండ, వివేకానంద యోగా కేంద్రంలో మే 1న ప్రారంభమైంది. మాధవ స్మారక సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలగోకులం ప్రారంభ కార్యక్రమానికి సమితి అధ్యక్షుడు డాక్టర్ కోదాటి సుధాకర్‌రావు అధ్యక్షత వహించారు. ప్రధానవక్త వరంగల్ విభాగ్‌సంఘచాలక్ చిలుకమారి సంజీవ మాట్లాడుతూ వేసవిశిబిరంలో పాల్గొనే బాలబాలికల్లో క్రమశిక్షణ, దేశభక్తి, ఆటలు, యోగ, సంస్కృతం, చేతిరాత, చిత్రలేఖనంలో శిక్షణ ఇస్తారని తెలియజేశారు.

కార్యక్రమంలో వరంగల్ మహానగర్ సంఘచాలక్ డాక్టర్ బందెల మోహన్‌రావు, మాధవ స్మారకసమితి సభ్యులు, లక్ష్మణ సుధాకర్, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఆగ్రా కూడా కావాలా...

'ఢిల్లీలో ఉన్న ఎర్రకోటతో ఆపేశారేమి? మొగలులు నిర్మించిన తాజ్‌మహల్, ఫతేపూర్‌సిక్రీ కూడా మీవే నంటే పోయేది కదా!' ఆఖరి మొగల్ పాలకుడు బహదూర్ షా జఫార్ నిజమైన వారసురాలిని. ఎర్రకోట నాకు చెందుతుంది. కాబట్టి, ఇప్పించవలసింది' అంటూ ఒక మహిళ వేసిన వ్యాజ్యానికి సుప్రీంకోర్టు సరైన సమాధానం ఇచ్చింది. అయినా ఇదొక కేసా? దీనికి విచారణ అర్హత ఉందా అని ఆమె తరఫు న్యాయవాదిని కూడా దుమ్ము దులిపింది అత్యున్నత న్యాయస్థానం. ఇంతకీ ఆ మొగల్ వారసురాలి పేరు సుల్తానా బేగం. ఈ కేసులో విచారణకు స్వీకరించదగినంత పస ఏమీ లేదని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్ ధర్మాసనం కొట్టిపారేసింది. ఆ సందర్భంలోనే ప్రధాన న్యాయమూర్తి ఇలా స్పందించారు: 'ఈ వాదనను మేం అంగీకరిస్తే, తరువాత మీరు ఎర్రకోటతోనే ఎందుకు ఆగుతారు? ఆగ్రా కోటలు, ఫతేపూర్‌సిక్రీ, ఇంకా మిగిలిన వాటిని అడగకుండా ఉంటారా?'

సుల్తానా బేగంకు ఎవరు ఎక్కించారో తెలియదు. ఏ సెక్యులరిస్టు ఎగదోశాడో తెలియదు. తాను ఆఖరి మొగల్ పాలకుడు బహదూర్ షా జఫార్ ముని ముని మనుమడి భార్యనని, నిజమైన వారసురాలినని చెప్పుకుంటూ న్యాయస్థానాలను ఆశ్రయించింది. అందులో భాగమే ఎర్రకోట నాదేనంటూ వ్యాజ్యం వేయడం. మొత్తానికి మే 5వ తేదీన సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ ఆదేశంతో ఆమె ఆశలన్నీ కుప్ప కూలి పోయాయనే అనాలి. కొన్నేళ్లుగా ఆమె ఈ ఆస్తులన్నీ ఒడిలో వచ్చి పడతాయన్న భ్రమలోనే ఉన్నట్టు కనిపిస్తున్నది. చిత్రం ఏమిటంటే, సుప్రీం కోర్టు ధర్మాసనమే నీ కేసు ఇది, అందులో నీవు ఎర్రకోట నీదని చెప్పావు. అదేం కుదరదు అని చెబితే, ఆదేశం వచ్చిన తరువాత ప్లేటు ఫిరాయించారామె. నేను అసలు ఎర్రకోట గురించి ప్రస్తావించనేలేదు, కేవలం బహదూర్ షా జఫార్ ఇంటి మీద హక్కును మాత్రమే కోరాను అన్నారు ఏఎన్ఐ వార్తా సంస్థతో. నాకు ఎర్రకోట అంటే ఏమిటో తెలియదు. ఫతేపూర్‌సిక్రీ ఆగ్రాకోటల గురించీ తెలియదు అన్నారామె. ఇంకా, 'ఇంతకాలం నాకు కోర్టు ద్వారా న్యాయం జరుగుతుందని ఆశపడ్డాను. ఇప్పుడు తీవ్ర నిరాశ ఎదురైంద'ని నిట్టూర్చింది. ఇప్పుడు నేను ఎక్కడికి పోవాలి? ఆ ఆస్తులు ఆయనవి అని అందరినీ దేబరిస్తూ ఆయన పరువు తీయాలా? అని పెద్ద పెద్ద మాటలే ఆమె వల్లించారు. ఈమె మాటలు వింటే, ఎవడో వీర సెక్యులరిస్టు ఈమెను ఎరగా



వేసి అల్లరికి పథకం వేసినట్టు కనిపిస్తుంది. బహదూర్ షా జఫార్ ఈ దేశం కోసం ఎంతో చేశాడనీ, కొడుకునీ రాజ్యాన్నీ పోగొట్టుకున్నాడనీ ఆమె చెప్పారు. తనకు సాయం చేస్తామంటూ చాలా దేశాల నుంచి సందేశాలు అందాయని కూడా చెప్పారు. ఇక్కడ నిరాశ ఎదురై ఉండవచ్చు. అయినప్పటికి ఆమె తన దేశం వదిలి పోదట. దేశానికి వెన్నుపోటు పొడిచిన వాళ్లంతా ఇప్పుడు విలాసవంతమైన జీవితం గడుపుతున్నారని, నిజంగా దేశం కోసం త్యాగం చేసిన జఫార్‌ను గుర్తించడం లేదని, తమ కుటుంబం అంటే జఫార్ వారుసుల కుటుంబం దారుణమైన పరిస్థితులలో ఉన్నదని ఆమె అన్నారు.

బేగం మొదట తనకు ఎర్రకోటను ఇప్పించవలసిందిగా కోరుతూ ఢిల్లీ హైకోర్టుకు వెళ్లారు. కానీ అక్కడ చుక్కెదురైంది. 2021, 2024లో రెండు పర్యాయాలు ఆమెకు వ్యతిరేక ఆదేశాలే వచ్చాయి. హైకోర్టు వ్యాఖ్య గమనించాలి. ఈ కేసేదో 150 సంవత్సరాల క్రితం వేసి ఉంటే బాగుండేది, మరీ ఇంత ఆలస్యమా అంది. దీనితో సుప్రీంకోర్టుకు వచ్చారు.

1857 ఘటన తరువాత తమ కుటుంబం నుంచి ఎర్రకోటను ఈస్టిండియా కంపెనీ అధికారులు తీసేసుకున్నారని, జఫార్‌ను కంపెనీ బర్మాకు తరలించి ఆయన ఆస్తులన్నీ స్వాధీనం చేసుకుందని బేగం తన పిటిషన్‌లో గుర్తు చేశారు. అసలు విషయం ఇక్కడే ఉంది. కేంద్ర ప్రభుత్వమే ఇప్పుడు ఎర్రకోట ఆక్రమణదారు అని, కాబట్టి ఎర్రకోట మీద హక్కు ఇప్పించాలని, లేదా 1857 నుంచి నేటి వరకు ఆ కోటను ఉపయోగించుకున్నందుకు నష్ట పరిహారం ఇప్పించాలని కోర్టును కోరారు బేగం.

తన భర్త మీర్జా మహమ్మద్ బెద్రా బఖ్త్‌ను జఫార్ వారసునిగా అంటే ముని మనుమనిగా చెప్పేవారని, బఖ్త్ ముని మనుమడేనని 1960లో జవాహర్ లాల్ నెహ్రూ అధికారికంగా గుర్తించారని కూడా ఆమె చెబుతున్నారు.

నెహ్రూ అక్కడితో ఆగలేదు. ఆమె భర్తకు పింఛను కూడా ఏర్పాటు చేశారని కూడా చెప్పారామె. అన్నట్టు నెహ్రూ మంజూరు చేసిన పింఛను 1980 వరకు బేగంగారి భర్త అనుభవిం చాడు. 1965లో ఈ పించన్ అందుకోవడం మొదలయింది. ఇప్పుడు అర్థమై ఉంటుంది– బేగం గారు 2021లోనే ఎందుకు కోర్టుకు ఎక్కారో? కేంద్ర ప్రభుత్వం ఆక్రమణదారు అని ఎందుకు ఆరో పించారో! అయినా, ఈ కోర్టు గొడవ వదిలిపోయింది కాబట్టి, బేగంను ఆదుకోవడానికి ఇప్పుడు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వమో,కర్ణాటక ప్రభుత్వమో ముందుకు వచ్చే అవకాశం కూడా లేకపోలేదు. ఆఖరి మొగల్ చక్రవర్తి వారసుల కుటుంబం ఇంత బాధపడుతుంటే, మమతా బెనర్జీ, లేదా కాంగ్రెస్ పార్టీల జాలి గుండెలు కరిగిపోకుండా ఉండడం సాధ్యం కాదు. ★




## పోస్టల్ పీఆర్ఐ పటేల్ కృష్ణారెడ్డికి సన్మానం

**కరీంనగర్** పోస్ట్ ఆఫీస్ పబ్లిక్ రిలేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి పదవి విరమణ పొందిన పటేల్ కృష్ణారెడ్డికి జాగృతిపత్రిక కరీంనగర్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 30న సన్మానం జరిగింది. ఈ కార్యక్రమంలో విభాగ్ ప్రచార ప్రముఖ్ శంకరయ్య, విభాగ్ సహ వ్యవస్థా ప్రముఖ్ దావులూరి మురళిధర్, జిల్లా ప్రచారప్రముఖ్ గీకూరి శ్రీనివాస్, నగర ప్రచార ప్రముఖ్ కట్టా వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. ★

భక్తాగ్రేసరులు

## పురందరదాసు



పురందరదాసు మహారాష్ట్రలో జన్మించినా,ఆయన కుటుంబం కర్ణాటకలో స్థిరపడింది. తిరుమలేశుని భక్తులైన తల్లిదండ్రులు ఆయనకు శ్రీనివాస నాయక్ అని పేరుపెట్టారు. వారసత్వంగా వడ్డీ వ్యాపారం చేసే ఆయన ఆకస్మికంగా భక్తి మార్గం పట్టి సంపదను బీదలకు పంచాడు. విజయనగరంలో వ్యాసరాయలను ఆశ్రయించి, ఆయన ఆశీస్సులతో పురందరదాసుగా మారి హరినామ సంకీర్తనతో దేశం నలుమూలల పర్యటించాడు. సమకాలికుడు తాళ్లపాక అన్నమాచార్యను గురువుగా సేవించాడు. ఆయనను తిరుమలలో సందర్శించి, 'సాక్షుత్తు వేంకటేశుని అవతారులైన మీ దర్శనంతో నా జన్మ తరించింది. మీ కీర్తనలు నాకు పరమ మంత్రాలు అని ప్రస్తుతించాడు. అన్నమయ్య ఆయనను చేరదీసి, 'నీవూ అసామాన్యుడివి. రంగ విఠలుడి అనుగ్రహ పాత్రుడవై, సంధ్యావందనానికి ఆయనతోనే జలం తెప్పించుకున్న భాగ్యశాలివి. నీ పాటలు కర్ణాటక సంగీతానికి తొలి పాఠాలు అవుతాయి' అని ఆశీర్వదించారు.

కథ

## కోతి తెలివి!



ఓ అడవిలో పెద్ద చెరువు. దాని మధ్యలో ఓ దీవి ఉండేది. దాని నిండా పండ్ల చెట్లే. వాటి పండ్లు రుచికరంగా ఉంటాయని పక్షులు చెప్పుకుంటూ ఉండేవి. ఓసారి ఆ మాటలను విన్న కోతి, ఎలాగైనా వాటి రుచి చూడాలనుకుంది.

కోతికి ఈత వచ్చినా, ఆ చెరువు నిండా మొసళ్లే ఉండటంతో భయపడింది. దాంతో తనకు కొన్ని పండ్లు తెచ్చి ఇవ్వమని పక్షులను అడిగింది. కానీ, అవి అందుకు ఒప్పుకోలేదు. కోతి మాత్రం ఆ పండ్లను రుచి చూడాల్సిందేనని గట్టిగా నిర్ణయించుకుంది. కాస్త ఆలోచించిన తర్వాత దానికో ఉపాయం తట్టింది.

మరునాడు ఉదయమే చెరువు దగ్గరకు వెళ్లి, మొసళ్లన్నింటినీ పిలిచింది. 'నా ప్రియమైన మొసళ్లారా! నేను మృగరాజు సింహం కొలువులో ఉంటాను. తన పుట్టినరోజు సందర్భంగా ఆయన అడవిలోని జంతువులన్నింటికీ విందు ఏర్పాటు చేశాడు. మీ మొసళ్ల సంఖ్య తెలుసుకుందామని నేనిలా వచ్చాను. మీరంతా ఇక్కడి నుంచి ఆ దీవి వరకు వరసలో నిల్చుంటే నేను లెక్కిస్తాను' అని చెప్పింది.

ఎంతైనా మృగరాజు! పైగా విందు అంటున్నాడు. కాబట్టి మొసళ్లన్నీ కోతి చెప్పినట్లే చేశాయి. ఇప్పుడిక కోతి ఆనందంగా ఒక్కో మొసలి మీద నుంచి నడుచుకుంటూ దీవిలోకి వెళ్లింది. నచ్చిన పండ్లన్నింటినీ కడుపు నిండా తిని. ఓ కునుకు

పద్యం

**ప్రేమను గూర్చి యల్పునకుఁబెద్దతనంబును దొడ్డవానికిం**
**దా మతి తుచ్ఛపుంబని నెదం బరికింపక యీయరాదుగా**
**వామకరంబుతోడ గుడువం గుడిచేత నపాన వమార్గముం**
**దోమగవచ్చునే మిగులఁదోచని చేతులుగాక భాస్కరా!**

**భావం :** భాస్కరా! అధికారంలో ఉన్నవారు తమకు ప్రియమైన వారని నీచునకు గొప్ప పదవిని, గొప్పవానికి చిన్న పదవి అప్పగించకూడదు. అలాంటి అనాలోచిత చర్య, ఎడమచేతితో భుజించడం, కుడిచేతితో మలమూత్రాలను శుభ్రపరచుకోవడం వంటిది.

శ్లోకం

**జీవనే యావదాదానం స్యాత్ ప్రదానం తతోధికమ్**
**ఇత్యేకం ప్రార్థనాస్మాకం భగవాన్ పరిపూర్యతే**

**భావం :** జీవితంలో ఎంత పొందారో/సంపాదించారో అంతకంటే అధికంగా సమాజానికి తిరిగి ఇవ్వగలగాలి. హే భగవాన్! ఈ ప్రార్థన ఒక్కటీ మన్నించు.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| మెక్సికో | రియాల్ |
| బ్రెజిల్ | రూబెల్ |
| సింగపూర్ | పెసో |
| రష్యా | యెన్ |
| జపాన్ | డాలర్ |

**జవాబులు :** మెక్సికో-పెసో, బ్రెజిల్-రియాల్, సింగపూర్-డాలర్, రష్యా-రూబెల్, జపాన్-యెన్.

## శాస్త్రవేత్తలు

## మోక్షగుండం విశ్వేశ్వరయ్య (1861-1962)



మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశంలోనే గొప్ప సివిల్ ఇంజినీర్. కర్ణాటకలోని కృష్ణరాజ సాగర ఆనకట్ట నిర్మాణానికి ముఖ్య ఆర్కిటెక్ట్‌గా పని చేశారు. ఈయన ఆటోమేటిక్ స్లూయిజ్ గేట్లు, బ్లాక్ ఇరిగేషన్ సిస్టమ్‌లను కనుగొన్నారు 1955లో భారత ప్రభుత్వం ఈయనను భారతరత్న పురస్కారంతో గౌరవించింది. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల నుంచి ఎనిమిది డాక్టరేట్లు పొందారు. ఆయన పుట్టిన రోజు సెప్టెంబరు 15ను ఏటా 'ఇంజినీర్స్ డే'గా జరుపుకుంటున్నాం.

## జనరల్ నాలెడ్జ్

1. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఎప్పుడు జరుపుకుంటారు?
2. 'ఆంధ్ర తిలక్' అని ఎవరిని పిలుస్తారు?
3. నాగాలాండ్ రాజధాని ఏది?

జవాబులు : 1. జూన్ 5; 2. టంగుటూరి ప్రకాశం పంతులు; 3. కోహిమా.



తీసింది. కాసేపటి తర్వాత తిరిగి బయలుదేరింది.

'ఎప్పుడో దీవిలోకి వెళ్లిన దానివి ఇప్పటి వరకూ ఏం చేస్తున్నావు?' అని గట్టిగా ప్రశ్నించిందో మొసలి.

దానికి కోతి, 'నేను సరిగా లెక్కించలేకపోతున్నాను. నేను మీ సంఖ్య కన్నా కాసిని ఎక్కువ పండ్లను తెంపి చెరువులో వేస్తాను. మీరు వాటిని నాతోపాటు ఒడ్డుకు చేర్చండి. నేను వాటిని మృగరాజుకు చూపిస్తాను. అప్పుడిక ఏ సమస్యా ఉండదు. సరేనా!' అంది.

దాని మాటలు నమ్మిన మొసళ్లు అలాగే చేశాయి. దీవిలో చెట్ల మీద కనీసం ఒక్క పండు కూడా మిగల్లేదు. తాను కోసుకొచ్చిన వాటన్నిటిని కోతి తన మిత్రులకు పంచిపెట్టింది.

విషయం తెలుసుకున్న పక్షులు.. 'ఆ కోతి అడిగినప్పుడే దానికి కొన్ని పండ్లు తెచ్చి ఇస్తే సరిపోయేది. ఇకపై అలాగే చేద్దాం' అని కోతితో ఓ ఒప్పందానికి వచ్చాయి.

అప్పటి నుంచి కోతి హాయిగా దీవిలోని పండ్లను తినసాగింది. ★

## మెదడుకు మేత



తెల్లకోటు
తొడుక్కున్న
ఎర్రముక్కు దొర..
ఏమిటది?

జవాబు : కొవ్వొత్తి

## మంచిమాట



**గెలవాలన్న తపన**
**బలీయంగా ఉన్నచోట**
**ఓటమి అడుగైనా**
**పెట్టలేదు!**




# వారఫలాలు

12-18 మే 2025



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఇంతకాలం పడిన కష్టం ఫలిస్తుంది. నూతన ఉద్యోగావకాశాలు. సోదరులతో సఖ్యత నెలకొంటుంది. ఇంటి నిర్మాణయత్నాలు ముమ్మరం. వ్యాపారులు లాభాలు గడిస్తారు. ఉద్యోగులు పనిభారంనుంచి బయటపడతారు. కళారంగం వారికి మరింత ఊహించని అవకాశాలు. రచయితలు, క్రీడాకారులకు కొత్త ఆశలు. 16,17 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. శారీరక రుగ్మతలు. శ్రీకృష్ణాష్టకం పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

ఉద్యోగార్థులకు కొత్త ఆశలు చిగురిస్తాయి. ఆలయాలు సందర్శిస్తారు. స్థిరాస్తి వివాదాలు తీరి ఒడ్డున పడతారు. వ్యాపారులకు విస్తరణ కార్యక్రమాలు సఫలమవుతాయి, అనుకున్నంత లాభాలు. ఉద్యోగులకు ఒత్తిడులు, సమస్యలు తొలగుతాయి. రాజకీయ, పారిశ్రామికవర్గాలకు శుభవార్తలు. క్రీడాకారులు, పరిశోధకుల యత్నాలలో పురోగతి కనిపిస్తుంది. 17,18 తేదీల్లో శారీరక రుగ్మతలు. దూరప్రయాణాలు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

నిరుద్యోగులకు. ఉద్యోగలాభం.. స్నేహితులతో ఆనందంగా గడుపుతారు. వాహనాలు, భూములు కొనుగోలు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. గత సంఘటనలు గుర్తుకు వస్తాయి. సేవాకార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. భాగస్వామ్య వ్యాపారాలలో వివాదాలు పరిష్కరించుకుంటారు. పరిశోధకులు, క్రీడాకారులకు అంచనాలు నిజమవుతాయి. 12,13తేదీల్లో అనుకోని ఖర్చులు. శారీరక రుగ్మతలు. శివపంచాక్షరి పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

మీ అభిప్రాయాలను అందరూ ఆమోదిస్తారు. పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. చిన్ననాటి సంఘటనలు గుర్తుకు వస్తాయి. వాహన యోగం. ఉద్యోగులకు పనిభారం కొంత తగ్గవచ్చు. రాజకీయ, పారిశ్రామికవర్గాలకు ఇబ్బందులు తొలగుతాయి. రచయితలు, పరిశోధకులకు ముఖ్య సమాచారం. 14,15 తేదీల్లో స్వల్ప శారీరక రుగ్మతలు. కుటుంబసభ్యులతో విభేదాలు. రామరక్షాస్తోత్రాలు పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. దేవా లయాలు సందర్శిస్తారు. అందరిలోనూ మీ పట్ల గౌరవం పెరుగుతుంది. ఉద్యోగులకు విధుల్లో గందరగోళం తొలగుతుంది. పారిశ్రామికవేత్తలు, కళాకారులకు శుభవార్తలు అందుతాయి. క్రీడాకారులు, పరిశోధకులకు విజయాలు వరిస్తాయి. 15,16 తేదీల్లో అనుకోని ఖర్చులు. స్నేహితులతో విభేదాలు. హనుమాన్ ఛాలీసా పఠించండి..

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

స్థిరాస్తుల వివాదాలు కొంత సమస్యగా మారవచ్చు. గృహ నిర్మాణయత్నాలు మందగిస్తాయి. కుటుంబసభ్యులు, స్నేహితుల నుంచి ఒత్తిడులు అధికమవుతాయి. వ్యాపారులకు చికాకులు తప్పవు. ఉద్యోగులకు అదనపు పనిభారం తప్పదు. పారిశ్రామిక, రాజకీయవర్గాలకు ఒడిదుడుకులు ఎదురు కావచ్చు. 14,15తేదీల్లో ధనలాభం.. శుభవార్తలు. స్థిరాస్తి వృద్ధి. లక్ష్మీనృసింహస్తోత్రాలు పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

దీర్ఘకాలిక సమస్యలు కొన్ని తీరి ఊరట చెందుతారు. వాహనాలు, ఇళ్లు కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి. ఆలయాలు సందర్శిస్తారు. వ్యాపారులకు లాభసాటి. ఉద్యోగులకు అనుకున్న హోదాలు. రాజకీయ వర్గాలకు కొత్త పద వులు దక్కవచ్చు. కళాకారులు, క్రీడాకారులకు ఉత్సాహవంతంగా ఉంటుంది. 17,18 తేదీల్లో సన్నిహితులతో తగాదాలు. శారీరక రుగ్మతలు. కనకధారాస్తోత్రాలు పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

ఆదాయం గతం కంటే మెరుగ్గా ఉంటుంది. అప్పులు తీరి ఊరట చెందుతారు. కొన్ని సమస్యల నుంచి బయటపడతారు. దేవాలయాలు సందర్శిస్తారు. వ్యాపారస్తులకు మరింతగా లాభాలు. ఉద్యోగులకు అనుకూల మార్పులు. రాజకీయవేత్తలకు శుభవర్తమానాలు. రచయితలు, క్రీడాకారులకు కొత్త ఆశలు. 15,16 తేదీల్లో సన్నిహితులతో తగాదాలు. శారీరక రుగ్మతలు. ఆంజనేయ దండకం పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

స్థిరాస్తి వివాదాలు గందరగోళంగా మారవచ్చు. దైవకార్యాలలో పాల్గొంటారు. శారీరక రుగ్మతలు ఇబ్బంది కలిగిస్తాయి. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు. ఉద్యోగులకు విధుల్లో మనశ్శాంతి చేకూరుతుంది. పరిశోధకులు, రచయితల కృషి కొంతమేర ఫలిస్తుంది 16,17 తేదీల్లో వృథా ఖర్చులు. బాధ్యతలు పెరుగుతాయి. అన్నపూర్ణాష్టకం పఠించండి..

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

ఆశ్చర్యకరమైన విషయాలు తెలుసుకుంటారు. ముఖ్య కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేసి సత్తా చాటుకుంటారు. వ్యాపారులు అనుకున్నంత లాభాలు అందుకుని ఉత్సాహంగా గడుపుతారు. ఉద్యోగులకు కొత్త అవకాశాలు. కళాకారులు, పారిశ్రామికవేత్తల ప్రయత్నాలు విజయవంతంగా సాగుతాయి. రచయితలు, క్రీడాకారులు లక్ష్యాలు సాధిస్తారు. 16,17 తేదీల్లో శ్రమాధిక్యం. గణేశాష్టకం పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

ఆస్తుల ఒప్పందాలలో కొంత జాప్యం. శారీరక రుగ్మతలు కాస్త చికాకు పరుస్తాయి, జాగ్రత్తలు పాటించండి. సమాజంలో గౌరవమర్యాదలు. వ్యాపారులు కొంతమేర లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు విధుల్లో బాధ్యతలు మరింత పెరుగు తాయి. కళాకారులు, రాజకీయవేత్తలకు కష్టానికి ఫలితం కనిపిస్తుంది. క్రీడాకారులు, పరిశోధకులకు కాస్త ఊరట. 13,14 తేదీల్లో వృథాఖర్చులు. ఆదిత్య హృదయం పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

స్థిరాస్తి వివాదాల నుంచి గట్టెక్కుతారు. కొన్ని విషయాలు ఆశ్చర్యపరుస్తాయి. వ్యాపారులకు తగినంత పెట్టుబడులు సమకూరి లాభాలు సైతం అందుతాయి. ఉద్యోగులకు బాధ్యతల భారం నుంచి కొంత విముక్తి. పారిశ్రామిక, రాజకీయవర్గాలకు కలిసివస్తుంది. రచయితలు, క్రీడాకారులు లక్ష్య సాధనలో ముందడుగు వేస్తారు. 15,16 తేదీల్లో స్నేహితులతో తగాదాలు. స్వల్ప శారీరక రుగ్మతలు. ఆకస్మిక ప్రయాణాలు శివాష్టకం పఠించండి.

# పదరసం - 513

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | ■ | 3 | | 4 | ■ | 5 | |
| | ■ | 6 | | | ■ | | ■ | | ■ |
| ■ | 7 | | ■ | | ■ | 8 | 9 | ■ | 10 |
| 11 | | ■ | 12 | | ■ | ■ | | 13 | ■ |
| ■ | | ■ | | ■ | 14 | 15 | ■ | 16 | |
| 17 | | 18 | ■ | 19 | | | | | ■ |
| | ■ | 20 | 21 | | ■ | 22 | 23 | | ■ |
| 24 | 25 | ■ | | ■ | 26 | ■ | | ■ | 27 |
| ■ | 28 | | ■ | 29 | | 30 | ■ | ■ | |
| 31 | | ■ | 32 | | ■ | | ■ | 33 | |

## ఆధారాలు

**అడ్డం**

1. కృష్ణుడిని పెంచిన తల్లి (3)
3. ఆదిశంకరుల జన్మస్థలి (3)
5. ఇటీవల ఉత్తరాధికారిని నియమించిన పీఠం (2)
6. 'మిస్ప్రెల్' తెలుగులో (3)
7. యుద్ధం (2)
8. పాడడం (2)
11. ఓ విరామ చిహ్నం (2)
12. స్వర్గం (2)
13. మనసే..అటు నుంచి (2)
14. చెల్లించని సొమ్ము... రెండో అక్షరం హ్రస్వం (2)
16. నవరసాల్లో ఒకటి (2)
17. అంధకారం (3)
19. ఏనుగును నియంత్రించేవాడు (3)
20. భద్రాచలమే (3)
22. అర్జునుడి దశనామాల్లో ఒకటి (3)
24. ఆభరణం (2)
28. దుర్యోధనుడు ఈ యుద్ధంలో మేటి (2)
29. చివరి, మిగిలింది (3)
31. అన్నిటికి మూలం ఇదేనట (2)
32. గ్రాసం (2)
33. మొదటి రాశి (2)

**నిలువు**

1. సన్యాసి, రుషి (2)
2. ఉత్తర దిక్కుకు వ్యతిరేకం (3)
3 'సీమ'లో గణపతి ప్రసిద్ధ క్షేత్రం (4)
4. ఇంద్రజాలం..కింద నుంచి (3)
5. కనకం దీనిలా మోగదట (2)
7. ఇంచుమించు (4)
9. గౌరీపతి వాహనం (2)
10. ఏప్రిల్ తర్వాత (1)
12. మహిళకు ఓ పర్యాయపదం (2)
13. సావిత్రిపై సినిమా (4)
14. అక్క భర్త (2)
15. గవాక్షం..ఎటు నుంచైనా ఒకటే (3)
17. కవిత్రయంలో రెండవ వారు (3)
18. ఒక అప్సరస (2)
19. పాండురాజు ద్వితీయ పత్ని (2)
21. ఇదో ఫలం...రసానికి ప్రసిద్ధి (2)
23. విధం...పద్ధతి (2)
25. ఆకాశం...శూన్యం (3)
26. అల్పాహారం... గారె (2)
27. అరవై సెకన్లు (3)
29. కథకు వికృతి (2)
30. పుంలింగం (2)

## పదరసం - 512 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ధ[1] | న్య | వా[2] | దా | లు | ■ | ■ | ఆ[3] | వి[4] | రి |
| ష్ఠ | ■ | దో | ■ | ■ | తా[5] | వి[6] | ■ | పు | ■ |
| ని[7] | రు | ప | మా | నం[8] | ■ | ప[9] | ది | లం | ■ |
| ■ | ■ | వా | ■ | సా[10] | క్షా | త్తు | ■ | ■ | చె[11] |
| స[12] | ము | దా | యిం | పు | ■ | ■ | వీ[13] | వ | న |
| త్య | ■ | లు | ■ | గ[14] | డి[15] | యా | రం | ■ | టి |
| నా[16] | డి | ■ | ఆ[17] | ■ | కి | ■ | గం[18] | జి[19] | ■ |
| రా | ■ | ■ | మ[20] | రీ | చి | క[21] | ■ | బి[22] | ర్రు |
| య[23] | జ | మా[24] | ని | ■ | ■ | మ[25] | జ్జి | గ | ■ |
| ణ | ■ | టు | ■ | చం[26] | చ | లం | ■ | జి[27] | డ్డు |

# అపరిమిత హింసతో




ఒక్కో కథానాయకుడికీ ఒక్కో ఇమేజ్ ఉంటుంది. అలా...నాని ఫ్యామిలీ హీరో అని, అతను నటించిన సినిమాలను కుటుంబ సమేతంగా చూసి ఆనందించవచ్చని చాలామంది అనుకుంటూ ఉంటారు. ఒక్కోసారి ఇమేజ్ చట్రంలో ఇరుక్కుపోవడాన్ని ఇష్టపడని హీరోలు దాన్ని బ్రేక్ చేయడానికి ప్రయత్నిస్తూ, ఆ క్రమంలో పూర్తి భిన్నమైన సినిమాలు చేస్తుంటారు. అభిమానులు దానిని జీర్ణించుకోలేకపోతారు. నాని తాజా చిత్రం 'హిట్-3' అలానే అనిపించింది. నిజానికి 'దసరా' మూవీ నుండే నాని ఈ తరహా ప్రయోగాలు చేయడం మొదలెట్టాడు.

ప్రశాంతి తిపుర్నేనితో కలిసి నాని 'హిట్', 'హిట్-2' చిత్రాలను గతంలో నిర్మించాడు. ఆ ఫ్రాంచైజ్ చిత్రాలు రెండూ మంచి విజయాన్ని అందుకున్నాయి. దాంతో 'హిట్ : ది థర్డ్ కేస్'ను హీరోగా తనే భుజానికెత్తుకున్నాడు. ముందు రెండు సినిమాలను తెరకెక్కించిన శైలేష్ కొలను ఈ సినిమానూ డైరెక్ట్ చేశాడు. కథ గురించి చెప్పుకోవాలంటే... ముందు రెండు భాగాలకు ఇది కాస్తంత భిన్నమైంది. 'హిట్-2'లో ఒక సైకోను డీల్ చేయడానికి నానా తంటాలు పడే హీరో... ఇందులో ఏకంగా ఓ సైకో బ్యాచ్‌ను అదుపులోకి తేవడానికి ఎలాంటి మారణహోమం సృష్టించాడు అనే దాన్ని చాలా హింసాత్మకంగా చూపించారు. అర్జున్ సర్కార్ (నాని) వైజాగ్ హిట్ టీమ్‌లో ఎస్.పి.గా ఉంటాడు. వేర్వేరు ప్రదేశాలలో, వేర్వేరు వ్యక్తులు ఒకేలా రెండు హత్యలు చేస్తారు. వాటిల్లోని సారూప్యత సర్కార్‌ను ఆలోచనలో పడేస్తుంది. సంబంధం లేని వ్యక్తులు, సంబంధం లేని మనుషులను ఇలా ఎందుకు హత్య చేస్తున్నారనే సందేహం కలుగుతుంది. అలా దేశవ్యాప్తంగా మరికొన్ని హత్యలు జరుగుతాయి. ఒకే తరహాలో హత్యలు చేస్తున్న ఈ వ్యక్తుల లక్ష్యం ఏమిటీ? ఎందుకింత కిరాతకంగా చంపుతున్నారు? అనే దానిపై తన సహాయకులు వర్ష (కోమలి ప్రసాద్), దివాకర్ (చైతు జొన్నలగడ్డ)తో కలిసి పరిశోధన మొదలుపెడతాడు. ఈ క్రమంలో ఇటు టెర్రరిస్టులతోనూ, అటు మావోయిస్టులతోనూ గొడవ పడతాడు. ఇదే సమయంలో అతనికి డార్క్ వెబ్ సైట్ సి.టి.కె. గురించి తెలుస్తుంది. తానూ అందులో మెంబర్‌గా చేసి, ఆపైన వారి స్థావరంలోకి అడుగుపెట్టి, ఈ సైకో బ్యాచ్‌ను ఎలా అంత మొందించాడన్నదే 'హిట్-3' కథ.

'హిట్' మొదటి రెండు భాగాలు ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్స్. కానీ ఇది క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్. సినిమా విడుదలకు ముందు నుండే నాని అడిగిన వారికి, అడగనివారికి కూడా ఇందులో హింస మోతాదుకు మించి ఉంటుందని హెచ్చరిస్తున్నాడు. అయితే ఆ హింసకు ఓ జస్టిఫికేషన్ ఉంటుందని, థియేటర్లలో దానిని చూసినవారు ఆ స్థాయి హింసను ఆమోదిస్తారని నమ్మబలికాడు. కానీ ఏ రకంగా చూసినా.. ఇందులో హింసను అంగీకరించలేరు. సైకోను చంపడానికి సైకో మాదిరిగానే ప్రవర్తించాలని ఓ పోలీస్ అధికారి ద్వారా దర్శకుడు శైలేష్ కొలను చూపించే ప్రయత్నం చేశారు. అయితే... అవతలి వ్యక్తి ఎంత దారుణమైన వాడైనా.. అతనిని అంతమొందించడానికి ఇంత హింసను తెర మీద చూపించాల్సిన అవసరం లేదు. సినిమా ప్రథమార్థంలో చక్కని కథను చెబుతూ వెళ్లిన దర్శకుడు ద్వితీయార్థంలో అరగంటకుపైగా క్లయిమాక్స్‌లో ఊచకోత పైనే దృష్టి పెట్టాడు. వెండితెరపై రక్తాన్ని వరదలా పారించాడు. అది కూడా మరీ హెవీ డోసేజ్‌లో! నాని సహజ నటనను ఇష్టపడేవారు... అతని ప్యాట్రన్ మూవీస్‌ను అభిమానించే వారు తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. క్రైమ్, యాక్షన్ థ్రిల్లర్స్‌ను ఇష్టపడే కొంతమందికి 'హిట్-3' నచ్చవచ్చేమో కానీ ఫ్యామిలీ ఆడియెన్స్ మెప్పును ఈ సినిమా పొందడం కష్టమే.

మలయాళ చిత్రం 'మార్కో', హిందీ సినిమాలు 'కిల్, యానిమల్' ప్రభావం దర్శకుడు శైలేష్ కొలను, చిత్ర నిర్మాతలు నాని, ప్రశాంతి మీద ఉన్నట్టుగా అనిపిస్తుంది. అందుకే ఈ సినిమాను కూడా అదే టోన్‌లో జనాలకు అందించాలని వీరు తాపత్రయ పడినట్టుగా ఉంది. అపరిమితమైన హింస ఉన్న ఆ సినిమాలు ఆయా భాషల్లో సక్సెస్ సాధించాయి కాబట్టి, తమకూ సక్సెస్ లభిస్తుందని వీరు నమ్మినట్టుగా ఉంది. అయితే... హీరో నానికి ఉన్న ఇమేజ్ వేరు. దానికి ఓ మోస్తరు భిన్నంగా వెళ్లినా జనాలు ఆదరిస్తారేమో కానీ మరీ ఇంత దారుణమైన హింసను చూపిస్తానంటే తట్టుకోలేరు. పైగా కథను వివరించే క్రమంలో దర్శకుడు ఎంచుకున్న స్క్రీన్ ప్లే సైతం కాస్తంత కంగాళీగానే ఉంది. హీరోయిన్ శ్రీనిధి శెట్టి పాత్రను కొన్ని సందర్భాలలో మరీ బేలగా చూపించారు. ఆమె టఫ్ పోలీస్ ఆఫీసర్ అయి ఉండి... తను ప్రేమించిన వ్యక్తి సైకోల చేతిలో బందీ అయిపోయాడేమోననే అనుమానంతో చేసే హంగామా చూస్తే జాలి కలుగుతుంది. నటీనటులు అంతా తమ పాత్రలను సమర్థవంతంగానే పోషించారు. దీన్ని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయాలనుకున్న కారణంగా ఉత్తరాది నటులతోనూ కీలక పాత్రలు చేయించారు. 'హిట్-2'లో నటించిన కోమలి ప్రసాద్, రావు రమేశ్, శ్రీనాథ్ మాగంటి వారు ఇందులోనూ కనిపించారు. ఈ ఫ్రాంచైజ్ ఇంకా కంటిన్యూ అవుతుందన్నట్టుగా తమిళ హీరో కార్తీని ఏసీపీ వీరప్పన్ పాత్రలో ప్రవేశపెట్టారు. మిక్కీ జే మేయర్ సంగీతం అందించిన ఈ సినిమాకు షాన్ వర్గీస్ కెమెరా మ్యాన్‌గా చేశారు.

అభిమానులు ప్రేమగా నేచురల్ స్టార్ అని పిలుచుకునే నాని ఈ మధ్య అన్నీ అన్ నేచురల్ క్యారెక్టర్సే చేస్తున్నాడు. అందులో భాగంగా 'ది ప్యారడైజ్' సినిమా తెరకెక్కబోతోంది. దాని టీజర్ చూసిన వాళ్లు కొందరు నాని గెటప్ చూసి బెంబేలెత్తిపోయారు. తన రాబోయే 'ది ప్యారడైజ్' మూవీకి ప్రేక్షకులను మానసికంగా సిద్ధం చేయడానికే నాని 'హిట్-3'లో ఇంత హింసకు తావిచ్చాడా? అనే అనుమానం ప్రేక్షకులకు కలుగకపోదు.

**– అరుణ, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్**



# త్రిశక్తి



శత్రువుకు చుక్కలు చూపించడంలో భారత్ అసమానమైన శక్తి సామర్థ్యాలకు నిదర్శనంగా అరేబియా సముద్రంలో యుద్ధనౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌పై కొలువుదీరిన మిగ్-29కే విమానం, గగనంలో హెలికాప్టర్ విన్యాసం, నేల పైన కమాండోల అస్త్ర ప్రదర్శన.



From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 77 Issue : 29


# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు



వెల : ₹.300/-



వెల : ₹.300/-



వెల : ₹.100/-



వెల : ₹.160/-



వెల : ₹.200/-



వెల : ₹.499/-



వెల : ₹.300/-



వెల : ₹.120/-



వెల : ₹.300/-



వెల : ₹.180/-



వెల : ₹.350/-



వెల: PB ₹.550/-



వెల :₹.450/-



వెల : ₹.699/-



వెల : ₹.150/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!
సాహిత్య నికేతన్ : కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138
వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠీ, హైదరాబాద్. 9440589722,
సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, రామమందిరంవీధి, గవర్నరు పేట, విజయవాడ - 2. 8333812687